తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
21 Glorious years
epaper.vaartha.com WWW.VAARTHA.COM విజయవాడ fb.com/vaartha

PUBLISHED FROM VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
28-8-2017 సోమవారం సంపుటి :23 సంచిక : 208 పేజీలు :12 వెల : 5.00

నంద్యాల విజేత ఎవరో!


భూమా బ్రహ్మానంద రెడ్డి


శిల్పా మోహన్ రెడ్డి

తీవ్ర ఉత్కంఠ మధ్య నేడే ఫలితం

భారీ పోలీసు బందోబస్తు మధ్య ఓట్లలెక్కింపు

కర్నూలు, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాకరంగా ఈనెల 23వ తేదీన జరిగిన కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గపు ఉప ఎన్నికకు సంబంధించి ఓట్లలెక్కింపు భారీ పోలీసుబందోబస్తు మధ్య సోమవారం జరుగనుంది. నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 8గంటలకు ఓట్లలెక్కింపు ప్రారంభమై మధ్యాహ్నం 12గంటలకు ఫలితం వెలువడనుంది. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టరు సత్యనారాయణ, జిల్లా జాయింటు కలెక్టర్, నంద్యాల ఉప ఎన్ని రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అలాగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ రాయలసీమ రీజియన్ పోలీసు ఐజి ఇక్బాల్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తులో కర్నూలు పోలీస్‌రేంజ్ డిఐజి శ్రీనివాస్, ఎస్‌పి గోపినాథ్‌జెట్టితో పాటు ఒక అడిషనల్ ఎస్‌పి, ముగ్గురు డిఎస్‌పిలతో పాటు 20మంది సిఐలు, 50మంది ఎస్‌ఐలు, 200మంది కానిస్టేబుళ్లు పాల్గొంటున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన పాసులు కలిగిన అధికారులు, మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతించనున్నారు. నంద్యాల పట్టణంతో పాటు గోస్పాడు మండలం, నంద్యాల రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 2,18,850 మంది ఉండగా 1,73,335 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 1,11,018 మందికి గాను 88,503 మంది ఓటు వేశారు. పురుషుల్లో 1,07,778 మంది ఓటర్లుకు గాను 84,831 మంది తమఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇతరులైన 62మంది ఓటర్లలో ఒకరు మాత్రమే తమ ఓటు వేశారు. మొత్తం ≫2

పనిచేసే వారికే పట్టం కట్టండి..

టిడిపి పాలనలోనే ఏపి అభివృద్ధి

డ్వాక్రా, మెప్మా సృష్టించింది నేనే

పార్టీకి వెనుకబడిన వర్గాలు వెన్నుదన్ను

కాకినాడ రోడ్‌షోలో సిఎం చంద్రబాబు


ఆదివారం కాకినాడ రోడ్‌షోలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

కాకినాడ, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర విభజన నేపధ్యం తెలుగుదేశం ప్రభుత్వ మూడేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని, వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలలను అమలుచేసి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబుపేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాననే నమ్మకంతో నాకు ఓట్లు వేసి ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టారని, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నానని సిఎం చెప్పారు. కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండవరోజైన ఆదివారం జగన్నాధపురం, అంబేద్కర్‌భవన్ తదితర ప్రాంతాలలో నిర్వహించిన రోడ్‌షోలు, సభల నుద్దేశించి సిఎం మాట్లాడారు. ఎంతో అభివృద్ధి చేసిన హైదరాబాద్‌ను వదులుకుని రాష్ట్రానికి నూతన రాజధాని ఉండాలనే ఉద్ధేశ్యంతో కట్టుబట్టలతో అమరావతి చేరుకుని ఆరు నెలలో తాత్కాలిక రాజధాని నిర్మించిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని చంద్రబాబు ≫2



విశ్వాసాల పేరుతో హింసను సహించం

డేరా బాబా అనుచరులకు ప్రధాని మోడీహెచ్చరిక

న్యూఢిల్లీ, అగస్టు 27 : మతం, విశ్వాసాల పేరుతో దేశంలో హింసను ప్రేరేపించడాన్ని తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితిలోనూ అనుమతించబోదని తేల్చి చెప్పారు ప్రధాని. ఆదివారం ఆయన తన నెలవారీ రేడియోకార్యక్రమం 'మన్ కిబాత్'లో మాట్లాడుతూ, చట్టం ముందుకు ప్రతి ఒక్కరూ సమానమేనని, డేరా గురువు గుర్మీత్ రామ్ రహీం అనుచరులు సృష్టించిన అల్ల కల్లోలం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేసారు. దేశంలో ప్రస్తుతం గణేష్ ఉత్సవాలు జరుగుతున్నాయని, స్వాతంత్ర్య సమరాంగంలోనూ సగటుభారతీయుడిని ఏకతాటిపై నడిపించిన ఘన చరిత వీటి సొంతమని అన్నారు. స్వర్గీయ బాలగంగాధర తిలక్ నేతృత్వంలో 125 ఏళ్ల క్రితం వినాయక చతుర్ధిని, సర్వజనిక్ గణేష్ ఉత్సవ్‌గా నిర్వహిస్తూ ప్రజలను స్వతంత్రం పోరాటంలో భాగస్వాములను చేయగలిగారన్నారు. సామాజికంగా, విద్యాపరంగానూ ప్రజలలో అవగాహన పెంచేలా నిర్వహించే ఈ మహాపర్వ పదిరోజుల పండగ జాతి ఐక్యతకు సమానత్వానికి, యధార్ధతకు, నిజాయితీకి బాసటగా నిలుస్తుందని చెప్పారు. ఇదే సమయంలో కేరళలో ప్రారంభమవుతున్న ఓనం పండుగ ఆ ప్రాంతాన్ని పూర్తిగా రంగు మయం చేయబోతున్నారని, అలాగే దేశంలోని అనేక మంది ముస్లింలో ఈద్-ఉల్-జుహా పండుగ జరుపుకో బోతున్నారన్నారు. ఒకే సమయంలో దేశంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ఉత్సవాలకు విఘాతం కలిగించేలా హింసాత్మక ఘటనలు జరగటం ఆందోళన కలిగించే అంశమేనని అన్నారు.

కాకినాడలో అభివృద్ధి శూన్యం

పోరాడి ఓడిన సింధు
-'ఆట'లో


ఆదివారం కాకినాడలో బహిరంగ సభనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్సీ అధినేత జగన్

తెలుగుదేశం ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

కాకినాడ రోడ్‌షోలో ప్రతిపక్ష నేత జగన్

కాకినాడ, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధాదాలను విస్మరించి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని, హామీలు నెరవేర్చే వరకూ సిఎం చంద్రబాబునాయుడిని నిలదీయాలని ప్రతిపక్ష నాయకుడు, వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని, మూడున్నరేళ్ళ పాలనలో రాష్ట్రంలో ఏ విధమైన అభివృద్ధి చేసారో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కాకినాడ కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అన్నమ్మఘాటీ, జగన్నాధపురం, సినిమా రోడ్డు, ధైరీఫారం సెంటర్ తదితర ప్రాంతాలలో జగనో మ్మహన్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ధైరీఫారం సెంటర్ వద్ద నిర్వహించిన బహిరంగనుద్యేశించి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చంద్రబాబునాయుడు పూర్తిగా రాష్ట్ర ప్రపజలను మోసగించారని, ఏఒక్క హామీ అమలు చేయకుండా పచ్చి ఆబద్దాలు మాట్లాడుతూ కాకినాడలో ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. ఓట్ల సమయంలోనే కాకినాడ అబివృద్ధి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నిస్తూ, చంద్రబాబును బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపునిచ్చారు. అధికార పగ్గాలు చేపట్టి మూడున్నరేళ్లు కావస్తున్నా తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడలో ఏ విధమైన అభివృద్ధి చేపట్టారో చంద్రబాబు చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు.

మహాకురుక్షేత్రం మరో ఏడాదిన్నరలో జరగనున్న నేపధ్యం ఇప్పుడు వైఎస్సార్సీని కాకినాడలో గెలిపించి అభివృద్ధికి పాటుపడాలని నగర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. నంద్యాల ఉప ఎన్నికలు అయిన వెంటనే టిడిపి నాయకులు బహిరంగంగా కత్తులతో స్వైరవిహారం చేసినా, తుపాకులతో కాల్పులు జరిపినా వారిపై కేసులు పెట్టకుండా చంద్రబాబు ప్రభుత్వం అరాచకాలకు పాల ్పడుతుందని ఆరోపించారు. రైళ్లను వారే తగుల బెట్టి ,దాన్ని సాక్షిగా చిత్రీకరించి కేసులు పెట్టించేవారు మనకు కావాలా అంటూ జగన్ ప్రశ్నించిన నేపద్యం నగరప్రజల నుంచి ఆనూహ్య స్పందన లభించింది. మ్యానిఫెస్టో అంశాలను అమలు చేయాలని నిలదీస్తే ,పాదయాత్రలు చేస్తే,కంచాలు మోగిస్తే కేసులు పెడతారు. అడ్డగోలుగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసే నీచరాజకీయం చంద్రబాబుదని జగన్ విమర్శించారు. గొప్పగా ప్రచారం చేసుకునేందుకు గత ఏడాది గోదావరి పుష్కరాల్లో 29 మందిని బలిగొన్న చంద్రబాబుపై ఇప్పటి వరకూ ఏ విధమైన కేసు నమోదు చేయలేదంటే ఆయన ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉందో చెప్పకనే తెలుస్తుందని జగన్ అన్నారు. విశాఖ జిల్లాలో వేల కోట్ల భూమి రికార్డులు మాయమైపోతున్నాయని, మాటలు చెప్పి మోసంచేసిన పాలన వద్దుబాబోయ్ అనే రోజు వచ్చిందన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని అనే నినాదంతో అదికార పగ్గాలు చేపట్టి ఏ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వకుండా, కనీసం నెలకు రూ 2వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారన్నారు. 39నెలలు నుండి ఒకొక్క నిరిద్యోగికి ఇప్పటి వరకూ రూ.78వేలు రావల్సి ఉంటుందని, ఇప్పటి వరకూ ఒక్క పైసా ఇవ్వకుండా నిరుద్యోగ యువతిని మోసం చేసాడని పేర్కొన్నారు. అదికారంలోకి వచ్చిన తరువాత ≫2

బంగాళాఖాతంలో అల్పపీడనం

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 27,ప్రభాతవార్త: అల్పపీడనం వల్ల తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు ఉపరితల అవర్తనం ఏర్పడింది. ద్రోణి కూడ కొనసాగు తోంది. దీని వల్ల తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురు స్తున్నాయి. ఆదివారం కూడ అనేక ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి. ఉత్తర ఒడిశా పశ్చిమ బెంగాల్ తీరం అనుకొని వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల అవర్తనం ఏర్పడింది. ఈ ప్రభావం వల్ల రానున్న 48 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లోను, ముఖ్యంగా కోస్తా ప్రాంతాల్లో వానలు పడతా యని వాతవరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల భారీ వర్షాలుకురిసే అవకాశం వుందని, మిగిలిన ప్రాంతాల్లో రానున్న తేలికపాటి వానలు కురిసే అవకాశం వుందని వాతావరణ కేంద్రం తెలిపారు.

డేరాబాబాకు శిక్షపై నేడు తీర్పు 8లో

ముద్రగడ పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు


ఆదివారం వీరవరంలో ముద్రగడను తమ అదీనంలోకి తీసుకున్న పోలీసులు

పోలీసుల అదుపులో ముద్రగడ

పోలీసులు, కాపుల మధ్య ఘర్షణ

లాఠీ చార్జి, తీవ్ర ఉద్రిక్తత

పోలీసు జీపుకు నిప్పు, టైర్లు దహనం

పెద్దాపురం డిఎస్పీపై సస్పెన్షన్ వేటు?

కాకినాడ, ఆగస్టు 27, ప్రభాతవార్త ప్రతినిధి: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మరోక సారి ఆదివారం రోడ్డెక్కారు. మెట్ట ప్రాంతానికి చెందిన వేల సంఖ్యలో కాపులు, కాపు సంఘాల నాయకులు కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి చేరుకున్నారు. ఈ నేపద్యం కాపులతో కలిసి ముద్రగడ పాదయాత్రను ప్రారంభించడంతో ఒక్కసారిగా పోలీసులు అవాక్కై, అప్రమత్తమయ్యారు. ముద్రగడ ఇంటి వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికెట్లును దాటుకుని మరీ ముద్రగడ పాదయాత్ర ప్రారంభిం చడంతో ఆయన వెంట ఉన్న వేల సంఖ్యలో కాపులను అదుపుచేసేందుకు పోలీసులు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. అడుకున్న పోలీసులను పక్కకు నెట్టివేసి మరీ ముద్రగడ, ఆయన అనుచరులు పాదయాత్రను కొనసాగించడం ఇప్పుడు జిల్లాలోనే గాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ముద్రగడ తన ఇంటి వద్ద నుంచి రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగించిన నేపద్యం పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ నేపద్యం ముద్రగడ, ఆయన అనుచరులు, కాపు జెఏసి నాయకులు, వేలసంఖ్యలో కాపులురోడ్డుపై భైటాయించి ఆందోళనకు దిగారు. పోలీసులు, కాపుల మధ్య తీవ్ర స్థాయిలో ≫2



ఆదివారం చెన్నై వచ్చిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికిన తమిళనాడు గవర్నర్ విద్యాసాగర్ రావు

అభివృద్ధి శూన్యం

బెల్టు షాపులను తొలగిస్తామని హామీ ఇచ్చి తొలిసంతకంపోగా రోడ్డు పక్క ఉండే షాపులను ఇంటిముందుకు వచ్చి మద్యాన్ని ఏరులైపారిస్తున్నారని విమర్శించారు. పొదుపు సంఘాలకు రూ 14వేల కోట్లు రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని ,ఒక్కరికీ కూడా మాఫీ జరగలేదన్నారు. రైతులకు 87వేల 6కోట్లు రుణాలు మాఫీ జరగలేదనిఅన్నారు. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం తీసుకొస్తాని గొప్పకు పోయి వాటి ఊసే లేదని విమర్శించారు.మిర్చి యార్డుల్లో వారం రోజులు నిరాహార దీక్ష చేస్తే ధర 500కోట్లు రూపాయలతో ధర స్థిరీకరణ చేస్తానని అమలు చేయలేదని తెలిపారు. 108 ఎమర్జెన్సీ అంబులెన్సు నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. పెట్రోలియం యూనివర్సిటీ ,కాకినాడలో మరో పోర్టు, పెట్రోలియం కారిడార్,కాకినాడ స్మార్ట్ సిటీ అని, ఎల్ఎంజి టెర్మినల్ అని ,కాకినాడ తీరంలో సముద్ర తీరంలో ప్లాస్టింగ్ హబ్ అని ప్రజలను మోసం చేసేందుకే చంద్ర బాబు నాయుడు చెపుతున్నాడని తెలిపారు. కాకినాడలో డంపింగ్ యార్డ్ కు కనీసం స్థలం లేని కారణంగా ఉంటే ,దోమలపై దండయాత్ర చేసి సాధించింది ఏమిటని విమర్శ చేసారు. కాకినాడ పట్టణంలో సుమారు 700 కిలో మీటర్ల డ్రైన్ ల్లో దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా తయారు అవుతున్నాయని,కుక్కలు,పందులు ,దోమలు ఉంటున్నాయని విమర్శ చేసారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేని కారణంగా కాకినాడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాకినాడలో సుమారు 80శాతం అక్షరాస్యులు ఉన్నారని ప్రజలకు ఇచ్చిన బహిరంగ ప్రచారాలు చేస్తున్న నాయకులను కాలర్పట్టుకుని నిలదీయాలని తెలిపారు. మత్స్యకారులకు 2 నెలలు విరామ సమయంలో ప్రభుత్వం ఇస్తామన్న నాలుగువేల రూపాయలు ఇంత వరకూ ఇవ్వలేదని ,తాము అధికారం లోకి వస్తే రెండు నెలలకు యాభై కేజీలు బియ్యం, 5వేల రూపాయలు అందించడంతో పాటు జరుగుతున్నదని మత్స్యకారులకు తెలిపారు. నవరత్నాలు ప్రతి ఒక్కరూ తెలుసుకుని కురుక్షేత్ర యుద్ధంలో వైఎస్ఆర్‌పార్టీని గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఎన్నికల్లో మోసం చేసే చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటికి ఒక మారుతీకారు,కేజీ బంగారం ఇస్తానని హామీ ఇచ్చినా మోసపోవద్దని ప్రజలకు జగన్ విజ్ఞప్తి చేశారు. ఏటిమొగలో దాదాపు 50 ఎకరాలకబ్జాకు సిటీఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్పడ్డాడని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీమంత్రులు బొత్స, పినిపే విశ్వరూప్,వైఎస్సార్సీ నేతలు కురసాల కన్నబాబు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, దాడిశెట్టి రాజా, కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పట్టం కట్టండి..

అన్నారు. ప్రతి ఒక్కరూ తాత్కాలిక రాజధాని నిర్మాణాన్ని చూడాలని, రాజధాని నిర్మాణాన్ని చూస్తే ప్రభుత్వం ఏ స్థాయిలో రాజధాని భవనాలు నిర్మించిందో తెలుస్తుందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో డ్వాక్రా, మెప్మా సంఘాలను స్థాపించడం జరిగిందని, ఆ సంఘాలలో మహిళలు వారి కాళ్లపై వారు నిలబడే విధంగా రూ.కోట్లు కేటాయించడం జరుగుతుందని, భవిష్యత్తులో సంఘాలకు మరింత చేయూత నిచ్చేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటుతో సరైన బుద్ధిచెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. కాపు సామాజిక వర్గ నాయకులు కొంత మంది తనను నేరుగా కలిసి తమకు రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదని చెప్పారని, వెనుకబడిన వర్గాలకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా కాపులకు రిజర్వేషన్ల విషయంలో న్యాయం చేసి ఇచ్చిన మాటను తాను నిలబెట్టుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే బిసిలకు జీరో శాతం కూడా అన్యాయం జరగకుండా చూసుకుంటానని, పార్టీకి వెన్నుదన్నుగా ఎప్పుడూ, ఎప్పటికీ వెనుకబడిన తరగతులేనని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల కోసం రూ.10వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేశామన్నారు. గత కాంగ్రెస్ పాలన భూకబ్జాలు, విచ్చలవిడి అవినీతికి వేదికగా కొనసాగిందని, ఇప్పుడు టిడిపి ప్రభుత్వంలో అటువంటివేమీ లేవన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ బుకీలుగా నాయకులు, కార్యకర్తలు తయారయ్యారని వైకాపానుద్దేశించి సీఎం చంద్రబాబు విమర్శలు చేశారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. చేతివృత్తులు, ఇతర కులవృత్తుల వారికి కూడా సౌకర్యాలు కల్పిస్తున్నామని, పేద వాటి ఇంటికి 75 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని, పిల్లలు విదేశాల్లో చదివేందుకు రూ.10లక్షల వరకు వెచ్చిస్తున్నామని సీఎం చెప్పారు. ప్రశాంతతకు, భద్రతకు మారుపేరుగా ఉన్న కాకినాడకు మరో పులివెందుల చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి ప్రయత్నాలను అడ్డుకట్ట వేసి పులివెందులను కాకినాడగా తయారు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడ నగరం ఎంతో సుందరమైందని, అందమైన నగరాలలో ఛత్తీస్‌గఢ్ తరువాత కాకినాడ మొదటి వరుసలో ఉంటుందన్నారు. కాకినాడ నగరాన్ని అతిసుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు, అధికారంలో ఉన్న తెలుగుదేశం, మిత్రపక్షమైన బిజెపి రెండు పార్టీలకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని సీఎం చంద్రబాబు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు జరుగుతున్న 48 డివిజన్లలోనూ పార్టీ విజయం సాధిస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. కాకినాడను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు అవకాశం ఇవ్వాలన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో కాల్చేయాలని, చంపేయాలని, ఉరితీయాలని తనపై అసభ్యంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని, నాకు భద్రత లేకపోతే సామాన్యులైన మీకు భద్రత ఎక్కడుంటుందని, అటువంటి సంస్కృతి మనకు..మన పిల్లలకు కావాలా అంటూ జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం తీవ్రంగా విమర్శించారు. తాగునీటికి రూ. 250కోట్లు కేటాయించామన్నారు. సొంత ఇల్లు నిర్మించుకోవాలనే ప్రతి ఒక్కరి కల నెరవేరేందుకు తాను బాధ్యత వహిస్తానని పేర్కొన్నారు. ఎల్ఇడి బల్బులు వేసి ప్రతి గ్రామంలోను వీధి దీపాలను వెలిగిస్తున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని, గతంలో అధికారులను పరిగెత్తించే వాడినని, జవాబుదారీతనంతో పనిచేసే విధానం కావాలనే ఉద్దేశ్యంతోనే ఉద్యోగులకు కొంత సమయం ఇచ్చానని, మళ్లీ ఆకస్మిక తనిఖీలు శ్రీకారం చుట్టే రోజు దగ్గరలోనే ఉందని సీఎం చెప్పారు. ఏ పని కావాలన్నా ఆఫీసుకు వెళ్లకుండా సెల్‌ఫోన్ ద్వారా ఇంటి వద్ద నుండే ప్రజలు తమ పనులను సక్రమంగా నిర్వహించుకునేందుకు ఆన్‌లైన్ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. తెలుగుదేశంలో ఉంటూ తప్పు చేస్తే తాను క్షమించేది లేదన్నారు. పార్టీలో ఉంటూ తిరుగుబాటు బావుటా ఎగురవేసిన కార్యకర్తల నుద్దేశించి సీఎం మాట్లాడారు. రెబల్స్‌గా బరిలోకి దిగిన ఇప్పటికైనా విత్‌డ్రా అయ్యి పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని, లేనిపక్షంలో అటువంటి వారిని పార్టీ నుంచి బహిష్కరించడం జరుగుతుందన్నారు. నెగ్గినతరువాత పార్టీలో చేర్చుకుని అనుకుంటే అది పొరపాటని, పార్టీకి వెన్నుపోటు పొడిచే వారిని తిరిగి పార్టీలో తీసుకునే ప్రసక్తే లేదని, అటువంటి వారిని వీధికి వంద మందిని తయారు చేయగల సత్తా తెలుగుదేశం పార్టీకి ఉందని చంద్రబాబు రెబల్స్‌ను ప్రత్యక్షంగా హెచ్చరించారు.



సిఎం చంద్రబాబు రోడ్‌షోకు హాజరైన అశేష ప్రజానీకం

48 డివిజన్లలోను తెలుగుదేశం, బిజెపి అభ్యర్థులను గెలిపించి ఓటు ద్వారా తెలుగుదేశం పార్టీపై ఉన్న విశ్వాసాన్ని చూపించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా సంఘాలు, మెప్మా సంఘాలను తానే స్థాపించానని, మెప్మా సంఘాలు తన మానస పుత్రికలని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచేందుకు రూ.33వేల కోట్లు పేదల కోసం ఖర్చు పెడుతున్నానని చంద్రబాబు తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అని అన్న నందమూరి తారక రామారావు అన్న వాక్యాలను తూచ తప్పకుండా తాను పాటిస్తున్నానని, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగే విధంగా వారికి ప్రోత్సాహకాలు ఇస్తూ ఆర్థికంగా భరోసా ఇస్తున్నామన్నారు. చంద్రన్న భీమా ప్రవేశపెట్టి మృతి చెందిన వెంటనే రూ.5వేలు, పెద్ద కర్మ రోజున మొత్తం రూ.2లక్షలు అందించేందుకు రంగం సిద్ధం చేసామని, దానిలో భాగంగానే సంతాప తీర్మానం కూడా అందజేయడం జరుగుతుందని చంద్రబాబు అన్నారు. ఓటు ద్వారా తెలుగుదేశం పార్టీని నెగ్గించి బలాన్ని చేకూరిస్తే తనకు కొండంత బలం వస్తుందని, కొండనైనా పిండిని చేసే బాహుబలిగా తయారవుతానని చెప్పారు.

ఎస్ఇజడ్, ఫార్మా పెట్రోకారిడార్ ఈ ప్రాంతాల్లో నెలకొంటే ఇక్కడ కొన్ని కోట్ల పెట్టుబడులు వస్తాయని, తద్వారా ఆర్థికంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సిఎం పేర్కొన్నారు. పరిశ్రమలు రావడం వలన ఇక్కడ నిరుద్యోగ సమస్యలు లేకుండా ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికి కూడా మనం ఉద్యోగావకాశాలను కల్పిస్తామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు అధికారంలో ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని కాకినాడ అభివృద్ధి కోసం తెలుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

అనంతరం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను సిఎం చంద్రబాబు నగర ప్రజలకు పరిచయం చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పనితీరును సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా కొనియాడారు. కాకినాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు నగర ప్రజలు అవకాశం ఇవ్వాలని సిటీ ఎమ్మెల్యే కొండబాబు ఈ సందర్భంగా నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీలు తోట నరసింహం, కంబంపాటి హరిబాబు తదితరులు అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తొలుత ఎడిబి రోడ్డులోని లక్ష్మిపరిణయ ఫంక్షన్ హాల్‌లో వివిధ కుల సంఘాల నాయకులతో సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్పొరేషన్ ఎన్నికల పనితీరుపై ఆ సంఘాల నాయకులతో సమీక్షించారు. పార్టీ విజయం సాధించే విధంగా ఆయా డివిజన్లలో కుల సంఘాల నాయకులు పర్యటించి, పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని సూచించారు. ఏఏ డివిజన్లలో ఏఏ అభివృద్ధి పనులు కావాలనే దానిపై సంఘాల నాయకుల నుంచి చంద్రబాబు అడిగితెలుసుకున్నారు. మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, కె. నారాయణ, జవహర్, గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, కిమిడి కళా వెంకట్రావు, ఎంపీలు తోట నరసింహం, మురళీమోహన్, పండుల రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, వనమాడి కొండబాబు, గోరంట్ల బుచ్చియ్యచౌదరి, ఎస్‌విఎస్ వర్మ, ఆనంద రావు, కాకినాడ ఎంపి తోటనరసింహం, రాజమండ్రి ఎంపి మురళీమోహన్, ఎమ్మెల్సీలు రవికిరణ్‌వర్మ, లక్ష్మిశివకుమారి, ఆదిరెడ్డి అప్పారావు, పార్టీ సీనియర్ నేతలు చైతన్యరాజు, గన్ని కృష్ణ, గట్టి సత్యనారాయణ, వనమాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకున్న పోలీసులు

ఘర్షణ వాతావారణం చోటుచేసుకున్న నేపథ్యం పరిస్థితి అదుపుతప్పింది. దీంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి డిఐజీ రామకృష్ణ, ఎస్పీవిశాల్‌గున్నీ, పెద్దఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. అనుమతి లేకుండా పాదయాత్ర ఏ విధంగా చేపడుతున్నారంటూ ముద్రగడను డిఐజి ప్రశ్నించి, పాదయాత్రను విరమించుకోవాలని ఆయనకు సూచించారు. ఈ నేపద్యం ముద్రగడ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి గత నెల రోజులపైబడి తనను ఇంటిలో బందించడం ఎంతవరకూ సమంజసమని, ఏవిధమైన శుభకార్యాలకు, దిన కార్యాలకు వెళ్ళనీయకుండా బందించడం ఎంతవరకూ సమంజసమని డిఐజి, ఎస్పీలను ముద్రగడ ప్రశ్నించారు. పాదయాత్రను విరమించుకునే ప్రసక్తే లేదని, జైలుకైనా వెళ్ళడానికి సిద్ధమేనని ముద్రగడ పోలీసులకు చెపుతూనే వేలాది మంది కాపుల సమక్షంలో కిర్లంపూడి నుంచి వీరవరం వరకూ ముద్రగడ పాదయాత్రను కొనసాగించారు. ఇక్కడ ముద్రగడను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరిగి ఆయన స్వగ్రామమైన కిర్లంపూడికి తరించేందుకు తరలి స్తుండగా, కిర్లంపూడి రామచంద్రపురం గ్రామం వద్ద వేలాది మంది కాపులు ముద్రగడను తరలిస్తున్న పోలీసు వాహనాన్ని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, కాపుల మధ్య ఇక్కడ తీవ్రస్థాయిలో వాగ్వి వాదం చోటుచేసుకుని ఘర్షణ వాదావరణం నెలకొంది. ఇక్కడ కాపులపై పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఈ పరిస్థితిలో కాపు జేఏసి నాయకుడు వాసిరెడ్డి ఏసుదాసుకు, కొంత మంది కాపులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ పరిస్థితిలో కాపు సంఘాల నాయకులు, కాపులు మరింత రెచ్చిపోయి పోలీసు వాహనానికి నిప్పు పెట్టి, వాహనం టైర్లను అంటించారు. ఇక్కడ చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసి పెద్ద ఎత్తున కాపులు నిరసన వ్యక్తం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ముద్రగడ పాదయాత్ర చేయడంపై పోలీసు ఉన్నతాధికారులు కింది స్థాయి పోలీసులపై చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది. పెద్దాపురం డిఎస్పీ సిహెచ్ రామారావుపై సస్పెన్షన్ వేటు పడినట్టు తెలుస్తోంది. అయితే సిఐ, ఎస్ఐ స్థాయి పోలీసులపై కూడా వేటు వేసినట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని మాత్రం పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా ప్రకటించ కుండా సమాదానం దాట వేస్తున్నారు. అయితే మెట్ట ప్రాంతంలో ఇప్పుడు పలు గ్రామాలలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ముద్రగడకు మద్దతు తెలుపుతూ జాతీయ రహదారి ఎక్కిన కాపులపై పలు చోట్ల పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఇప్పుడు మెట్టలో ఏ క్షణంలో ఏ విధమైన చర్యలకు పోలీసులు ఉపక్రమిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కిర్లంపూడి మండలంలోని గోనాడలో బైటాయించి ఆందోళనకు దిగిన ముద్రగడను పోలీసులు అదుపులోకి తీసుకుని, తిరిగి తన నివాసానికి చేర్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

SINGAM KUIL BLUE SUNDAY
Draw No:115 DrawDate on:27/08/17

SINGAM SERIES	KUIL SERIES
1st Prize Rs.10.000/- S 562782	1st Prize Rs.10.000/- K 096611
2nd Prize Rs.7.000/- 62220	2nd Prize Rs.7.000/- 18677
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
00814 00989 07973 11095 27065	08766 24490 36534 43663 48802
37146 39403 46042 72260 94821	51614 61622 64026 65702 85341
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0269 1145 2137 3357 3537 4777 5690	1348 1563 1591 2050 2146 3653 5433
6801 8243 8809	6430 6562 8418
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
1611 3566 3689 4690 5338 5402 5643	0128 0229 2094 3683 4691 4912 5399
7553 9783 9906	6452 7109 8687
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0030 1455 2918 4263 5786 7953 9434	0006 1701 3639 5115 6103 7964 9396
0137 1516 2928 4504 5933 7993 9474	0108 1840 3768 5261 6154 8019 9605
0164 1643 2944 4623 6199 8254 9601	0332 2025 3857 5324 6347 8104 9677
0250 1700 3138 4754 6204 8426 9687	0640 2026 3878 5347 6493 8284 9691
0319 1877 3236 4856 6491 8474 9746	0712 2118 4202 5468 6547 8407 9729
0356 2239 3244 4911 6816 8558 9759	0764 2195 4213 5489 6759 8547 9808
0589 2250 3310 5020 6937 8566 9774	0770 2201 4316 5625 6849 8554 9811
0623 2257 3349 5108 7149 8655 9801	0849 2345 4627 5633 7267 8606 9827
0750 2263 3385 5216 7169 8796 9805	1099 2408 4685 5678 7663 8625 9836
0808 2369 3536 5257 7177 8935 9864	1253 2470 4704 5718 7720 8699 9851
0833 2394 3690 5490 7464 8978	1255 2603 4711 5782 7732 8918
1097 2484 3809 5497 7550 9159	1316 2687 4719 5792 7815 8992
1319 2634 3861 5594 7884 9213	1502 2719 4780 5831 7818 9026
1346 2751 3862 5609 7888 9312	1555 2999 5002 5872 7852 9113
1377 2889 3980 5626 7896 9317	1608 3603 5091 6049 7862 9388

ROSA DEER SILVER SUNDAY
Draw No:115 DrawDate on:27/08/17

ROSA SERIES	DEER SERIES
1st Prize Rs.10.000/- R 131116	1st Prize Rs.10.000/- D 399812
2nd Prize Rs.7.000/- 97551	2nd Prize Rs.7.000/- 58004
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
02757 03275 06029 11759 16356	01880 08514 10873 19460 46112
20492 23216 28097 54784 84006	53630 66858 68161 82991 84241
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0264 1776 2157 2519 2559 3831 4247	0187 0302 2725 3150 3518 4801 5811
6710 6740 9672	6275 7040 9637
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0058 0190 0942 1132 1540 2076 2608	0451 1402 2494 3543 5159 6076 7199
2674 2964 5181	8051 8578 8735
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0081 1417 2733 4169 5978 7918 8814	0138 2226 3676 4989 6772 7742 9231
0236 1450 2953 4269 6303 7935 8892	0173 2299 3744 5093 6802 7830 9249
0257 1507 3207 4539 6584 8119 8916	0281 2350 3772 5255 6842 7869 9294
0272 1517 3290 5054 6598 8256 9261	0424 2468 3776 5323 6844 8001 9389
0440 1580 3319 5196 6608 8280 9359	0510 2632 4016 5498 6979 8039 9511
0533 1612 3493 5277 6620 8289 9597	0687 2767 4110 5564 7056 8173 9765
0571 1616 3696 5517 6635 8344 9653	0718 2771 4152 5573 7188 8313 9782
0815 1648 3705 5526 6715 8375 9716	0912 2785 4183 5753 7349 8462 9924
0998 1671 3787 5533 6872 8398 9826	1067 3115 4318 5821 7370 8531 9928
1238 2069 3829 5541 7099 8409 9920	1208 3208 4420 5888 7415 8552 9949
1312 2174 3859 5558 7208 8421	1404 3273 4499 6299 7481 8644
1339 2207 3949 5712 7213 8435	1536 3285 4642 6356 7538 8685
1342 2383 4130 5721 7289 8509	1594 3309 4652 6440 7670 8768
1372 2643 4139 5762 7468 8540	1879 3351 4948 6527 7725 9067
1395 2699 4149 5977 7753 8795	1960 3629 4975 6707 7737 9226

THANGAM NALLANERAM EFFORT SUNDAY
Draw No:115 DrawDate on:27/08/17

THANGAM SERIES	NALLANERAM SERIES
1st Prize Rs.10.000/- T 037227	1st prize Rs.10.000/- N 279323
2nd Prize Rs.7.000/- 55593	2nd Prize Rs.7.000/- 70537
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
01501 17370 19666 28346 33371	01655 03460 23158 41570 46655
45892 58903 61067 70614 94120	50915 67984 77681 88767 93092
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0323 2570 2942 3055 6186 6682 8029	0793 1799 3305 3380 3423 4065 5252
8106 8604 9182	6567 7117 8846
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0785 0908 1264 2259 2540 3023 8042	1154 1752 2728 3762 4210 4461 4655
8911 9463 9733	7424 8121 9012
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0354 1894 3209 5244 6617 7900 9421	0012 1782 2949 4262 5464 7282 8501
0479 1913 3622 5295 6704 8149 9487	0210 2018 3013 4277 5560 7315 8818
0800 2060 3808 5321 6714 8411 9512	0273 2044 3075 4293 5614 7444 8898
0826 2107 3946 5377 6890 8445 9553	0288 2248 3102 4295 5957 7477 9032
0878 2148 3993 5414 7007 8464 9734	0648 2351 3134 4307 6028 7727 9333
1056 2402 4197 5550 7043 8466 9748	0758 2377 3383 4430 6226 7729 9518
1156 2411 4510 5699 7226 8500 9756	0787 2378 3387 4583 6543 7828 9711
1252 2565 4588 5748 7283 8623 9760	0861 2427 3589 4727 6585 7925 9728
1331 2663 4598 5844 7375 8638 9834	0916 2481 3765 4746 6647 7928 9869
1479 2897 4613 5901 7581 8738 9995	1037 2579 3820 4887 6699 8047 9915
1550 2994 4650 6098 7658 8812	1038 2595 4000 5011 6766 8143
1554 3003 4825 6120 7660 8879	1047 2781 4003 5149 6922 8150
1688 3010 5041 6287 7667 8927	1625 2784 4084 5183 7008 8176
1694 3030 5045 6313 7682 9225	1633 2855 4161 5296 7112 8326
1811 3194 5173 6600 7854 9286	1740 2927 4196 5426 7244 8486

KUMARAN VISHNU THUNDER SUNDAY
Draw No:115 DrawDate on:27/08/17

KUMARAN SERIES	VISHNU SERIES
1st prize Rs.10.000/- K 837310	1st prize Rs.10.000/- V 300349
2nd Prize Rs.7.000/- 20100	2nd Prize Rs.7.000/- 61341
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
02235 03976 05204 33378 45197	09116 13736 15423 36171 41238
56076 74925 78010 79063 95107	49542 56205 58095 70951 79326
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0342 1166 2034 2327 2333 2701 3453	0709 1053 1998 2734 3142 3544 4203
3484 7713 9277	5122 6097 8144
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0364 2126 3680 3889 4647 4662 5696	0520 0523 1140 3557 3618 3784 5928
6415 9025 9443	7940 8835 8889
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0050 1427 2683 3961 5598 7433 9417	0044 1787 2967 4837 6245 7520 9191
0062 1487 2787 4137 5729 7506 9418	0170 2160 3049 4927 6793 7599 9245
0087 1530 2844 4151 5861 7514 9509	0380 2296 3205 5138 6901 7653 9477
0101 1537 2847 4328 5966 7541 9525	0543 2362 3266 5225 6975 7986 9577
0291 1795 2865 4434 6132 7675 9635	0574 2431 3284 5238 6977 8180 9634
0336 1908 2941 4509 6137 7841 9777	0947 2476 3373 5435 6988 8187 9651
0396 1935 2996 4557 6179 7983 9807	0954 2492 3570 5684 6991 8301 9707
0411 1975 3074 4575 6221 8002 9845	1083 2532 3813 5715 7006 8361 9719
0420 2012 3496 4646 6381 8116 9908	1269 2601 3892 5874 7121 8433 9731
0688 2065 3571 4826 6515 8287 9972	1336 2646 4165 5906 7242 8521 9877
0697 2400 3575 4935 6604 8504	1415 2700 4330 5948 7314 8632
0779 2433 3669 5268 6787 9084	1497 2742 4712 5972 7347 8682
1214 2444 3742 5284 6951 9135	1547 2765 4758 6069 7381 8761
1294 2537 3752 5304 7299 9214	1734 2882 4831 6157 7413 8985

అమరావతి అభివృద్ధిలో రైతుకే తొలి ప్రాధాన్యం

రాజధాని కోసం భూములిచ్చిన వారికి లబ్ధి

సిఆర్డీఏ అధికారులతో సిఎం చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు27 ప్రభాతవార్త: ప్రపంచ దేశాల నుంచి అమరావతికి భారీ పెట్టుబడులు రానున్న నేపథ్యంలో రాజధాని నగరంలో భూముల్చిన రైతులకు అగ్రతాంబులం ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో పాటే లక్షలాదిగా ఉద్యోగుల కల్పన, రాష్ట్ర జీడీపీలో వేలాది కోట్ల వృద్ధి నమోదయ్యేలా చర్యలు తీసుకోవడానికి అన్ని విధాల రంగం సిద్ధం చేసింది. ఆదివారం జరిగిన టెలీ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బ్యాంకును ఏర్పాటు చేసి, భూముల్చిన రైతులకు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలన్నారు. రాజధాని నగరాభివృద్ధిలో ప్రతి అంశమూ రైతుకు తెలిసేలా సమాచార బ్యాంక్‌ను రూపొందించాలని సీఎం చంద్ర బాబు ఆదేశించారు. రాజధానినగరంలో చేపట్టే ప్రతిఅభివృద్ధి కార్యక్రమం లోనూ రైతును భాగస్వామిని చేయాలని వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. అమరావతి ఎలా రూపు దిద్దుకుంటుందో ప్రతి రైతుకూ తెలిసేలా చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రపంచలో ఏ మూలన ఉన్నా అమరావతిత నగర వైభవం, నగర నిర్మాణ ప్రణాళిక ఒక్క చిటికెలో తెలిసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు హితబోధ చేశారు. రాజధాని కోసం తమ జీవితంలో అంతర్భాగమైన, బతుకుల్లోనూ భాగమైన భూములను ప్రభుత్వానికి సమర్పించారని ప్రతిక్షణం రైతు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకోవాల్సిందేనన్నారు. రైతుల త్యాగాన్ని ఒక్క నిమిషం కూడా విస్మరించే ప్రసక్తేలేదన్నారు. రైతన్న జీవన శైలిలో గణనీయమైన మార్పు రావాలని సీఆర్డీఏ అధికారులకు ఆయన సూచిం చారు. నగరాభివృద్ధి ఫలాలు భూమినిచ్చిన ప్రతి రైతుకూ దకాల్సిందేనని చంద్రబాబు స్పష్టంచేశారు. అమరావతిలో రైతుకే తొలి ప్రాధాన్యం అనే నినాదంలో ముందుకు సాగాలని ఆదేశించారు. ప్రపంచ శ్రేణి నిపుణులతో కూడిన బృందంతో రాజధాని నగరాభివృద్ధి రైతులకు భాగస్వామ్యం, వారికి సహకారంపై చైతన్యం కలిగేలా అవగాహన సదస్సులను నిర్వహించనున్నా మని సీఆర్డీఏ కమిషనర్ చెప్పారు. ఈ సందస్సులో రాజధాని నగర నిర్మా ణంలో కీలక ఘట్టాలు, వాటి వల్ల భూములిచ్చిన రైతులకు కలిగే ప్రయోజనాల గురించి సవివరంగా తెలియజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కమి షనర్ వివరించారు. రాజధాని నగరంలో 27స్వీయ సమృద్ధి టౌన్‌షిప్‌లు రానున్నాయని సీఎం చంద్ర బాబుకు ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ చెప్పారు. రాజధాని సమ్మిళిత అభివృద్ధితో పాటు ఆర్థిక అర్థికాభివృద్ధి కేంద్రంగా మారన్నదని వివరిం చారు. రాజధాని నగరానికి అవసరమైన సమగ్రా ట్రాఫిక్,రవాణా, వ్యవస్థలపై జపాన్ ఇంటర్నేషనల్ కో అపరేషన్ ఏజెన్సీ(జైకా) సన్నద్ధమైందని తెలిపారు. త్వరలోనే దీనిపై అధ్యయనం చేసి సీఆర్డీఏకు నివేదక అందజేస్తానని జెకా హామీ ఇచ్చిందని అజయ్‌జైన్ వెల్లడించారు. అమరావతి మైలిక సదుపాయాల్లో భాగంగా 85కిలోమీటర్ల రహదారులకు టెండర్లు పిలిచామని ఆయన వెల్లడించారు. ఈ రహదారుల నిర్మాణానికి రూ.1245 కోట్లు వ్యవయమవుతున్నాయన్నారు. వీటితో పాటు 26కిలోమీటర్ల మేర మెగా రహదారులుక ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈ మెగా రహదారులకు రూ.890కోట్లు నిధులు వ్యయమవుతాయన్నారు. అమరా వతి నగరంలో అబివృద్ధి కారణంగా మూడేళ్లలో 40,000నుంచి 70,000 ఉద్యోగాల యువతకు లభిస్తాయన్నారు. రాష్ట్ర జీడీపీకి రూ. 4000కోట్లు అదనంగా వచ్చేందుకు అవకాశముందని శ్రీధర్ వివరించారు. 20ఏళ్లలో రాష్ట్ర జీడీపీలో అదనంగా రూ.30000కోట్ల మేర వృద్ధికి అమరావతి నగరం దోహదపడుతుందని 11లక్షల ఉద్యోగాల కల్పించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మన అమరావతి యాప్ రాజధాని రైతులకు అరచేతిలోనే సమగ్ర సమాచారాన్ని అందిస్తుందని, భూములు వివరాలు, ధరలు, సమీపంలో అభివృద్ధి, భవిష్యత్తు గురించి తెలియజేసి భవిష్య దర్శిణి గా ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమకు వచ్చిన ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవచ్చో బ్యాంకుల నుంచి లభించే రుణ సహాయమెంతో, భవన నిర్మాణ అనుమతులు ఎలాగో కూడా తెలసుకునే వెసులబాటు ఉంటుందని ముఖ్యమంత్రికి వివరించారు. మన అమరావతి యాప్ వల్ల దళారుల ప్రమేయం ఉండదని, సొంతంగా తమ నగర అభివృద్ధి గురించి తెలుసుకునే వీలుంటుందని అధికారులు పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ నెంబరును టైపు చేసిన వెంటనే వారి భూములతో సహా సమగ్ర సమాచారం లభిస్తుందన్నారు. ఇదొక విధంగా రైతులకు సమాచార పెన్నిధని, కోరిన సమాచారాన్ని చిటికెలో అందించే యాప్‌గా మన అమరాతి ఉంటుందని అధికారులు వివరించారు. రైతుల చేతిలో గైడ్‌గానూ ఉంటుందన్నారు. అమరావతి నగరంలోని 13జిల్లాలో రైతుల ప్లాట్లు విస్తరించి ఉంటాయని సీఆర్డీఏ కమిషనర్ చెప్పారు. ఈ 13జోన్లలో ఇప్పటికే మూడింటిలో మౌలిక సదుపాయాల కోసం టెండర్లను కూడా ఆహ్వానించామని ఆయన వివరించారు. నెల రోజుల్లో 8జోన్లకూ మౌలిక సదుపాయాల కోసం టెండర్లను పిలుస్తామన్నారు. ఏడేళ్లలో రూ.15,672కోట్లు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇందుకోసం హడ్కో, ప్రపంచబ్యాంకు, తదితర ఆర్థిక సంస్థల సహాయమందిస్తాయని తెలిపారు. రాజధాని నగరంలో ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలుం టాయని అజయ్‌జైన్‌చెప్పారు. రాజధాని నగరాభి వృద్ధికి తీసుకుంటున్న చర్యల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి కోసం రూ.35,500ఎకరాల భూ సమీకరణ చేపట్టిన విధానంపై హార్వర్డ్ వర్శిటీ అధ్యయనం చేసేందుకు ముందకు రావడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో అమరావతికి ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కిందన్నారు.

వారం - వర్జ్యం
28-8-2017 సోమవారం
హేవళంబి నామ సంవత్సరం దక్షిణాయనం
భాద్రపదమాసం శుక్లపక్షం
సప్తమి రా. 12.21
విశాఖ రా. 9.25
రా. ఉ. 7.30-9.00
వ. రా. 1.49-3.33

విజేత ఎవరో!

ఓటర్ల కోసం 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఓట్లను 11రౌండ్లలో లెక్కించనున్నారు. ఇందుకోసం 55 టేబుళ్లను ఏర్పాటు చేశారు. నువ్వానేనా అన్నట్లుగా సాగిన ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా భూమా బ్రహ్మానందరెడ్డి, వైకాపా అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ నేత శిల్పామోహన్‌రెడ్డి, జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ తరపున కార్మికనేత అబ్దుల్ ఖాదర్, రాయలసీమ పరిరక్షణ సమితి అభ్యర్థిగా బనవాశి పుల్లయ్యతోపాటు మరో15మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పోటీలో పలువురు అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధానపోటీ టిడిప,వైకాపా అభ్యర్థుల మధ్యనే నెలకొంది. ఎన్నిక జరిగిన ఐదురోజుల తర్వాత సోమవారం ఓట్లలెక్కింపు జరుగనుంది. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన టిడిపి, వైకాపా, కాంగ్రెస్, ఇతర అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. పోలింగ్ ముగిసిన తర్వాత పలు వార్తా సంస్థలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు, ఇంటెలిజెన్స్ శాఖ, విజయవాడ మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్, టీం ఎన్నికల్లో పలుపార్టీల అభ్యర్థులు గెలుస్తారని తమ సర్వేలో తేలిందని ప్రకటించారు. లగడపాటి రాజగోపాల్ గ్రూపు తన సర్వేలో టిడిపి గెలుస్తుందని, వైకాపా ద్వితీయస్థానంలో ఉంటుందని, కాంగ్రెస్‌పార్టీ తమమనుగడకోసం నాలుగైదు శాతం ఓట్లు సాధించవచ్చునని ప్రకటించింది. వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సలహాదారుడు ప్రశాంతికిశోర్ టీం నిర్వహించిన సర్వే బృందం వైకాపా 5వేలతో గెలుస్తుందని మీడియా మాధ్యమాల్లో ప్రకటించారు. ఎన్నికల కోసం నంద్యాలలో దాదాపు రెండుమాసాలు మకాంవేసి టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయానికి కృషి చేసిన మంత్రులు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహ్‌రెడ్డి విడివిడిగా తమ అభ్యర్థి భూమాబ్రహ్మానందరెడ్డి 25వేల మెజార్టీ సాధిస్తారని మీడియాకు తెలిపారు.

ఇకపోతే వైఎసాసర్సీ నాయకులు కూడ తమ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి 10వేల నుంచి 20వేల మెజార్టీతో విజయం సాధిస్తారని చెప్పుకొచ్చారు. మైనార్టీలు, మహిళల ఆదరణతో తమ గెలుపుఖాయమని వైకాపా వర్గాలు ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్‌నేతలు మాత్రం 2014 ఎన్నికల కన్నా ఈ సారి మెరుగైన ఓట్లు సాధిస్తామని పేర్కొన్నారు. ఇకపోతే కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు కూడ పోలింగ్‌సరళిపై టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి రూ.5వేల నుంచి 10వేల ఓట్ల మధ్య గెలుస్తారని ఆ వర్గాలు తమ ప్రభుత్వాలకు నివేదించినట్లు సమాచారం.

ఈ క్రమంలో జరుగుతున్న ఓట్లలెక్కింపులో ఎవరి సర్వేలు నిజమవుతాయో తేటతెల్లం కానుంది. ఎన్నికల బరిలో నిలచిన అభ్యర్థుల విజయంపై కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమలోని అనంతపురం, కడప, చిత్తూరు, తెలంగాణలోని మహబుబ్‌గనగ్, గద్వాలతో పాటు వరంగల్ జిల్లాలో కూడ అభ్యర్థులు కూడ వారి గెలుపుపై బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం. అభ్యర్థుల గెలుపుపై లక్షకు 2లక్షలు, 3లక్షలకు 6లక్షలు, 4లక్షలకు 8లక్షలు, పదిలక్షలకు 20లక్షల మేర పెట్టినట్లు తెలిసింది. కొన్ని ప్రాంతల్లో పొలాలు కూడ బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం.

రైతు సంక్షేమం కోసం మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

భారతీయ కిసాన్‌సంఘ్ రైతు దినోత్సవసభలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ



భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో కేశవ మెమోరియల్‌లో జరిగిన రైతు దినోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తునన కేంద్ర కార్మిక, ఉపాధిశాఖమంత్రి బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. బలరామ జయంతి సందర్భంగా తెలంగాణ భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని కేశవ మెమోరియల్‌లో రైతు దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ భారతదేశానికి రైతే వెన్నెముక అని రైతుల భాగస్వామ్యంతోనే దేశం మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. రైతులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ప్రధానమంత్రి మోడీ రైతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు, విత్తనాలను కొందరు వ్యాపారులు అక్రమంగా విక్రయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ విత్తనాలను విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. సాగునీరు, ఇరవై నాలుగు గంటల పాటు విద్యుత్‌సరఫరా కాలానికి అనుగుణంగా పంటలను వేసుకుంటే రైతులకు లాభదాయంగా ఉండడంతో పాటు రైతు ఆత్మహత్యలు ఉండవని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూరిత చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.18కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రైతులు స్వాభిమానంతో జీవించేందుకు కేంద్రం అండగా ఉంటుందన్నారు. విద్యుత్‌నియంత్రణ మండలి సభ్యులు (ఫైనాన్స్) రిటైర్డు ఐఆర్ఎస్ హెచ్.శ్రీనివాసులు, బికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్యాద అంజిరెడ్డి, బికెఎస్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యవాహ ఎక్కా చంద్రశేఖర్, బికెఎస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పన్యాల వెంకట్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి బి.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో రహస్య ఒప్పందాన్ని కెసిఆర్ బయట పెట్టాలి

సాగునీటి ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల జేబులు నింపటానికే?

తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖాయం: కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి



ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

నారాయణపేట, ఆగస్టు 27 ప్రభాతవార్త: టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపితో రహస్య ఒప్పందాన్ని చేసుకుని మసలుతుందని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి కృష్ణ సరాఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తలు సమావేశానికి ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ కెసిఆర్ ఢిల్లీ వెళ్లి మోడీతో రహస్య సమావేశాలు చేస్తున్నారని అందులో భాగంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో టిఆర్ఎస్ ప్రతినిధులు నిర్బందంలో ఓట్లు వేయించారన్నారు. ఎన్నికల ఓటుకు రాజకీయ, సైద్దాంతిక కారణాలు చెప్పాలన్నారు. బిజెపితో ఎలాంటి సభందం ఉందో ప్రజలకు బయట పెట్టాలన్నారు. టిఆర్ఎస్‌కు బిజెపితో లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. ఎన్నికలలో ఓటు వేస్తే మోది తెలంగాణ రాష్టానికి ఎంచేశారో చెప్పాలన్నారు. టిఆర్ఎస్ కంటే ఆంధ్రాలో టిడిపి పార్టీ మేలని, వారు భహిర్గతంగా బిజెపితో ఒప్పందం చేసుకున్నారన్నారు. ప్రాజెక్టుల విషయమై మాట్లాడుతూ రాష్టంలో సాగునీటి ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల జెబులు నింపటానికేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పున ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీనికోసం అన్ని పత్రిపక్ష పార్టీలు ఉద్యమాలు చేశాయన్నారు. పాలమూరు రంగారెడ్డి పథకం తరువాత చివరకు ఇక్కడి ప్రాంతానికి నీరు ఇవ్వటం సాధ్యం కాదన్నారు. జివో 69ని కాదనటానికి పాలమూరు రంగారెడ్డి పథకం పేరు చెప్పి ప్రజలను ప్రభుత్వ తప్పుదోవ పట్టింస్తుందన్నారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులను రాష్ట ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుందో అర్థం కావటం లేదన్నారు. ఇది అప్రజాస్వామికమన్నారు. పాలక పక్ష ఎమ్మెల్యేలను సైతం సిఎం కలవరని విమర్శించారు. పాత పాలమూరు జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వమే పథకాలను తెచ్చిందన్నారు. సిఎంకు ప్రజలకు సమాధానం ఇచ్చే సంప్రదాయం లేదని విమర్శించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఏహామిని అమలు పరచలేదన్నారు. దళితులకు 3ఎకరాలు భూమి, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు, లంబాడాలకు 12శాతం రిజర్వేషన్లు, రైతులకు ఒకే విడతలో రుణాలు మాఫీ చేయలేదన్నారు. ఇంతటి బాధ్యతారాహిత్యమైన పాలన తానుఎప్పుడు చూడలేదన్నారు. కాంగ్రెస్ ఒకటే తెలంగాణలో టిఆర్ఎస్‌ను ఓడించగల పార్టీఅని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో సానుభూతి ఉందని, గత పాలనలో తాము చేసిన పథకాలు ప్రజల మనసులో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. రాష్టంలో వర్గపోరుపై మాట్లాడుతూ ఇది సాధారణమని పార్టీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి కృష్ణసరాఫ్, కెంచి నారాయణ, డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాటాలు

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న బి.వి.రాఘవులు

హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 27 ప్రభాతవార్త: సామాజిక న్యాయం కోసం పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, దళిత్‌పోషన్ ముక్తి మంఛ్ జాతీయ నాయకులు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో దళిత్‌పోషన్ ముక్తి మంఛ్(డిఎస్ఎంఎం) ఆధ్వర్యంలో 'రాజ్యాంగం-సామాజిక న్యాయం-సవాళ్ళు' అనే అంశంపై సదసు ్స ఎపిపూర్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకిమాధవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ నీతి ఆయోగ్ ఏప్రిల్ నెలలో కేంద్రానికి సమర్పించిన నివేదికలో మూడురకాల ప్రణాళికలున్నాయని, అందులో 3 సంవత్సరాలకు చెందిన ప్రణాళిక చూస్తే గుండె అదురుతుందని, దేశంలో అసమానతలు రూపుమాపడానికి రిజర్వేషన్లు ఎంతో అవసరమని, అయితే రిజర్వేషన్లు తీసివేసేందుకు కుట్రలు కూడా చేస్తున్నారని, ఇక సామాజిక న్యాయం ఎక్కడ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ప్రభుత్వ రంగంలోనే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం 3 శాతం ఖర్చు తగ్గించుకోవాలని ఎజెండాలో సూచించారని, అయితే దేనిలో ఖర్చు తగ్గించుకోవాలని, విద్య, వైజ్ఞానిక ఖర్చు తగ్గించాలా అని ప్రశ్నించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయిందని, అనేక పోరాటాలు చేస్తే ఎస్సీ, ఎస్టీ ప్లాన్ చట్టం వచ్చిందని, దేశంలో ఉన్న చట్టాలన్ని సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం అవుతుందని అంటున్నారని, అసలు ఈ చట్టం ఎక్కడ అమలు అవుతుందని ప్రశ్నించారు. రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు మాట్లాడుతూ దేశంలో ఉన్న అసమానతలు తగ్గించాలని రాజ్యాంగంలో రాసుకున్నాయని, అది రాతలకే పరిమితం అయిందని అన్నారు. దేశ సంపద ప్రజలందరికి చెందుతుందని, అసమానతలు తగ్గించటానికి ప్రభుత్వం పన్నులు వసూలుచేసి పేదవారికి విద్య, వైద్యం వంటి సేవలను అందించాలన్నారు. 70శాతం ఆదాయపు పన్ను ఉండేదని, ఇప్పుడు 30శాతానికి తగ్గించారని, ఇది ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. దళిత్‌పోషన్ ముక్తి మంఛ్(డిఎస్ఎంఎం) జాతీయ కన్వీనర్, కేరళ శాసనసభ మాజీ స్పీకర్ రాధాకృష్ణణ్ మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం ఎక్కడ అమలు కావడం లేదని అన్నారు. బిజెపి ప్రభుత్వం దళిత, మైనారిటీపై దాడులు చేయిస్తోందని, స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అయినా దళిత, ఆదివాసీలకు స్వేచ్ఛలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో దళిత, ఆదివాసీలకు రక్షణ కల్పించారన్నారు. దళిత్‌పోషన్ ముక్తి మంఛ్(డిఎస్ఎంఎం) జాతీయ నాయకురాలు, మాజీ ఎంపి సుభాషిణి ఆలీ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బలవంతంగా హిందుత్వాన్ని ప్రజలపై రుద్దుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు, కేరళ మాజీ ఎంపి సోమప్రసాద్, మాజీ ఎంపిలు రామచంద్ర, ఆశీమ్ బాలా, పశ్చిమబెంగాల్ మాజీ మంత్రి దేబిష్ వాసు, కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శు స్కైలాబ్ బాబు, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నేత రాంమాధవ్‌తో బిసి నేతల భేటీ

చట్టసభల్లో బిసిబిల్లు పెట్టి 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని వినతి



బిజెపి నేత రాంమాధవ్, డాక్టర్ లక్ష్మణ్‌లను కలిసిన బిసి నేతలు ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, పెరికసురేష్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 27పభాతవార్త: పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పూర్తిస్థాయి మద్దతు ఇవ్వాలని కోరుతూ వివిధ బిసి సంఘాల నాయకులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బిజెపి జాతీయ నేత రాంమాదవ్‌ను, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌లను కలిసి చర్చిం చారు. రాజకీయరంగంలో బిసిల ప్రాతినిధ్యం 14శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వ గణాంకాల ద్వారా స్పష్టమైందన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో పార్లమెంట్, అసెంబ్లీలలో 69ఏళ్ల బిసి ప్రాతినిధ్యం సర్వే చేయగా 14శాతంకు మించలేదంటే బిసిలకు జరిగిన అన్యాయం స్పష్టమవుతోందన్నారు. ప్రజాస్వామ్యం ధన స్వామ్యంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో డబ్బులులేని బిసిలు గెలువలేరని ఆవేదన వ్యక్తం చేశారు. 69ఏళ్ల భారత ప్రజా స్వామ్య వ్యవస్థలో 56శాతం ఉన్న బిసిలకు రాజకీయ రంగంలో 14శాతం లేదని, చట్ట సభల్లో బిసి రిజర్వేషన్ల ఆవశ్యకతను వెల్లడిస్తుం దన్నారు. మెజార్టీ ప్రజలైన బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. కుల పునాదులపై సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థ నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. దీని మూలంగా మెజార్టీ కులాలు ఈనాటికి అత్యంత పేదరికంలో ఉన్నాయని తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో మెజార్టీ ప్రజలకు రాజకీయ, పాలన, విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రాతినిధ్యం లేకపోవడానికి కారణాలు వెతకాల్సిన అవసరం ఉందన్నారు. బిసి లకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించడానికి మౌలిక చర్యలు, సంస్థాగతమైన చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలని, చట్ట సభల్లో బిసిలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు, ఉద్యోగాల్లో ప్రమోషన్లు కల్పించాలని, దీని కోసం రాజ్యాంగ సవరణ చేయాలని ఈ సందర్భంగా కోరారు, ఈకార్యక్ర మంలో గుజ్జకృష్ణ, గుజ్జరమేష్, నీల వెంకటేశ్, నర్సింహ్మా, పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం బేగంపేట విమానాశ్రయంలో కేంద్రమంత్రి అరుణ్ జైట్లీతో కేంద్రమంత్రి దత్తాత్రేయ, డాక్టర్ లక్ష్మణ్

జైట్లీ దృష్టికి చింతపండుపై జిఎస్టీ

హైదరాబాద్, ఆగస్టు 27పభాతవార్త: కేంద్ర కార్మిక ఉపాధిశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ చింతపండుపై 12శాతం జిఎస్టీ విధించడంమే ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఆదివారం జైట్లీ తిరుగు ప్రయాణంలో బేగంపేట్‌కు వీడ్కోలు పలికేందుకు వచ్చిన దత్తాత్రేయ జైట్లీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బేగంబజార్ వర్తక సంఘం ఆధ్వర్యంలో తనతో కలిసిన విషయాన్ని జైట్లీ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో చింతపండుకు పన్ను లేదని, నేడు 12శాతం పన్ను విధించడం జరిగిందని దీంతో అటు అమ్మకం దారులకు, ఇటు కొనుగోలు దారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జైట్లీకి తెలిపారు. అదే విధంగా పత్తి, పసుపు తదితర వాణి జ్య పంటల కొనుగోలు విషయంలో జిఎస్టీతో ఇబ్బందులు ఉన్నట్లు జైట్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అరుణ్‌జైట్లీ వచ్చే నెలలో హైద రాబాద్‌లో జరిగే జిఎస్టి కౌన్సిల్ సమావేశంలో కూలంకషంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గోదావరిఖనిలో వ్యక్తి దారుణ హత్య

కత్తులతో దాడి చేసి హతమార్చిన దుండగులు

గోదావరిఖని, ఆగస్టు 27 ప్రభాతవార్త: పెద్దపల్లిజిల్లా రామగుండం మండలం లోని గోదావరిఖని పట్టణం ఉదయ్ నగర్‌లో ఆదివారం ఉదయం వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం పట్టణం లోని ఉదయ్‌నగర్‌కు చెందిన అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీను (40) అనే వ్యక్తిని ఆదివారం ఉదయం సుమారు 8.30గంటల సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. అడ్డొచ్చిన శ్రీనివాస్ భార్యపై సైతం దాడి చేయగా ఆమె చేతికి గాయాలయ్యాయి. మృతుడు గతంలో గోదా వరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పనిచేసిన ఎర్రగోళ్ల రమేష్, సర్పంచ్ ప్రశాంత్, పుట్ట శారద హత్య కేసులతోపాటు పలు కేసులలో నిందితునిగా అభియోగం ఎదుర్కొంటున్నాడు. శ్రీనివాస్‌పై గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. సంఘటన స్థలాన్ని రామగుండం పోలీస్ కమీషనర్ విక్రమ్ జిత్ దుగ్గల్, పెద్దపల్లి డిసిపి విజేందర్ రెడ్డి, ఎసిపి అపూర్వరావు, సిఐ గజ్జి క్రిష్ణ పరిశీలించి మృతుని భార్య అంజలి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన అరుకోళ్ల శ్రీనివాస్ (ఫైల్)



అంజలి నుంచి వివరాలను అడిగి తెలుసుకుంటున్న సిపి దుగ్గల్

మాటల గారడీ చేస్తున్న టిఆర్ఎస్ సర్కారుకు కాలం చెల్లింది : సబితారెడ్డి

నార్సింగి, ఆగస్టు 27 ప్రభాతవార్త : పనులు తక్కువగా, ప్రచారం ఎక్కువగా చేస్తూ మాటల గారడీతో నెట్టుకొస్తున్న టీఆర్ఎస్ సర్కారుకు కాలం చెల్లిందని మాజీ హోంశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గండిపేట్ మండల కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షులు గొల్ల నాగేష్ యాదవ్ నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు మాజీ హోంమంత్రి సబితారెడ్డి నివాసనికెళ్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ టీఆర్ఎస్ సర్కారు చేస్తున్న జిమ్మిక్కులు రాష్ట ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని, ఇక నుంచి సర్కారు తప్పిదాలను ఎక్కడికక్కడే తూర్పారబట్టేందుకు ప్రజలు సిద్ధపడుతున్నారని వివరించారు. గత పదేళ్ల కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నేటికీ కనిపిస్తున్నాయని, మూడేళ్ల కాలంలో టీఆర్ఎస్ సర్కారు కొత్తగా చేసిందేమి లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంగా టీడీ నిధులను నిలిపివేసి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పిటిసీలు తమకు ఓట్లేసిన ప్రజల సమస్యలను పరిష్కరించలేక ముఖం చాటేస్తున్నారని పేర్కొన్నారు.

మున్నూరు కాపు మహాసభ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వేణుగోపాల్

శంషాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: తెలంగాణ మున్నూరు కాపు మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రంగారెడ్డి జిల్లాకు చెందిన బుక్క వేణుగోపాల్‌ను నియమిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య ప్రకటించారు. బుక్క వేణుగోపాల్ లాంటి చురుకైన యువ నాయకుడి సేవలు మున్నూరు కాపుల అభ్యున్నతికి ఎంతో అవసరం అని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు డాక్టర్ పుంజుల వినయ్‌కుమార్, పుట్టం పురుషోత్తంరావులతో పాటు తెలంగాణలోని వివిధ పార్టీలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శుల సమక్షంలో ఆదివారం ప్రకటించారు. జనాభాలో అధిక శాతం ఉన్న మున్నూరు కాపులతో పాటు ఇతర బిసి కులాలను సంఘటితం చేసి రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న చితక పదవులను బిసిలు ఎస్సీలకు ఇచ్చి ఎమ్మెల్యే ఎంపి సిఎం పదవులను అగ్రకులాల వారు అనుభ విస్తున్నారని అన్నారు. రాజ్యాధికారం కోసం మున్నూరు కాపులు ముందు ఉండి పోరాటం చేయాలన్నారు.



బుక్కా వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు నాయకులు

కుంతియా రగిల్చిన కుంపట్లు

కాంగ్రెస్‌లో రగులుతున్న పర్మినెంట్ చిచ్చు

'హస్త'వాసి ఎలా ఉండేనో!



హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి కొత్తగా వచ్చిన రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ పెట్టిన పర్మినెంట్ చిచ్చు ఆపార్టీలో కుంపట్లు రాజేస్తోంది. తెలంగాణ పిసిసి అధ్యక్ష పదవిని తమకు ఇవ్వాలని కీలకనేత పార్టీ అధిష్టానంపై ఒత్తిడి ఓవైపు, పిసిసి ఇవ్వకుంటే పార్టీ మారుతామంటూ మరోనేత బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారు. దీనికి తోడు తాజాగా కుంతియా వచ్చి రాగానే 2019 వరకు ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్టీ చీఫ్‌గా కొనసాగుతారని, ఆయన సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్తామన్నట్లు చేసిన ప్రకటన పార్టీలో అగ్గి రాజేసింది. దీంతో పార్టీ సీనియర్లంతా ఖంగుతున్నారు. కుంతియా స్టేట్‌మెంట్‌తో ఇప్పటి వరకు గ్రూపులుగా ఉన్న నేతలంతా పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కు వ్యతిరేకంగా ఒక్కటైయ్యారు. 2019వరకు ఉత్తమే కొనసాగుతాడంటూ ప్రకటించే అధికారం కుంతియాకు ఎక్కడిదని నేతలంతా కారాలు మిరియాలు నూరుతున్నారు. పార్టీ విధివిధానాలు, కార్యక్రమాలకు సంధానకర్తగా వ్యవహరించాల్సిన వ్యక్తి పర్మినెంట్ వ్యాఖ్యలు చేయడం పట్ల సీనియర్లు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. కుంతియా వ్యాఖ్యలు ఉత్తమ్ వ్యతిరేకంగా ఉన్న వర్గాలకు అగ్గికి ఆజ్యం పోసినట్లయింది. ఇంతకాలం పార్టీకి దూరంగా ఉన్న నేతలను, పిసిసికి వ్యతిరేకంగా ఉన్న నాయకులను పిలిపించి వారి అసంతృప్తిని తెలుసుకుని పరిష్కరించాల్సిన ఇంచార్జీ ఎన్నికల వరకు కొనసాగుతారని ఎందుకు స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డియే కుంతియాతో చెప్పించారని కొందరు నేతలు బాహాటంగా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం ఉన్న సమస్యలు తగ్గిస్తారనుకుంటే కుంతియా మరింత పెంచారని కొందరు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు.

ఈ విషయంపై కుంతియా, ఉత్తమ్‌లకు వ్యతిరేకంగా ఇప్పటికే పార్టీ హైకమాండ్‌కు ఫిర్యాదులు చేశారు. కొందరు నేతలు నేరుగా అధిష్టానంను కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు నేతలు కుంతియా తీరుపై సన్నిహితులకు, అధిష్టానంకు చెప్పుకుంటుంటే నల్లగొండజిల్లాకు చెందిన సీనియర్‌నేత కోమటిరెడ్డి బ్రదర్స్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ కుంతియాపై ఒంటికాలిపై లేశారు. ఇన్నాళ్లు ఉత్తమ్‌ను విమర్శిస్తూ వస్తున్న ఈ కోమటిరెడ్డి బ్రదర్స్ కుంతియాను ఏకి పారేశారు. కుంతియా చెప్పినంత మాత్రాన అయ్యేదేమి లేదని, ఆయన మాటలు కార్యకర్తలు పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ వెంకట్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2019వరకు ఉత్తమే పిసిసి కొనసాగుతారని చెప్పడానికి ఆయనెవరంటూ ఎమ్మెల్సీ రాజ్‌గోపాల్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు.

దీనికి తోడు పిసిసి అధ్యక్షుడుగా వున్న నేత పార్టీలోని సీనియర్లను కలుపుకుని పోవాలని, కానీ దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నాడని ఇప్పటికే పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై పార్టీ సీనియర్‌నేతలు మండిపడుతున్నారు. పార్టీ అభ్యర్థులను ప్రకటించే విషయంలో అదే విధంగా 2019లో ఎన్నికలకు సంబంధించిన మేనిఫెస్టో విషయంలోని ముఖ్యమైన అంశాల విషయంలో తమకు మాట మాత్రం కూడా చెప్పకుండా ప్రకటిస్తున్నారని సీనియర్లు గుర్రుగా ఉన్నారు. టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి రెండేళ్ల పదవీ కాలం పూర్తవడంతో పిసిసిలో మార్పు ఉంటుందని పార్టీలోని ఆశావాహులు అధిష్టానం ఆశీస్సుల కోసం బారులు తీరుతున్నారు. తమకు పిసిసి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే పార్టీని అధికారంలోకి తీసుకువస్తామంటూ గత కొంతకాలంగా పార్టీ అధిష్టానంను కోరుతున్నారు. దిగ్విజయ్‌సింగ్, గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్‌తో కొందరు నేతలు పిసిసి పీఠం కోసం తమ నేతకు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తాజా ఢిల్లీ పర్యటనల నేపథ్యంలో సన్నిహితుల ద్వారా స్పష్టమవుతోంది. మరోవైపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క సైతం ఉత్తమ్ వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌పై అసంతృప్తిగా ఉన్నారు. తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పలుమార్లు ఉత్తమ్‌పై ఢిల్లీనేతలకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇలా పార్టీ నేతల మధ్య సమన్వయం కొరవవడంతో 2019 వరకు ఇలాగా కొనసాగితే పార్టీ ప్రతిపక్షానికే పరిమితం కావాల్సి వస్తుందని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ అంతర్గత పోరుతో విసిగెత్తి బిజెపి ఆకర్షకి పార్టీ నుంచి ఉడాయించేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌లో నేతల మధ్య సమన్వయం చేయకపోతే పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేది నిర్వివాదాంశం.

వార్త

ఔన్నత్యం సంపద వల్ల రాదు.
సద్గుణాల వల్ల వస్తుంది.
-మహాత్మాగాంధీ

'పంచకుల' పాపం పాలకులదే..


పిల్లి గుడ్డిదైతే ఎలుకలు దానిముందే ఆడుకుంటాయంటారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పాలకులు కళ్లు మూసుకుంటే ఏం జరుగుతుందో వేరే చెప్పక్కర్లేదు. అరాచకం ప్రబలిపోతోంది. ఇప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో అదే జరుగుతోంది. తనకుతానుగా దైవంగా చెప్పుకుంటున్న 'దేరా సచ్చ సౌధా అధినేత' గుర్మిత్ రాం రహీంసింగ్‌ని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా ప్రకటించడంతో చెలరేగిన అల్లర్లు 30 మందిని పైగా పొట్టన పెట్టుకోగా, మరెందరినో క్షతగాత్రులను చేసాయి. ఆలస్యంగానైనా కళ్లు తెరిచిన పాలకులు పరిస్థితిని అదుపు తెచ్చేందుకు సైన్యాన్ని రంగంలోకి దింపారు. ఆ ప్రాంతపు పోలీసు డిసిపిని సస్పెండ్ చేశారు. అలాగే డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌కు ఉద్వాసన పలికారు. న్యాయస్థానం తీర్పు వెలువడుతుందని ముందుగానే తెలిసినా, శాంతిభద్రత సమస్య తలెత్తుతుందని నిఘా విభాగాలు హెచ్చరించినా అవసరమైన చర్యలు తీసుకోవడంలో హర్యానా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పంజాబ్, హర్యానా హైకోర్టు శనివారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతేకాదు వివాదాస్పద 'దేరా సచ్చ సౌధా అధినేత' అనుచరులకు ప్రభుత్వం లొంగిపోయిందని హైకోర్టు ఆక్షేపించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.చరణ్ నేతృత్వంలో పూర్తిస్థాయి ధర్మాసనం హర్యానాలో నెలకొన్న శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అలాగే కేంద్రం స్పందనపైకూడా అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఆ ప్రాంతాన్ని వలసప్రాంతంగాను, సవతి తల్లి పిల్లలుగా ఎందుకు పరిగణిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా తలంటింది. గుర్మిత్‌సింగ్‌పై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అయితే 2002లో ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డ ఆరోపణలపై విచారించిన సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆయన్ను దోషిగా నిర్ధారిస్తూ తీర్పు వెలువరించింది. తీర్పురాగానే భారీగా తరలి వచ్చిన ఆయన అనుచరులు ఒక్కసారిగా విధ్వంసానికి పాల్పడటంతో పెద్దఎత్తున ప్రాణనష్టం, ఆస్తుల విధ్వంసం చోటుచేసుకున్నది. 28 వాహనాలకు, రెండు ప్రభుత్వ కార్యాలయాలకు, మరికొన్ని ప్రైవేటు దుకాణాలకు ఆందోళనకారులు నిప్పంటించారు. దాదాపు వెయ్యిఎకరాల్లో నిర్మించిన దేరా ప్రాంగణంలోనే తిష్ట వేసిన లక్షమందికి పైగా అనుచరులను ఖాళీచేయించే కార్యక్రమం కొనసాగుతున్నది. ఇప్పటికే పిస్తోలు, ఎకె 47లాంటి ఆయుధాలతోపాటు తూటాలు, పెట్రోల్ బాంబులు, ఇనుపకడ్డీలు, గొడ్డళ్లు తదితర మారణాయుధాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్, హర్యానాల్లో పలుప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిందనే చెప్పొచ్చు. సిర్సా, పంచకులాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నా అదుపులోనే ఉందని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అక్కడి పరిస్థితిని ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. హింసను ఏ పరిస్థితిలోనూ సహించేదిలేదని, అది వ్యక్తులైనా, సమూహాలైనా వదిలిపెట్టేదిలేదని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం హెచ్చరించారు. శాంతి కాముకునిగా, తానొక దైవంగా చెప్పుకుంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నానని ప్రవచనాలు పలుకుతున్న ఒక వ్యక్తిపై న్యాయస్థానం విచారణ జరిపి దోషిగా నిర్ణయించి తీర్పు ప్రకటిస్తే ఇంతటి విధ్వంసం జరగడమేమిటి? అనేప్రశ్న ఉదయించకతప్పదు. అసలు వేలాదిమంది ఆ ఆశ్రమంలోకి ఎలా చేరుకున్నారు? వారివద్ద మారణాయుధాలు ఎందుకున్నాయి? ఇంతకాలంగా ఆయనకు రాం రహీంసింగ్ జెడ్ ప్లస్ భద్రత ఎందుకు కల్పించారు. ఈ సంఘటన తర్వాత ఉపసంహారించారు. దీనివెనుక రాజకీయనేతలు అధికారంలో ఉన్నవారి హస్తం ఉందనే వచ్చిన ఆరోపణలకు, జరుగుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. ఆయనేకాదు దేశంలో ఎందరో స్వామీజీల ముసుగులో చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. మనశ్శాంతి కరువైన పరిస్థితుల్లో ఆధ్యాత్మికం, భక్తి ముఖ్యంగా స్వామీజీల ఉపన్యాసాలు ప్రవచనాలతో తమ సమస్యలకు కొంతైనా పరిష్కారం లభిస్తుందన్న ఆశతో స్వామీజీలను, బాబాలను ఆశ్రయించడం రానురాను పెరిగిపోతున్నది. అయితే త్రికరణశుద్ధిగా దైవాన్ని నమ్ముతూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్వాములు కూడా ఉన్నారు. తులసీవనంలో గంజాయి మొక్కలు కూడా మొలకెత్తడం మన గ్రహచారం. కొందరు స్వార్థపరులు స్వామీజీ అవతారమెత్తి ప్రజలను మోసం చేస్తున్నారు. అందరు స్వామీజీలు అలా చేస్తున్నారని చెప్పడం లేదు. కానీ ఈ నకిలీ స్వాముల సంఖ్య రానురాను పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే అంశం. ఇది కూడా ఒక వ్యాపారంగా మారిపోయింది. పెద్దగా పెట్టుబడి లేకుండా కుబేరులుగా మారడానికి ఇది దగ్గరిదారిగా ఎంచుకుంటున్నారు. ప్రజల బలహీనతల నాడిని పట్టుకుని విశ్వాసం కలిగించగలిగితే కనకవర్షం కురిసినట్లే. కొన్ని ఆశ్రమాల్లో దేవుని ఫొటోలుకంటే నాయకులు, ఉన్నతాధికారులతో తాము చేయించుకున్న పూజా కార్యక్రమాల ఫొటోలతో నింపుతున్నారు. సామాన్యుల్లో విశ్వాసం పెంచేందుకు వీటిని ఎంతగానో ఉపయోగించుకుంటున్నారు. ఇలాంటివి పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే అంశం. ఇప్పుడు అది గుర్మీత్ రాంరహీమ్ సింగ్ విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

> "రుణాలను ఆధారం చేసుకొని రెండంకెల వృద్ధిని సాధిస్తే అది పటిష్టంగా నిలబడే అవకాశం ఉండదు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది."



■ ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య

> "దేశ బాలలతోనే భారత అభివృద్ధి ఆధారపడి ఉంది."



■ నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి

ప్రజావాక్కు

చందాలు వసూలు చేయకండి

నేడు మనం నిర్వహించుకుంటున్న వినాయక నవరాత్రోత్సవాలలో దైవభక్తి లోపించి బాగా దిగజారుడుతనం కనిపిస్తోంది. కేవలం చందాలు వసూలు చేసి పోగు చేసిన డబ్బుతో తాగి తందనాలు ఆడి దేవుడికి అపచారం చేస్తున్నారు. నిమజ్జనం రోజు ఊరేగింపులు ఎన్నికల ఊరేగింపును మరిపించేలా ఆర్భాటాలకు పోతున్నారు. డప్పులు కొట్టుకుంటూ ఊరేగిస్తున్నారు. యువకులు వినాయక విగ్రహాల కోసం నెల రోజుల ముందు నుంచే చందాల కోసం తిరుగుతున్నారు. ఆ విధంగా సేకరించిన సొమ్ముతో కొద్ది మొత్తం ఉత్సవాలకు ఖర్చు చేసి మిగతాది జల్సాలకు వినియోగిస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. చిన్న చిన్న గ్రామాలు మొదలుకొని పెద్ద పట్టణాల వరకు అంతటా ఇదే తంతు. భారత జాతి మొత్తం కొరకు బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఆనాడు తిలక్ తదితరులు ఈ ఉత్సవాలను దైవభక్తితో, దేశభక్తితో ప్రారంభించారు. కాని ప్రస్తుతం ఈ ఉత్సవాలు తాగుడు, గ్రూపులు, కొట్లాటలతో సాగుతున్నది. భక్తిశ్రద్ధలతో తులసి దళంతో పూజచేస్తే వచ్చే మోక్షం ఊరి మీద పడి బలవంతంగా వేలకు వేలు చందాలు వసూలు చేసి తాగి తగిలేయడం వలన రాదని గమనించాలి.

● జి.అశోక్, గోదూర్, కరీంనగర్‌జిల్లా

తల్లిదండ్రుల నిర్లక్ష్యం

తల్లిదండ్రులు తమ పిల్లలను మితిమీరిన గారాబంతో శీతల పానీయాలకు బానిసలను చేసి, వారి ఆరోగ్యాన్ని చేజేతులా పాడుచేస్తున్నారు. బజారుకు వెళ్లి పండ్లు తెచ్చేందుకు ఓపిక ఉండదు. ఎక్కడ పడితే అక్కడ దొరికే కూల్‌డ్రింక్స్‌ను బాగా తగిస్తున్నారు. ఏమైనా వేడుకలు జరిగినా, పుట్టిన రోజులు జరిగినా కూల్‌డ్రింక్స్ తప్పనిసరి. క్రమంతప్పకుండా కూల్‌డ్రింక్ బాటిల్స్ కొంటూ ఫ్రిజ్‌లలో నిలువఉంచి అడిగినప్పుడల్లా తాగిస్తున్నారు. చదివేస్తే ఉన్నమతి ఎక్కడికిపోతుంది? పండ్లు, పండ్లరసాయాలను తాగిస్తే పిల్లల ఆరోగ్యం చక్కగా ఉంటుంది కదా! కూల్ డ్రింక్స్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటున్నా ఉదాసీనత ఎందుకు? డాక్టర్లను పోషించడానికా? చిన్నారుల ఆయుష్షును తగ్గించడానికా?

● సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం

బస్సుల్లో ప్రథమ చికిత్సలెక్కడ?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ (ఎ.పి.ఎస్.ఆర్.టి.సి) బస్సులలో సుమారు 80 శాతం బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్సుల సంగతే లేదు. కొన్ని బస్సుల్లో బాక్సులు మాత్రం ఉన్నా నిర్వహణ గాలికొదిలేశారు. ఆర్.టి.ఎ నిబంధనల మేరకు ఫస్ట్ ఎయిడ్ బాక్సుల సమర్థ నిర్వహణ తప్పనిసరి అని చెబుతున్నా రవాణాశాఖాధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు చాలా అరుదు. సుదూర ప్రాంతాలలో హైవేలపై వెళ్లే బస్సులలో కూడా చాలా దారుణంగా వీటి నిర్వహణ ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం దూది, అయోడిన్ కూడా దొరకదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

● టి.సురేష్‌కుమార్, శ్రీకాకుళం

ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రం దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపునకు నోచుకోక అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడిన సామాజిక కులాలు ఎన్నో ఉన్నాయి. అభివృద్ధి చెందిన కులాలు ఇప్పటికీ ఆధిపత్యాన్ని చెలాయిస్తూ జీవితాలను గడుపుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మరి ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన దళిత కులాలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈరోజు ఈ కులాల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపైనే ఉంది. రాష్ట్రంలో దళితుల జీవితాల్లో మార్పు తీసుకురావాలని అనేక కులాలు అభివృద్ధి చెందకుండా సామాజిక నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అట్టడుగునే ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం దళితుల కోసం నిరంతరం కృషి చేస్తున్నది. అదేవిధంగా ప్రభుత్వం ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేస్తే చైర్మన్‌మినహా కమిషన్ సభ్యులుగా మాత్రం మాల సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

● గుండమల్ల సతీష్ కుమార్, నారాయణపురం

ప్రజలను పట్టించుకోని ప్రభుత్వాలు

తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.తాగునీరు, పేదవారికి వైద్యం, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, నిరుద్యోగం, అధిక ధరలు, సంక్షోభంలో వ్యవసాయం వంటి సమస్యలు రాష్ట్రాలను కుదిపేస్తూ ప్రజలకు నరకం చూపిస్తున్న వేళలో రెండు ప్రభుత్వాలు ప్రజల సొమ్ముతో విదేశీ యాత్రలు, ప్రచార ఆర్భాటాలు, పార్టీ ప్లీనరీ సమావేశాలు, బహిరంగ సభలపై విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. త్వరలోనే వేల కోట్ల పెట్టుబడులు లక్షల్లో ఉద్యోగాలు అంటూ నోరు ఊరిస్తున్నారు.రైతుల కష్టాలు, గిట్టుబాటు ధరలు, నకిలీ విత్తనాలు, విపరీతంగా పెరిగిన ఖర్చులపై నియంత్రణ చర్యలు ఇప్పటి వరకు చేపట్టకపోవడం శోచనీయం.

● ఎం.కనకదుర్గ,తెనాలి, గుంటూరుజిల్లా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాఖనగర పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలు కరెంట్, తాగునీరు సక్రమంగా లభించక నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా ఫీడర్లలో సాంకేతికలోపాల కారణంగా తరచుగా నిలిచిపోతుంది. దీనికితోడు విద్యుత్ శాఖ అనధికారికంగా విద్యుత్ కోతలను విధిస్తోంది. ఇక మూడు నాలుగు రోజులకు ఒకసారి మాత్రం తెల్లవారుఝామున ఒక గంటమాత్రం నీటి సరఫరా జరుగుతుండడం వలన ప్రజలు అవస్థలు పడుతున్నారు. పరిస్థితి చక్కదిద్దేందుకు నగరపాలక సంస్థ తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

● ఎన్.సందీప్, విశాఖ

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

స్వచ్ఛభారత్ మానవుని ఆరోగ్యానికి మూలసూత్రం. దీనిలో భాగంగానే పర్యావరణ పరిరక్షణ కూడా చేర్చాలి. అందులో ప్లాస్టిక్ నిషేధం ముఖ్యమైంది. దీంతో అనేక రోగాలు రావడమే కాకుండా వర్షాలు తగ్గడం, భౌగోళిక తాపం పెరగడం జరుగుతున్నది. దీని నివారణకు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఏర్పాట్లను చేసి ప్లాస్టిక్‌ను నివారించవచ్చు.

● కె.నవీన్, నల్గొండ

ఎడిట్ పేజీకి... ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

పట్టాలు తప్పిన రైళ్ల ప్రమాదాలే ఎక్కువ

కె.అమర్

పది రోజుల్లో ఉత్తరప్రదేశ్‌లో వరుసగా రైలు ప్రమాదాలు రెండు జరిగాయి. రైల్వే నిర్వహణ, భద్రత లోపాలపై పెద్దఎత్తున చర్చల దుమారం చెలరేగింది. ప్రభుత్వాలు మారుతున్నా తరాలు మారుతున్నా రైల్వే వ్యవస్థలో లోపాలు, నిర్లక్ష్యం మాసిపోవడంలేదు.గత అయిదేళ్లలో దాదాపు 600రైళ్ల ప్రమాదాలు జరిగాయి. రైల్వే రంగంలో ఈ ప్రమాదాలు ఇప్పుడు జరగడం కొత్తకాదు. గతంలో కూడా జరిగాయి. అయితే ఆధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా ప్రయాణికులకు భద్రత కల్పించలేని దుస్థితి కొనసాగడం శోచనీయం.

రైలు మార్గాల నిర్మాణం భారత దేశంలో ఏర్పాటయిన మొదటి ప్రోటోటైప్ రైలు రెడ్‌హిల్స్ నుంచి మద్రాస్ దరి చింత్రాదిపేట్ బిడ్జివరకు నడిచిన 54 ఏళ్ల తర్వాత 1891 నవంబర్ ఐదున నాగపూర్ వద్ద రైలు పట్టాలు తప్పింది. 10 మంది చనిపోయారు. అప్పటి నుంచి ప్రతి దశాబ్దంలోనూ రైలు ప్రమాదాలు జరగడం పరిపాటి అయింది. రైళ్లు ఢీకొనడం, పట్టాలు తప్పడం, పేలుడు పదార్థాల పేలుడు వల్ల బోగీలు దెబ్బతినడం, అగ్ని ప్రమాదాలు జరగడం, తదితర విధాలుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. డ్రయివర్ నిర్లక్ష్యం వల్ల, సిగ్నల్ మేన్ పొరపాటు వల్ల, యాంత్రిక వైఫల్యం, లెవెల్ క్రాసింగ్ గేట్ల నిర్వహణ సరిగ్గా లేక ఇష్టాను సారంగా వినియోగించడం, ప్రయాణికులు జాగ్రత్తలు పాటించక రైలు పట్టాలను దాటడం, ఉగ్రవాదుల విధ్వంస చర్యలు, వరద ప్రవాహాలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం ఇలా ఎన్నో కారణాలు రైళ్ల ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. రైల్వే మంత్రిత్వశాఖ గత మూడేళ్లలో రైలు ప్రమాదాల సంఖ్య తగ్గిందని గణాంక వివరాలు వల్లె వేస్తోంది. 2014-15లో 135 ప్రమాదాలుజరగ్గా 2015-16లో 107 ప్రమాదాలు జరిగాయని, 2016-17లో 104 ప్రమాదాలు మాత్రమే జరిగాయని లెక్కలు చెప్పింది. అయితే ఈ ప్రమాదాలను విశ్లేషిస్తే పట్టాలు రైళ్లు తప్పే సంఘటనలే ఎక్కువవుతున్నట్టు స్పష్టమవుతోంది. ఈ ప్రమాదాల్లో 50 శాతం రైళ్లు పట్టాలు తప్పడం వల్లనే జరిగాయని రైళ్ల భద్రతను సమీక్షించే అనిల్ కాకోదర్ కమిటీ వెల్లడించింది. లెవెల్ క్రాసింగ్



గేట్ల వద్ద కాపలాదారులు ఎవరూ ఉండడం లేదని, దీనివల్ల మరో 36శాతం ప్రమాదాలు, కాపలా ఉన్నా నిర్లక్ష్యం వల్ల మరో నాలుగు శాతం ప్రమాదాలు అదనంగా జరుగుతున్నాయని,రైళ్లు ఢీ కొనడం, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రమాదాల వల్ల 10 శాతం రైళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కమిటీ పేర్కొంది. భారతదేశంలోనే ఎందుకు ఇలా రైళ్లు పట్టాలు తప్పిపోతున్నాయన్న ప్రశ్నకు నిర్దిష్ట కాల పరిమితిలో కాకోదర్ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసింది. ఆ అధ్యయన కాలంలో రైళ్లు పట్టాలు తప్పిన సంఘటనలు 441 జరిగాయి.వీటిలో గరిష్టంగా 129 ప్రమాదాలు సివిల్ ఇంజినీరింగ్ పొరపాట్ల వల్లనే అని కమిటీ గుర్తించింది. తరువాత విద్రోహ చర్యల వల్ల 56 ప్రమాదాలు, సిబ్బంది విధులు సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల 54 ప్రమాదాలు, క్యారేజి, వ్యాగన్ పొరపాట్ల వల్ల 43 ప్రమాదాలు, రైల్వే సిబ్బంది కాని ఇతరుల పొరపాట్ల వల్ల 36 ప్రమాదాలు, ఆపరేటింగ్ సిబ్బంది విధుల లోపం వల్ల 27 ప్రమాదాలు, సరయిన సామాగ్రి ఇతర నిర్వహణ లేక 24 ప్రమాదాలు, లోకోపైలట్ విధుల వైఫల్యం వల్ల 28 ప్రమాదాలు, అనుకోకుండా జరిగిన ప్రమాదాలు 26 కాగా, మిగతా ప్రమాదాలు వివిధ కారణాల వల్ల జరిగాయని కమిటీ విశ్లేషించింది. 2002 నుంచి 2012 వరకు ఈ పదేళ్ల కాలంలో జరిగిన ప్రమాదాల్లో రైళ్లు పట్టాలు తప్పిపోవడానికి ప్రధాన కారణం ప్యాసింజర్ కోచ్‌ల డిజైన్ అని కమిటీ నిర్ధారించింది. ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్)లో కోచ్‌లు తయారవడం గత కొన్నిదశాబ్దాలుగా జరుగుతోంది. ప్రస్తుత వేగ యుగంలో ఆ కోచ్‌ల వల్ల ప్రయాణికులకు భద్రత చేకూరదు. ఇప్పుడు 20 నుంచి 24కోచ్‌లతో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడవవలసి వస్తోంది. అందుకనే ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ డిజైన్‌లో కోచ్‌ల తయారీని ఆపివేస్తేనే మంచిదని కమిటీ సూచించింది. అంతేకాదు లింకే హాఫ్ మాన్ బస్చ్ (ఎల్‌హెచ్‌బి) డిజైన్‌లో తక్షణం కోచ్‌ల తయారీని ప్రోత్సహించాలని సూచించింది. ఈ ప్యాసింజర్ కంపార్టుమెంట్లు డిజైన్‌తో పాటు ఇతర హంగులతో జర్మనీ సంస్థలింకే హాఫ్ మాన్‌బస్చ్ అభివృద్ధి చేయగా కపుర్తలాలోని రైలు కోచ్ ఫ్యాక్టరీ తయారు చేస్తోంది. కాకోదర్ కమిటీ తన సిఫార్సుల నివేదికను సమర్పించిన అయిదేళ్ల తరువాత ఎల్‌హెచ్‌బి కోచ్‌ల తయారీకి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. ఇప్పుడు 10వ శాతం ఈ బోగీలనే రైళ్లలో ప్రవేశపెడుతున్నారు.

2011 నుంచి 2016 వరకు జరిగిన ప్రమాదాల సరళిని పరిశీలిస్తే 2011-12లో ఢీకొనే ప్రమాదాలు 9, పట్టాలు తప్పిన ప్రమాదాలు 55, లెవెల్ క్రాసింగ్ గేట్ ప్రమాదాలు 61, అగ్నిప్రమాదాలు 4, ఇతర కారణాల వల్ల 2 ప్రమాదాలు మొత్తం 131 ప్రమాదాలు జరిగాయి. 2012-13లో రైళ్లు ఢీ కొనడం వల్ల 6 ప్రమాదాలు, పట్టాలు తప్పడం వల్ల 48, లెవెల్ క్రాసింగ్ వల్ల 58, అగ్ని వల్ల 8, మొత్తం 120 ప్రమాదాలు జరిగాయి. 2013-14లో రైళ్లు ఢీ కొని 4ప్రమాదాలు, పట్టాలుతప్పగా 52ప్రమాదాలు,లెవెల్ క్రాసింగ్ వల్ల 51ప్రమాదాలు, అగ్నివల్ల 7 ప్రమాదాలు, ఇతర కారణాల వల్ల 3 మొత్తం 118 ప్రమాదాలు జరిగాయి. 2014-15లో రైళ్లు ఢీకొని 5, పట్టాలు తప్పి 60, లెవెల్ క్రాసింగ్ వల్ల 56, అగ్నివల్ల 6, ఇతరత్రా 4 మొత్తం 131 ప్రమాదాలు జరిగాయి. 2015-16లో రైళ్లు ఢీకొని 3 ప్రమాదాలు, పట్టాలు తప్పి 64, లెవెల్ క్రాసింగ్ గేటు నిర్వహణలోపం వల్ల 35, ఇతరత్రా 4, మొత్తం 106 ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ పరిశీలిస్తే పట్టాలు తప్పిన ప్రమాదాల సంఖ్యే రానురానూ పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. ❒

మహిళాభ్యుదయం మాటలకే పరిమితం

ఈ. శ్రీనివాసరెడ్డి

'యత్రనార్యేషు పూజ్యంతే రమంతే తత్ర దేవతా' ఎక్కడ దేవతలు పూజించబడతారో అక్కడ దేవతలుంటారని మన పురాణాలు చెప్తున్నాయి. కాని నేటి సమాజంలో రోజురోజుకి వాళ్ల పరిస్థితి దిగజారుతోంది తప్ప ఏ మాత్రం బాగుపడటం లేదనేది వాస్తవం. ఒక స్త్రీవాద రచయిత అన్నట్లు 'వంటింటికి మా అమ్మే మహారాణి కాని ప్రతిగిన్నెమీద మానాన్న పేరుంటుంది' ఈ రెండు వాక్యాలు చాలా సమాజంలో మగవాడుస్త్రీకి ఎంతప్రాధ్యాత ఇస్తున్నాడో తెలుస్తోంది. మగవాడి అహంకారానికి, స్త్రీ దౌర్జన్యానికి నిదర్శనాలు. తన ఇంటి నుంచే ప్రారంభంకావటం అవి దురదృష్టంఒక సగటు మహిళ రోజులో రెండున్నర గంటలు వంట వండడానికి ఒకటిన్నర గంటలు బట్టలు ఉతకడానికి, ఇల్లు కడగడానికి, అంట్లు తోమడానికి, మూడున్నర గంటలు పిల్లల ఆలనాపాలనకు మొత్తంగా ఏడున్నర గంటలు తన ఇంటికోసం తనవాళ్లకోసం కష్టపడుతుండగా మగవాడు కేవలం సగటున అరగంట మాత్రమే తన ఇంటి కోసం కష్టపడుతున్నాడు. అన్ని రంగాల్లోనిపనులు చేస్తే పరిపూర్ణ మహిళగా భాసిల్లుతుందో చెప్పారు గాని వాస్తవంలో కొచ్చేసరికి ప్రతి రంగం లో ఆమెను ఎదగనీయకుండా అడుగడుగునా మగవాడు అడ్డుపడుతున్నాడు. దిగ్భ్రాంతికరమైన వాస్తవం ఏమిటంటే కొన్ని విషయాల్లో ఆడదానికి ఆడదేశత్రువుగా మారటం. గృహహింసను 51శాతం మగ వారు సమర్థిస్తుండగా,54శాతం స్త్రీలు సమర్థించటం బాధాకరం.

ప్రభుత్వం మహిళా భ్యుదయానికి ఎన్నోపథకాలు (బేటిబచావో, బేటిపడావో, స్వాధార్, రోష్ని, ధనలక్ష్మి, ఉజ్వల, తదితరాలు) ప్రవేశపెట్టినా వాటి ఫలాలు మాత్రం మహిళలకు చేరువకావడం లేదనే చెప్ప వచ్చు. ఐక్యరా జ్యసమితి 2015 సంవత్సరాన్ని 'మహిళా సాధి కారత', తద్వారా మానవ సాధికారత' అనే నినాదంతో ముందు'కెళ్తుంది. సాధికారత అంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక, వైద్య, విద్యారంగాల్లో స్త్రీకి తగిన ప్రాధాన్యతనివ్వటం. ప్రభుత్వాలు మహిళా సాధికారత వైపు చిత్తశుద్ధితో ప్రయత్నించనంత వరకు ఈ పరిస్థితుల్లో మార్పురాదు.

పెరుగుతున్న నేరాలు

రోజురోజుకి సమాజంలో స్త్రీలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ఎన్ని చట్టాలు చేసినా అవి అక్కరకు రావట్లేదు. దీనికంతటికి కారణం స్త్రీని ఒక విలువైన వస్తువుగా మగవాడు పరిగణించడమే. సమాజంలో జరుగుతున్న నేరాలలో 2013 గణాంకాల ప్రకారం 42 శాతం స్త్రీల వేధింపులే ఉన్నాయి. 11 శాతం కిడ్నాపులు తరువాత అత్యాచారం, 21 శాతం లైంగికదాడులు ఉన్నాయి. నాలుగు శాతం వరకట్న చావులు, ఒక శాతం అక్రమ రవాణా కేసులునమోదవుతున్నాయి. 2013 గణాంకాల ప్రకారం వరకట్నపు చావులు 8083, కిడ్నాపులు, హత్యలు 51, 881, రేపులు 33707, లైంగిక దాడులు 70739, భర్తచే వేధింపులు 1,18,866 ముఖ్యంగా 15 సంవత్సరాల లోపు ఆడపిల్లపై 30 శాతం నేరాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెపుతున్నాయి. బాల్యవివాహాలు కూడా గణనీయంగానే జరుగుతుండటం విచారకరం. 18 సంవత్సరాల లోపు వయసున్న ఆడపిల్లల్లో 47 శాతం మంది బాల్యవివాహం చేసుకున్నవారు. దీనికంతటికి కారణం సమాజంలో మహిళలపట్ల చిన్నచూపు, అవగాహనలేకపోవడం. ఈనాటికి పల్లెల్లో ఆడపిల్లలను పురిటిగుడ్డల్లోనే నొక్కిచంపుతున్నారంటే ఏమనాలి? ఒక సగటు భారతీయ మహిళ 22 సంవత్సరాలలోపే బిడ్డను కంటోంది. ఇటువంటి దశలో ఆమెకు ఎటువంటి అవగాహన, ఆరోగ్యంపట్ల జాగ్రత్త ఉండదు. 60శాతం మంది ఆడపిల్లలు 18 సంవత్సరాలలోపు వారు బిడ్డలను కంటున్నారు. దీనివల్ల శిశుమరణాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఈనాటి పల్లెల్లో సరైన ప్రసూతి సదుపాయాలు లేక మంత్రసానులను, నాటు వైద్యులను నమ్ముకోవడం మనదేశ ప్రగతిని చాటిచెపుతోంది. పుట్టే బిడ్డ మగబిడ్డ అయి ఉండాలని కోరుకునే వారిలో 20 శాతం మంది పురుషులుంటే 22శాతం మంది మహిళలు కావటం దురదృష్టకరం. పుట్టిన ఆడపిల్లలను చంపుతోంది కూడా ఆడవాళ్లే కావడం ఆడది ఆడదానికే శత్రువు అన్న నానుడి నిజం చేయడానికేనేమో. పుట్టిన ఆడపిల్లను బతకనీయండని ప్రభుత్వం ప్రచారం చేయాల్సిరావడం అత్యంత దురదృష్టకరం.

దేశ ఆర్థిక వ్యవస్థలో స్త్రీ పాత్ర

పట్టణ ప్రాంతాల్లో 92.25 మిలియన్ల మంది పనిచేస్తుండగా అందులో 16 మిలియన్లు స్త్రీలే. అదే గ్రామీణ ప్రాంతాల్లో 310 మిలియన్ల శ్రామికులుండగా అందులో 111 మిలియన్లు స్త్రీ కార్మికులున్నారు. 50శాతం గ్రామీణ స్త్రీ కార్మికులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తుండటం బాధాకరం. ఇక పనిగంటల విషయానికొస్తే మగవాడికన్నా ఆడవాళ్లే ఎక్కువ సేపు కష్టపడుతున్నా వేతనాల దగ్గర కొచ్చే సరికి మగవాళ్లతో సమానంగా పొందలేకపోవడం విచారకరం. వారికి వేతనాలు చెల్లించడానికి ఎటువంటి కార్మిక చట్టాలు లేకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వరంగ ఉద్యోగాల్లో కమ్యూనిటీ, వ్యక్తిగత సామాజిక సేవల్లో ఎక్కువగా స్త్రీలే ఉన్నారు. తయారీ రంగంలో ఉన్న పరిశ్రమల్లో ఎక్కువ మంది స్త్రీలే. సంఘటిత రంగాల్లో పనిచేస్తున్న స్త్రీల సంఖ్య 20 శాతం మాత్రమే. బ్యాంకుల వంటి జాతీయ సంస్థల్లో శక్తివంతమైన స్త్రీలున్నా వారి శాతం కేవలం 15 శాతం మాత్రమే. క్లర్కులు, సబార్డినేట్ ఉద్యోగాల్లో 30 శాతం మంది స్త్రీలే. దేశం మొత్తం మీద ఉన్న బ్యాంకు అకౌంట్లలో 21 శాతం స్త్రీలవి, బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ములో కేవలం పది శాతం మాత్రమే స్త్రీల పేరుపై ఉందంటే మగవాళ్ల అహంకారానికి ఇంతకంటే నిదర్శనం ఏంకావాలి. ఇది మన ఒక్క దేశంలోనేకాదు. ప్రపంచ వ్యాప్తంగా తీసుకున్న రమారమి ఇవే అంకెలు. ప్రపంచం మొత్తం మీద 2/3 వంతు పనిగంటలు స్త్రీలు కష్టపడుతూ ప్రపంచ ఆహార ఉత్పత్తిని 50 శాతం వారే ఉత్పత్తి చేస్తున్నా, వారు సంపాదిస్తున్నది మాత్రం ప్రపంచ సంపదలో 10 శాతం మాత్రమే. ఇందులో 9శాతం ఇంటి అవసరాలకు, పిల్లల చదువులకు తదితరాలకు ఖర్చుపెట్టగా,స్త్రీలు ప్రపంచవ్యాప్తంగా దాచుకుంటున్న సొమ్ము కేవలం ఒక శాతం మాత్రమే అంటే ఆమెకు ఏ విధమైన ఆర్థిక భద్రత ఉందో అర్థమవుతోంది.

రాజకీయరంగంలో స్త్రీలు

స్వాతంత్ర్య సముపార్జన మగవారితో సమానంగా ఎంతో ప్రాముఖ్యమైన పాత్రను పోషించినా,అధికారానికొచ్చే సరికి ఆమెను పక్కకు నెట్టేశాడు మగవాడు. ప్రతి ఎన్నికలకు ముందు ప్రతిపార్టీ స్త్రీలకు పెద్దపీట వేస్తామని ఊదరగొట్టి, తీరా ఎన్నికల సమయానికి గెలుపు గుర్రాలని మగవారినే ఎంచుకుంటూ స్త్రీలకు తీరని అన్యాయం చేస్తున్నారు. కేబినెట్ పదవులలో పది శాతం కూడా స్త్రీలు లేకపోవడం బాధాకరం. సుప్రీంకోర్టు జడ్జిలలో ఒక్క జడ్జి కూడా స్త్రీ లేకపోవడం వారి బాధలు వినేనాథుడు లేడనడానికి నిదర్శనం. రాజకీయరంగంలో పంచాయితీల నుంచి మొదలుకుని వివిధ స్థాయిల్లో స్త్రీలు పొందిన పదవులు 40 శాతం మాత్రమే. అందులో 60 శాతం పంచాయితీ, జిల్లాస్థాయి పదవులు కావడం వారి వెనుకబాటు తనానికి నిదర్శనం.

విద్యారంగంలో స్త్రీ

2012 గణాంకాల ప్రకారం దేశంలోని 67 శాతం స్త్రీలు చదువుకున్నవారుండగా అత్యధికంగా కేరళ (92శాతం) రాష్ట్రంలో, అత్యల్పంగా (34 శాతం) బీహార్‌లో ఉన్నారు. పాఠశాలస్థాయిలో చూసినట్లయితే బాలురకన్నా బాలికలే ఎక్కువ మంది ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో12శాతం ప్రాథమికోన్నత పాఠశాలలో 81 శాతం, ఉన్నత పాఠశాలలో 50శాతంగా వీరి సంఖ్య నమోదయ్యింది. కాని దురదృష్టవశాత్తు కళాశాల స్థాయిల్లో వీరి సంఖ్య అత్యల్పంగా ఉంది. ఉన్నత స్థాయి విద్యకు వచ్చే నాటికే 24 శాతం స్త్రీలు చదువుకు స్వస్తిచెపుతున్నారు. దీనికికారణం చదివించే స్తోమత లేకపోవడం,చదువుపట్ల ఆసక్తి లేకపోవడం, చదువు అవసరాన్ని గుర్తించలేకపోవడం, ఇంట్లో బాధ్యతలను తలకెత్తుకోవాల్సి రావడం, ఇంజినీరింగ్ వంటివృత్తి విద్యాకోర్సుల్లో వీరి శాతం 40 శాతంగా ఉంటే మెడికల్ అనుబంధ విభాగాల్లో కాస్త మెరుగ్గా (89శాతం) ఉంది. చదువులేక ఆరోగ్యం, కుటుంబం పట్ల అవగాహనలేక ఎంతోమంది సమస్యలతో సతమతమవుతున్నారు.57శాతంమంది మహిళలు పొగాకు,పాన్ మసాలాల బారినపడి క్యాన్సరును కొనితెచ్చుకుంటున్నారు. 31శాతం మంది చదువుకున్న మహిళలు తాగుడుకు బానిసలవుతున్నారంటే అమాయకత్వమో, అవగాహన రాహిత్యమో అర్థంకావట్లేదు.ప్రభుత్వం మహిళాభ్యుదయానికి ఎన్నోపథకాలు (బేటిబచావో, బేటిపడావో, స్వాధార్, రోష్ని, ధనలక్ష్మి, ఉజ్వల, తదితరాలు) ప్రవేశపెట్టినా వాటి ఫలాలు మాత్రం మహిళలకు చేరువకావడం లేదనే చెప్ప వచ్చు. ఐక్యరాజ్యసమితి 2015 సంవత్సరాన్ని 'మహిళా సాధి కారత', తద్వారా మానవ సాధికారత' అనే నినాదంతో ముందు'కెళ్తుంది. సాధికారత అంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక, వైద్య, విద్యారంగాల్లో స్త్రీకి తగిన ప్రాధాన్యతనివ్వటం. ప్రభుత్వాలు మహిళా సాధికారత వైపు చిత్తశుద్ధితో ప్రయత్నించనంత వరకు ఈ పరిస్థితుల్లో మార్పురాదు.

తీసుకురావాల్సిన మార్పులు

తన తల్లి, చెల్లి, ఆలి అయిన ఆడవారిని సరైన దృష్టితో చూడటానికి దోహదపడే విద్యావ్యవస్థను నెలకొల్పడం, మహిళలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని వారికి ఆడపిల్లల వల్ల కలిగే లాభాలను వివిధ ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించడం, ప్రభుత్వ చట్టాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయడం, ఆర్థిక స్వావలంబనకు రుణాలు మంజూరు, చదువుకునే మహిళలకు ప్రోత్సాహకాలు అందించడం,ముఖ్యంగా యుక్తవయస్సులోఉన్న మగ, ఆడ పిల్లలకు నైతిక విలువలు, కుటుంబ విలువలు, సభ్య సమాజపు నియమాలు వివరించగలగడం. ఒకపక్క అంతర్జాలపు సాంకేతిక విప్లవంలోని మార్పులైన ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటివి యువతను పెడత్రోవ పట్టిస్తుంటే వీటి విరుగుడుగా ఏ చర్యలు చేపట్టకపోతే స్త్రీలపై దాడులు ఇంకా పెరుగుతూనే ఉంటాయి. వీటి కి ఎక్కడో అక్కడ చరమాంకం పలకాల్సిన సమయం ఆసన్నమయింది. ❒

(రచయిత: డీన్ ఇంజినీరింగ్ ఫాకల్టీ ఆచార్యనాగార్జున యూనివర్శిటీ)

చైనాపై భారత్ వైఖరి సరైనదే

డాక్టర్ థామస్

భారత్ భూభాగంలోకి చైనా చొచ్చుకురావడం, రోడ్లు వేయడం, ఇతర దుందుడుకు చర్యలు చాలా కాలంగా సాగుతున్నాయి. కాని భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం. నేడు ప్రపంచ యుద్ధాలు చేయాలని అణ్వాయుధ దేశాలు కోరడం లేదు. ప్రపంచ శాంతిప్రియులు కోరడం లేదు. అభివృద్ధి కావాలని, అన్నిసమస్యలను యుద్ధాలతో పరిష్కారం కావని చాలా దేశాలు నమ్ముతున్నాయి. భారత్, పాకిస్థాన్ యుద్ధం అంచుల్లోకి వెళ్లగా, గెలువలేని పాకిస్థాన్ ప్రపంచం ముందు మోకరిల్లింది. ప్రపంచ ఒత్తిడి మేరకు పాకిస్థాన్‌ను వదిలి వేయడం జరిగింది. చైనా దూకుడు అలాగే ఉంటే భారత్ యుద్ధానికి ఎప్పుడూ సంసిద్ధం అనేది పాకిస్థాన్‌పై అవలంభిస్తున్న ధోరణియే సాక్ష్యంచెపుతుంది.యుద్ధమేఘాలు కమ్మడానికి మెరుపు దాడులు, అణ్వస్త్రదాడులకు భారత్ వెనక్కుపోదు. కాబట్టిపాకిస్థాన్ అయినా చైనా అయినా ఏ దేశమైనా భారత్ వెనక్కి తగ్గదు. కాబట్టి చైనా ఆలోచించాలి. బలగాలను వెనక్కి తీసే ఆలోచన భారత్‌కు ఉండదు. కాబట్టి ప్రపంచంలో ఏదేశమైనా, భారత్‌తో స్నేహాన్ని శాంతిని కోరడమేకాని శత్రుత్వాన్ని పెంచుకోవు. అహింసతో తగ్గి సహనంగా ఉండే భారత్ యుద్ధం వరకు వస్తే తాడోపేడో తేల్చుకునే దిశలో ఉంది. కాబట్టి ప్రపంచ శాంతిదూతలు, ఏదేశమైనా, అంతర్జాతీయ సమాజం అయినా ఇరువర్గాలను శాంతింపచేయవలసిన అవసరం ఉంది.

అణ్వాయుధ దేశాల యుద్ధం ఒక రకంగా ప్రపంచ నాశనానికి సంకేతం. కాబట్టి విశ్వ శ్రేయస్సు రీత్యా ఇరుదేశాలను శాంతింపచేయాల్సిన అవసరం ఉంది. నేతలు వారి ఆలోచనలు (భారత్‌లో) సరిగ్గా లేవు. అనుకున్నదే తడవుగా నరేంద్రమోడీ పాకిస్థాన్‌పై మెరుపుదాడులు చేయించారు. అవసరం అయితే అణ్వాయుధ దాడులకు వెనక్కి తగ్గే ఆలోచన భారత్‌కు భారత నాయకత్వానికి, పౌరులకు లేదు. కాబట్టి చైనా తన వ్యూహాలను చతురతను భారత్‌కు వ్యతిరేకంగా పన్నడం ఎవరికీ మంచిది కాదు. కాని తలపై కొరివితో గొక్కునే తెంపరితనం పనికిరాదని పౌరసమాజం పాకిస్థాన్, చైనాల దురాగతాలపై హెచ్చరికలను జారీ చేస్తుంది. భారత వైఖరి ఎన్ని సంవత్సరాలైన శత్రువులను వదలని గట్టి వైఖరితోనే ఉంటోంది. పాకిస్థాన్ మూకలు కానీ ఉగ్రవాదులు కానీ రెచ్చిపోతున్న సైన్యంపై బాంబు దాడులు చేస్తున్నవారిని గుర్తించి నేరస్తులను, నేరసామ్రాజ్య ప్రియుల్ని భారత్ గుర్తించి మెరుపు దాడులకు ప్రతిదాడులకు ఎన్‌కౌంటర్‌లకు సాగించడానికైనా భారత్ వెనక్కి తగ్గడం లేదు. బిజెపి ప్రభుత్వాలు అధికారంలో ఉంటే పన్నుకు పన్ను, కన్నుకు కన్ను అని చేసి చూపిస్తున్నాయి. కాబట్టిచైనా, పాకిస్థాన్, దొంగచాటు దాడులు, చొరబాట్లు వంటి ప్రయత్నాలను వదిలి భ్రమలు తొలగించుకొని భారత్ వైఖరిని గుర్తించి అందుకు తగిన విధంగా స్పందించాల్సిన అవసరం ఉంది. నాయకుల విధానాలు చాలా అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. చైనా లాంటి దేశాలు శాంతిని, అభివృద్ధిని కాంక్షించాలి. కాని రోడ్లు వేయడాలు, సైన్యం కవాతులు, బలగాల మోహరింపు విన్యాసాలు ఇవన్నీ కవ్వింపు చేష్టలు.

సుదూర ప్రాంతాలను దేశాన్నే లక్ష్యం చేసుకోగల సామర్థ్యం గల దేశం భారత్. కాబట్టి ఆలోచించి అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచం అంతా అభివృద్ధి, ఆకలి కేకలు లేని వ్యాధిరహిత, కూడు, గూడు, గుడ్డ, ప్రపంచం కావాలని చూస్తూ ఉంటే చైనా పాకిస్థాన్‌లు భారత్ సహనానికి పరీక్షలు పెట్టడం సరైనదికాదు. భారత్‌దీనికి గుణపాఠం చెప్పడానికి ఎంతకైనా తెగిస్తుంది అనేది జగమెరిగిన సత్యం. ❒

అంకిత భావంతో పనిచేయండి

ఉద్యోగులకు ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఉద్బోధ

హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మరింత అంకిత భావంతో పనిచేయాలని ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉద్భోధించారు. తద్వారా నవ్యాంధ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూరులో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పి అశోక్‌బాబు, కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎ విద్యాసాగర్ నేతృత్వంలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఇతర రాష్ట్రాల ఉద్యోగుల కన్నా నవ్యాంధ్ర రాష్ట్ర ఉద్యోగులు మరింత సేవా ధృక్పధంతో పనిచేసి అభివృద్ధిలో బాగస్వాములు కావాలని హితవు పలికారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విడివిడిగా



ఆదివారం ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడును కలిసిన ఎపిఎన్‌జిఒ సంఘాల నేతలు

పనిచేస్తున్న భార్యా,భర్తలు ఒకే రాష్ట్రంలో పనిచేసే అవకాశాన్ని కల్పించాలని సూచించారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రిగా తాను ఉన్న సమయంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించానన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇరు రాష్ట్రాలు దాన్ని అమలు పరచి భార్యా, భర్తలు ఇరువురు ఒకే చోట పనిచేసేలా అంగీకరించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఉప రాష్ట్రపతి అన్నారు.

కాగా అశోక్‌బాబు మాట్లాడుతూ తొలి సారిగా ఆంధ్రరాష్ట్రానికి చెందిన తెలుగువారు ఉప రాష్ట్రపతిగా ఎంపిక కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. విభజన చట్టం హామీలను అమలు పరచడంలో నవ్యాంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో అందించిన సహకారం ప్రతీ తెలుగు వారి హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోతారని ప్రశంసించారు. భవిష్యత్‌లో కూడా ఇదేవిధమైన సహకారాన్ని అందివ్వాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని అశోక్ బాబు కోరారు. ఉప రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉద్యోగ సంఘాల నాయకులు డి సత్యన్నారాయణ రెడ్డి, కోనేరు శ్రీనివాసకుమార్, భాస్కరావు, జి నారాయణరావు, కోనేరు రవి, డి కృష్ణకిషోర్, వి.నాగార్జున, ఎ. స్వామి, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

30వ తేదీ తుంగభద్ర డ్యాం నుండి నీటిని విడుదల చేయండి

డ్యామ్, హెచ్‌ఎల్‌సి అధికారులను కోరిన మంత్రి కాలవ శ్రీనివాసులు

డి.హీరేహాళ్, ఆగస్టు 27 ప్రభాతవార్త: అనంతపురం జిల్లాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈనెల 30వ తేదీన తుంగభద్ర డ్యాం నుండి నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖామాత్యులు కాలవ శ్రీనివాసులు తుంగభద్ర, హెచ్‌ఎల్‌సి అధికారులను కోరారు. ఆదివారం మంత్రి మీడియాతో కలసి తుంగభద్ర డ్యాం, హెచ్‌ఎల్‌సి కాలువలను పరిశీలించారు. అనంతరం తుంగభద్ర డ్యాం వద్ద గల వైకుంఠం అతిథి భవనంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ టిబి బోర్డు సమావేశం వున్నందున ఆ సమావేశంలో జిల్లా అవసరాల నిమిత్తం నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తుంగభద్ర రిజర్వాయర్ చరిత్రలో నీటి లభ్యత పూర్తిగా తగ్గిన నేపథ్యంలో జూలై నెలలో తుంగభద్ర ఎగువ కాలువకు నీటిని విడుదల చేయలేదు. ఆగస్టు నెలాఖరు వస్తున్నప్పటికీ నీటి విడుదల తేదీపై బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. రెండు రాష్ట్రాల నీటి అవసరాల ఆధారంగా (ఇండెంట్) ఆయా కాలువలకు విడుదల చేయడం ఆనవాయితీ. టిబి డ్యాంలో



ఆదివారం తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

నీటి లభ్యత సుమారు 60 టిఎంసీలకు చేరుకున్నప్పటికీ ఎప్పుడు విడుదల చేయాలో నిర్ణయించుకోలేకపోతున్నారు. తుంగభద్ర ఎగువ కాలువ 105 కి.మీల తర్వాత మన జిల్లాలోని బొమ్మనహాళ్ వద్ద చేరుకుంటాయి. ఈ నీటి విడుదలలో అనేక అవాంతరాలు ఎదుర్కొం టోంది. కర్ణాటక ప్రభుత్వం (తుంగభద్ర నీటి యాజమాన్య బోర్డు) ఇప్పటికే మూడు సార్లు సమావేశం నిర వ్వహించుకున్నప్పటికీ నీటి విడుదలపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అనంతపురం జిల్లాకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అనంతపురం జిల్లా కలెక్టర్ వీర పాండ్యన్ ఈనెల 22వ తేదీన తుంగభద్ర బోర్డును కోరడం జరిగింది. ఇందులో కనీసం 1000 క్యూసెక్కులైనా ఇవ్వమని కోరుతున్నాం. అనంతపురం జిల్లాలో కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, శింగనమల, రాయదుర్గం, అనంతపురం పట్టణాలలో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొంది. వర్షాలు పడకపోవడంతో మున్సిపాలిటీలలో సైతం తాగునీటి ఎద్దడి నెలకొంది. తుంగభద్ర ఎల్‌ఎల్‌సి ద్వారా బళ్ళారి ప్రాంత వాసులు తాగునీటి ఎద్దడిని తీర్చుకుంటున్నారు.

అదే విధంగా హెచ్ ఎల్‌సి ద్వారా మన జిల్లాకు ఇస్తే తాగునీటి కష్టాలు తగ్గేందుకు వీలుంటుందని ఆ విధంగా విడుదల చేయాలని తుంగభద్ర బోర్డు సిఇ శంకర్ గౌడను మంత్రి కోరారు. కర్ణాటక ప్రాంత వాసులకు ప్రస్తుతం నీటి అవసరం లేకపోతే అనంతపురం జిల్లాకు భద్రత నడుమ నీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లాలో 10 టిఎంసీల నీళ్ళు తాగునీటి అవసరాలకు సరిపోతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా టిబి డ్యాం నుండి 8-9 టి ఎంసీలు మాత్రమే అందే అవకాశాలు వున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ అత్తార్ చాంద్‌బాషా, టిబి డ్యాం ఎస్‌ఇ శశిభూషణ్, అనంతపురం జిల్లా హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

గాల్లోనే రాడార్ కేంద్రం





రాడార్ కేంద్రానికి మరుపూరు వద్ద కౌటాయించిన భూములు, భూములను పరిశీలిస్తున్న ఎయిర్ ఫోర్స్‌కమాండర్(ఫైల్)

నెల్లూరు (పొదలకూరు),ఆగస్టు,27ప్రభాతవార్త: పొదలకూరు సమీపంలో విమాన సర్వీసుల దశ దిశలను నిర్దేశించే రాడార్ కేంద్రంతో పాటు భారత వైమానిక దళం ఏర్పాటు నత్తలతో పోటీ పడుతోంది. ఇక్కడ రాడార్ కేంద్రం ఏర్పడితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రచారం జరగడంతో యువత ఆశలు పెంచుకుంది. ఈ నేపథ్యంలో గతేడాది చెన్నైకు చెందిన వింగ్ కమాండర్ మణి మండలంలోని నెల్లూరు మార్గం మరుపూరు సమీపంలో 63.6 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎయిర్‌ఫోర్స్ కేంద్రం కోసం రెవెన్యూ అధికారులు వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఇందుకోసం కలెక్టర్ స్థాయిలో పెద్ద కసరత్తే జరిగింది. ఇక్కడ భారత వైమానికి దళ కేంద్రం ఏర్పడితే నిరుద్యోగులకు ఉద్యోగంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉన్నత స్థాయి అధికారులు ప్రకటించారు. దినికి అనుగుణంగానే కమాండర్ మాట్లాడుతూ ముందుగా వైమానికి దళం కోసం 100 క్వార్టర్స్‌ను గతేడాది చివరినాటికి నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. విమాన సర్వీసులు దశ,దిశలను కనుగోనేందుకు మరుపూరు వద్ద సిగ్నల్స్ బాగా అందుతుండడంతో భారత వైమానిక దళ ఉన్నత స్దాయి అధికారులు ఇక్కడి భూములను ఎంపిక చేసుకున్నారు. 2010లోనే అప్పట్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రచారానికి బాగా ఉపమోగపడింది. ప్రస్తుతం పొదలకూరు ప్రాంతంలో రియాల్ వ్యాపారం కుప్పకూలిపోయి వేసిన లేఅవుట్లలో ఫాట్లు అమ్ముడు పోవడం లేదు. తిరిగి గతేడాది రాడార్ కేంద్రం నిర్మాణం తెర మీదుకు వచ్చి సంబంధితశాఖ అధికారులు భూములు స్వాధీనం చేసుకోవడంతో రియల్ వ్యాపారం చిగురించింది. ఎయిర్ ఫోర్స్ కేంద్రం ఏర్పడితే మరు పూరు వద్ద పెద్ద టౌన్‌షిప్ నిర్మాణం జరుగు తుంది. ముందుగా 100క్వార్టర్స్ నిర్మాణం జరిగినా తర్వాత పెరిగే అవకాశం లేకపోలేదు. పొదలకూరు ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. అవసరమైతే అదనంగా మరికొంత భూమిని కూడా భారత వైమానిక దళానికి అప్ప గించేందుకు రెవెన్యూ అధికారులు సిద్దంగా ఉన్నారు.

భూములు స్వాధీనానికి పరిమితం: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు రెవెన్యూశాఖ నుంచి భూములు స్వాధీనం చేసుకుని సూమారు ఏడాది గడుస్తున్నా ఇంత వరకు ఎలాంటి పనులను చేపట్టలేదు. అయితే నిధుల విడుదలతో జాప్యం జరిగినట్టుగా తెలుస్తోంది. అధికారులు హద్దులను ఏర్పాటు చేసుకుని ప్రతాలు స్వాధీనం చేసుకుని వెళ్లారు. అయితే ఇదే భూమిలో గతంలో కొందరు మినుము ,పెసర పంటలను చల్లారు. మెట్టపంటల సాగు ఈ పర్యాయం చేపడితే కేంద్ర ప్రభుత్వ భూములైనందున కఠిన చర్యలు తప్పవని తెలుస్తోంది.

వాడుతున్న వర్షాధార పంటలు





నీరు లేక వాడుతున్న నిమ్మతోటలు

ఆగస్టు నెలలోనూ మండుతున్న ఎండలు

నెల్లూరు (పొదలకూరు),ఆగస్టు,27ప్రభాతవార్త: ఆగస్టు నెలలోనూ ఎండల మండిపోతున్నాయి. వరు ణదేవుడు కరుణించకపోవడంతో వర్షాధార పంటలు వాడుతున్నాయి. అల్పపీడ ద్రోణులు పుడుతున్నా, వర్ష మేఘాలు దోబూచులాడుతున్నా, దక్షిణ కోస్తాకు వర్షసూచన ఉండడం లేదు. ఫలితంగా మెట్టప్రాంత రైతుల ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వరిసాగు తర్వాత ప్రధానంగా నిమ్మతోటల సాగు చేస్తున్నారు. కొద్ది నెలలుగా వర్షం జాడల లేకపోవడం రైతుల ఎదురు చూస్తున్నారు. అప్పుడు ఊరించి వెళ్లున్న వాన చినుకులు వర్షముఖాలు రైతులను ఆశల పల్లకిలో ఊగిలాడిస్తున్నాయి. గతేడాది నవంబర్‌లో తుఫాన్ ప్రభావంగా అత్యధికంగా కురిసిన వర్షం వల్ల గ్రామాల్లో మంచినీటి ఇబ్బందులు పెద్దగా తలెత్తుతున్న పరిస్దితి లేదు. నిమ్మతోటల సాగుచేస్తున్న రైతుల వరుణ దేవుడి కరుణ కోసం నిరీక్షిస్తున్నారు. మండలంలో నిమ్మసాగు సూమార్ 10వేల ఉంది. తర్వా త వర్షాధారంపై సవక, జామాయిల్ సాగు మరో 10వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ పంటలు ప్రధానంగతా వర్షాధారం పైనే సాగువుతున్నాయి. నీటి వసతి లేని చిన్నసన్నకారు రైతుల సైతం జామాయిల్‌సాగు చేపట్టారు. మూడు నెలలుగా నుంచి ఆశించిన స్దాయిలో వర్షాపాతం నమోదు కాలేదు. దీనికి తోడు ఆగస్టులో ఎండలతో పాటు పడమటి గాలులు ఉధృతంగా వీస్తున్నాయి. దీంతో ఉన్న కాస్తోకూస్తో నీరు సైతం ఇంకిపోయాయి. వెంటనే వర్షం కరువకుంటే మెట్టపంటలు ఎండు దశకు చేరుకునేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నాయి. వర్షపాతాన్ని పరిశీలిస్తే జూన్‌లో సాధారణ వర్షపాతం 54మీమీ కురవాల్సి ఉండగా 122,6 మీమీ వర్షపాతం నమోదు అయింది. జులైలో 86మీమీకు కేవలం 37మీమీ వర్షపాతం నమోదు అయింది. ఆగస్టులో 86మీమీ సాదారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వర్షాం లేదు. దింతో తోటలు వాడుతున్నాయి. నిమ్మకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ నీటి సౌకర్యం సమృద్ధిగా లేకపోవడం వల్ల దిగుబడి గుణనీయంగా తగ్గింది.

ఉపమోగపడని రెయిన్ గన్స్: వ్యవసాయాశాఖ అందుబాటులోకి తెచ్చిన రెయిన్‌గన్స్ వల్ల ఉపమోగం లేదని రైతుల అంటున్నారు. మండలానికి 6రెయిన్‌గన్స్ వచ్చినా, వాటిని ఉపమోగించుకునేందుకు రైతుల ముందుకు రావడం లేదు. రెయిన్ గన్స్ ఉపమోగించాలంటే ఎండుతున్న పంటలకు సమీపంలో నీటి వసతి ఉండాలి కుంటలు, బావుల నుంచి రెయిన్ గన్స్ నీటిని తోటి పంటలకు అందిస్తు ంది. అయితే ఎండుతున్న పంటలకు సమీపంలో ఎక్కాడ నీటి వసతి లేకపోవడం వల్ల రైతులు రెయిన్‌గన్స్ గురించి పట్టించుకోవడం లేదు. రెయిన్‌గన్స్‌ను వాడుకుంటే అద్దెకూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మెట్టపంటలకు వర్షం అవసరం: వెంకటేశ్వర్లు రైతు తోడేరు: ప్రధానంగా మెట్ట పంటలకువర్షం అవసరం నిమ్మజామాయిల్ సవక తోటలు వాడు తున్నాయి. ఎండల ఇలాగే ఉంటే ఎండుదశకు చేరుకున్నా అశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఆగస్టు ఎండల వల్ల తోటలకు ఇబ్బందులు తలెత్తాయి.



మథర్‌థెరిసా అవార్డు గ్రహీతలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన 12మందికి

విశ్వమాత మథర్ థెరెసా అవార్డులు

విజయవాడ(నందిగామ),ఆగస్టు27,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సృజనాత్మక, సాంస్కృతిశాఖ, ఫిలాంత్రోఫిక్ జొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వమాత మథర్ థెరిస్సా జాతీయ అవార్డులను వివిధ రంగాలకు చెందిన 12మందికి అందచేసారు. ఆదివారం ఉదయం స్థానిక ప్రెస్‌క్లబ్బులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫిలాంత్రోపిక్ సోసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా తెలిపారు. ఆయన చెప్పిన వివరాలను అనుసరించి ఆంగ్లభాషలో 200 నవలలు రచించిన డాక్టర్ తుర్లపాటి పట్టాభిరాం(విజయవాడ), స్వచ్ఛాభారత్ కార్యక్రమ నిర్వహణలో తూర్పుగోదావరి జిల్లాలో అగ్రగామిగా నిలిచిన ఉయ్యూరు మెరక సర్పంచి చొప్పల విజయకుమారి, ప్రాచీన నాడివైద్య ప్రముఖుడు డాక్టర్ పి,కృష్ణంరాజు (హైదరాబాద్), డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ(కాకినాడ), జికెబాబు(తెలంగాణ), ముఖ్యమంత్రి ప్రత్యేకంగా నగదు పురస్కారం రూ. రెండు లక్షలు అందుకున్న కొండా పల్లవి, అంతర్జాతీయ రంగస్థల నటులు కొమ్ము సుబ్రమ్మణ్యం(ఆకివీడు), మల్లాడి సత్యనారాయణ(యనాం), ఆరవల్లి నరేంద్రకుమార్, యంగలశెట్టి విజయసాయికుమార్(అనంతపురం), మహమ్మద్ ఖాసింషేక్(రాజమండ్రి), ముల్పూరి నాగకల్యాణి (హనుమాన్‌జంక్షన్)లకు మథర్‌థెరిస్సా పురస్కారాలను ప్రదానం చేసారు. ప్రఖ్యాత చలనచిత్ర నటుడు పిళ్ళా ప్రసాద్, ఆంధ్రా ఆర్ట్స్ అకాడెమీ ప్రధాన కార్యదర్శి గోళ్ళనారాయణరావు, తెలుగురక్షణ వేదిక జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్, సీనియర్ పాత్రికేయుడు ఘంటా విజయ కుమార్, అభ్యుదయకవి యడవల్లి శ్రీనివాసరావు, విజయవాడ ప్రెస్‌క్లబ్బు సంయుక్త కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, అమ్మినేని జ్వాలా ప్రసాద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేదర సురేష్‌కుమార్, మటా ప్రభాత్‌కుమార్‌లు అవార్డులను గ్రహీతలకు ఇచ్చి సత్కరించారు.

జిఓ నం179ని రద్దు చేయండి

అమరావతి నిర్మాణ పనులపై ఐవైఆర్ కృష్ణారావు ఆగ్రహం

హైదరాబాద్ (పంజాగుట్ట), ఆగస్టు 27, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణ పని బాధ్యతలను సింగపూర్ కంపెనీలకు అప్పజెప్పడంసరికాదని ఎపి మాజీ ప్రభుత్వకార్యదర్శి ఐవై ఆర్ కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృష్ణారావు 19పేజీల లేఖను రాశారు. ఈ సందర్భంగా సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ సింగపూర్ కంపెనీలైన అసెండెస్, సింగ్‌బ్రిడ్జ్, సెంబ్‌కార్ప్ లాంటి సంస్థలకు దొడ్డిదారిన పనులు అప్పగించేందుకు 179జీఓను అమలు చేసిందని, వెంటనే ప్రభుత్వ ఆ జీవోను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్విస్ చాలెంజ్ విధా నం ద్వారా పనులను చేయుంచుకోవాలనుకోవడం అవినీతికి అవకాశం ఇచ్చినట్లేనని ఆయన ఆరోపించారు. దొడ్డిదారిన కంపెనీలను రాష్ట్రంలోకి తెచ్చేందుకే ఈ జీఓను విడుదల చేశారని ఆయన అన్నారు. స్విస్ ఛాలెంజ్ అంటే సొంతంగా కంపెనీలు రావాలి తప్ప దొడ్డిదారిన కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలువురు ప్రసిద్ధి చెందిన ఆర్థికవేత్తలు సింగపూర్ వ్యవహారాలపై అసంతృప్తి అనుమానాలు వ్యక్తంచేశారని గుర్తుచేశారు. సింగపూర్‌లో కేవలం అంతర్గతపరిపాలనలో మాత్రమే నిజాయితీని పాటిస్తారు తప్ప బయట జరిగే వ్యాపార కార్యాకలాపాల్లో అవినీతి చోటుచేసుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి చట్టాలను సవరిస్తూ విదేశీ కంపెనీలకు అనుగుణంగా సవరణలు చేయడం సరికా దన్నారు. అసలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు రాకముందే పనులు మొదలు పెట్టాలను కోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇక తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రాకపోతే రాజధాని నిర్మాణం చేపట్టాల్సిన చోటును మార్చాలన్న ఆలోచన కూడా రాకపోవడం బాధా కరమన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణం కోసం చెబుతున్న లెక్కలన్నీ గాలిమేడల్లా కనిపిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాప్రయోజనాల కోసం 179జీఓను రద్దుచేసి ఇంటర్నేషనల్ బిడ్డింగ్ విధానం ద్వారా రాజధాని నిర్మాణ పనులు చేయించాలని ఆయన కోరారు.

భార్యాభర్తల మధ్య వివాదాల పరిష్కారంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



ఆదివారం విజయవాడ సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు జస్టిస్ లావు నాగేశ్వరరావు

విజయవాడ క్రైం,ఆగస్టు 27ప్రభాతవార్త: భార్యభర్తల మధ్య వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం విజయవాడ, గవర్నర్‌పేటలోని ఐవి ప్యాలెస్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ అధ్వర్యంలో జస్టిస్ భగవతి, సీనియర్ న్యాయ వాది సి.పద్మనాభరెడ్డి స్మృత్యర్థం క్రిమినల్ లా మరియు వివాహం అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగిస్తూ సమాజ శ్రేయస్సు దృష్ట్యా చిన్న చిన్న తగాదాలతో భార్యభర్తలు విడిపోకుండా ఉండేలా న్యాయవాదులు వారికి సామ రస్యపూర్వకంగా నచ్చచెప్పి, వారికి తగురీతిన సలహాలివ్వాలని పేర్కొన్నారు. వివాదాల నేపథ్యంలో భార్యభర్తలు విడాకులు తీసుకునే వరకు వెళ్ళకుండా న్యాయవాదులు తమ వంతుగా వారికి నచ్చచెప్పి వారు కలిసుండేలా చేయాలన్నారు. సీనియర్ న్యాయవాది పద్మనాభరెడ్డి ఔన్నత్యం గురించి ఆయన సభికులకు వివరించారు. న్యాయవాదులు భార్యభర్తలు కలి సుండేలా తమ వంతు కృషి చేయాలన్నారు. మహిళలకు అనుకూలంగా చాలా చట్టాలు వచ్చా యని, వాటిపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. భార్యభర్తలు వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు. సమాజంలో భార్యభర్తల మధ్య సంబంధ భాంధవ్యాలు పెంపొందేలా న్యాయవాదులు తమ వంతు కృషి చేయాలన్నారు. లీగల్ సర్వీస్ వెల్ఫేర్ కమిటీని సుప్రీంకోర్టు సూచనల మేరకు ఏర్పాటు చేసారని, ఆ కమిటీ పరిశీలించిన తర్వాతే భార్యభర్తల మధ్య కౌన్సిలింగ్ విఫలమైతే వారి సూచనల మేరకు కేసు కట్టాలని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులతో పాటు న్యాయమూర్తులు కూడా భార్యభర్తలను కలపడానికి ప్రయత్నించాలన్నారు. అంతేకాక ఆయన న్యాయశాస్త్రం లోని వేధింపుల చట్టం, మనోవర్తి చట్టం, గృహ హింస నిరోధక చట్టం తదితరాలను సోదాహరణంగా సభికులకు వివరించారు. వాటిపై న్యాయవాదులు అవగాహనను పెంచుకోవాలన్నారు. కార్యక్రమానికి ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత ఐఎఎల్ అధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా హాజరైన ఇరువురు న్యాయమూర్తులను చలసాని అజయ్‌కుమార్ తదితరులు గజమాలలతో సత్కరించి వారికి జ్ఞాపికలను బహూకరించారు. తొలుత ఆహుతులు దివంగత సీనియర్ న్యాయవాది పద్మనాభరెడ్డి, జస్టిస్ పిఎన్ భగవతి చిత్ర పటాలకు పూమాలలు వేసి వారికి ఘనంగా నివాళులర్పించారు. పలువురు ఐఎఎల్ సభ్యులకు ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎఎల్ రాష్ట్ర కార్యదర్శి సీనియర్ న్యాయవాది చల సాని అజయ్‌కుమార్‌ను కూడ సభ్యులు, తదితరులు గజమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్ర మంలో బెజవాడ బార్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, పలువురు న్యాయమూర్తులతో పాటు సీనియర్ జూనియర్ న్యాయవాదులు, ఐఎఎల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దివంగతులైన జస్టిస్ పిఎన్ భగవతి,సీనియర్ న్యాయవాది పద్మనాభరెడ్డి లకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్య, సంప్రదాయ కళల్లో కేరళదే ప్రథమ స్థానం

కేంద్ర మంత్రి దత్తాత్రేయ



ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కేరళ ప్రభుత్వ నిర్వహించిన సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దత్తాత్రేయ. చిత్రంలో హోంమంత్రి నాయిని, మామిడి హరికృష్ణ తదితరులు

హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 27, ప్రభాతవార్త: దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కేరళ గుర్తింపుపొందిన విషయం మనకు విదితమేనని, విద్యతోపాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల్లో కేరళ రాష్ట్రం దేశంలోనే ప్రథమస్థానంలో ఉండడం గర్వించదగ్గ విషయమని కేంద్ర మంత్రి దత్తాత్రేయ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ తెలుగు రీజియన్ మలయాళీ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, కేరళ ప్రభుత్వ భారత్ భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు రవీంద్రభారతిలో 'బంగారు ఓనమ్-2017' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ ప్రపంచవ్యాప్తంగా వైభవంగా జరుపుకొంటున్న ఓనమ్ పండుగ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుందని అంటూ ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ బంగారు ఓనమ్-2017ను ఘనంగా నిర్వహిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేరళ సాంస్కృతిక కళలకు నిలయమన్నారు. ఇక్కడ మీరు చేసిన ప్రదర్శనలు హృదయాలకు హత్తుకుపోయేటట్లు ఉన్నాయని కొనియాడారు. దేశంలో అత్యధికంగా చదువుకున్న వారు కేరళ రాష్ట్రంలోనే ఉన్నారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆడపిల్లలు బాగా చదువుకుని అత్యున్నతస్థానాలకు చేరుకొంటున్నారని వారిని అభినందించారు. కేరళ రాష్ట్రీయులైన మలయాళీలు తెలంగాణ రాష్ట్రంలో మాతో కలసిపోయి వేరనేన్న భావనలేకుండా మనమంతా ఒక్కటేనన్న భావనతో ఉన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర కార్మిక, ఉపాధికల్పనా మంత్రిగా మీకు ముద్రాలోన్ ద్వారా బ్యాంకురుణాలు, విద్య, నైపుణ్యశిక్షణ, ఆర్థిక సహాయం తదితర విషయాల్లో తన పూర్తి సహకారముంటుందని భరోసానిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అంతర్గత వ్యవహారాలశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి బంగారు ఓనమ్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ కేరళకు రాష్ట్రానికి మంచి పేరున్నదని, దేశంలో విద్య, వైద్య, గ్రీనరీ, పంచాయితీరాజ్, ఆడపిల్లలు చదువుకున్న దానిలో నంబర్ వన్ అన్నారు. తెలంగాణలోని హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో నర్సులుగా కేరళ మహిళలే ఉండి అత్యుత్తమ సేవలందిస్తున్నారని, మర్యాదగా ఉంటారని కొనియాడారు. ఓనమ్ పండుగను రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ పండుగగా ప్రకటించారన్నారు. మేము మలయాళీలను గౌరవిస్తూ అఫీషియల్ ఫెస్టివల్‌గా డిక్లేర్ చేశారన్నారు. కాస్మోపాలిటన్ సిటీ అయిన హైదరాబాద్‌లో దేశంలోని అన్నిరాష్ట్రాల ప్రజలు ఉన్నారని, ఇదొక మంచి సంగమం అని, ఇక్కడ అందరి భోజనాలు, రుచులు దొరుకుతాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం, ప్రజల తరపున ఓనమ్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కేరళ భవనానికి బంజారాహిల్స్‌లో ఒక ఎకరం భూమినిచ్చారని, దానిలో భవనం నిర్మించుకొని వచ్చే సంవత్సరం ఓనమ్ పండుగను అక్కడ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర పూర్వ గవర్నర్ డా. కొణిజేటి రోశయ్య, తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మంత్రి జూపల్లి, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక, పర్యాటక కార్యదర్శి బుర్రా వెంకటేశం, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సిటిఆర్ఎంఎ అధ్యక్షుడు బిజ్జీ బెంజమిన్, ఉపాధ్యక్షుడు ఎస్.ఎలెక్స్, కార్యదర్శి కె.ఆర్.శశిధరన్ నాయర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రానికి చెందిన వివిధ కళాప్రదర్శనలు అత్యంత వైభవంగా ప్రదర్శింపబడి ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి.



ఆదివారం హైదరాబాద్‌లో లలితా జ్యువెలర్స్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి కెటిఆర్. చిత్రంలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ, ఎంపి టి.సుబ్బరామిరెడ్డి తదితరులు

హైదరాబాద్‌లో లలితా జ్యువెలర్స్

భారీ షోరూంను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్ (పంజాగుట్ట), ఆగస్టు 27, ప్రభాతవార్త: దేశంలోనే నాణ్యతకు మారుపేరుగా వినియోగదారులకు వివిధ రకాల ఆభరణాలు అందిస్తున్న లలితా జ్యువెల్లర్స్ తెలంగాణలో తన మొట్టమొదటి శాఖను ప్రారంభించింది. అతిరథ మహారథులు, ప్రముఖులు పాల్గొన్న అంగరంగ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ లలితా జ్యువెల్లరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్, కేంద్ర మంత్రి దత్తాత్రేయ, మంత్రి నాయిని నర్సింహారెడ్డి, పార్లమెంట్ సభ్యులు టీ.సుబ్బ రామిరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. లలితా జ్యువెల్లర్స్ ప్రధాన విభాగాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ వ్యాపార రంగంలో ప్రపంచ, దేశ వ్యాప్తంగా హైదరాబాద్ నగరం ఎంతో ముందుంటున్నదన్నారు. అనేక ప్రముఖ కంపెనీలు హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నా యన్నారు. ఎంతో పేరుగాంచిన లలితా జ్యువెల్లర్స్ హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం అభినందనీయం అన్నారు. అనంతరం లలితా జ్యువెల్లర్స్ చైర్మన్ డాక్టర్ ఎం. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జ్యువెల్లరీ, డైమండ్ వ్యాపారంలో హైదరాబాద్ నగరం ఎంతో ముందుందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వాసులు నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తారని దీన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యతగా ఆభరణాలను వినియోగదారులకు అందించేందుకు తమ శాఖను హైదరాబాద్‌లో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సుమారు 1,30,000చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ షోరూంను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. డైమండ్స్, బంగారం, మోడల్ జ్యువెల్లరీ మహిళలకు ఎంతో ప్రియమైన రకరకాల ఆభరణాలను లలితా జ్యువెల్లర్స్ అందిస్తుందని తెలిపారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో మరి కొన్ని శాఖలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం షోరూంలోని వజ్రాభరణాల విభాగాన్ని లైకా గ్రూప్ చైర్మన్ ఏ.సుభాస్కరన్ దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైకా గ్రూప్ వైస్ చైర్మన్ సి.శివకరన్, డీసీ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ దిలిప్ చా బ్రియా, వేల్స్ విశ్వవిద్యాలయం చైర్మన్ డాక్టర్ ఐసరి కె.గణేష్, అడయార్ ఆనంద భవన్ మేనేజింగ్ డైరెక్టర్ కేటీ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం

- కెసిఆర్ మోడీల రహస్య మంతనాల రహస్యం ఏంటీ..?
- సిఎం పాలన లోపభూయిష్టం
- 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం:

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జోస్యం



ఆదివారం కొడంగల్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమాజీ మంత్రి జైపాల్‌రెడ్డి

కొడంగల్,అగష్టు 27 ప్రభాతవార్త: రాష్ట్రంలో అధికార టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు సీఎం కేసీఆర్ పాలనపై ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కహామీ నెరవేర్చ లేదని, అందులో ప్రధానంగా దళితులకు 3 ఎకరాల భూపంపిణీ,ఎస్టీలకు,ముస్లింలకు 12 శాతం రిజర్వే షన్‌లు కల్పిస్తామన్న హామీలు నేటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు.బీసీ-ఏ గ్రూపులో ఉన్న లండాడీలను కాంగ్రెస్ హాయంలోనే గిరిజనులుగా గుర్తిస్తూ ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే ముస్లింలకు దివంగత రాజశేఖర్‌రెడ్డి హాయంలో 4శాతం రిజర్వేషన్‌లు కల్పించడం జరిగిందన్నారు. మరోపక్క గ్రామాల్లో రైతుల పరిస్ధితి అధ్వాన్నంగా ఉందని,రూ.1లక్ష రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం అందించిన రుణమాఫీ నేటికి రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు.2019 ఎన్నికల్లోను టీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని సీఎం చేసిన వాఖ్యలపై స్పందించిన జైపాల్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు మానుకోవాలని కేసీఆర్‌కు హితువు చెప్పారు. ఆంధ్రాలో టీడీపీ,బీజేపీలు కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తాయని అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణాలో టీఆర్ఎస్,బీజేపీలు కలిసి ఉన్నట్లా..లేనట్లా అంటూ కలువ కుంటే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్దులకు ఎందుకు ఓటేసినట్లని సూటిగా ప్రశ్నించారు. బీజేపీ,టీఆర్ఎస్ పార్టీలకు లోపాయికారి ఒప్పందం అవగాహన ఉందని,కేసీఆర్,మోదీల రహస్య మంతనాల్లో రహస్యం దాగి ఉందని సెటైర్లు విసిరారు.ప్రజా స్వామ్యంలో రహస్య రాజకీయాలు మంచికాదన్నారు. సాగునీటి పారుదల ప్రాజెక్టులపై ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లాపై టీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు.గతంలో కేసీఆర్ జిల్లా ఎంపీగా ఉన్న విషయం మర్చిపోరాదన్నారు.కాంగ్రెస్ హాయంలో నారాయణపేట్-కొడంగల్ ప్రాజెక్టుకు సంభందించిన ఇచ్చిన జీఓ అమలుకాక పోవడం విచారకరమన్నారు.ఈ అంశంపై కాంగ్రెస్‌తో పాటు టీడీపీ,సీపీఐ,సీపీఎం పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు.సాగునీరు అందించడంలో కొడంగల్, నారాయణపేట్,మక్తల్ నియోజకవర్గాలకు ప్రభుత్వం మొండిచేయ్యి చూసిస్తున్నదని విమర్శించారు.టీ-టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారనే అంశంపై స్పందించిన జయపాల్‌రెడ్డి పార్టీలో చేరికపై పీసీసీ అధ్యక్షులు ఉత్తంకుమార్‌రెడ్డి,రాష్ట్ర వ్యవహారల ఇంచార్జ్ కుంతియాల పరిధిలో ఉంటుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్‌నాయక్, సలీం, శ్రీరాంరెడ్డి, మధుసుదన్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, దామోదర్‌రెడ్డి,కృష్ణంరాజు,ఎల్.నర్సి రెడ్డి,నాగులపల్లి నరేందర్, నరోత్తంరెడ్డి, జయక్రిష్ణ, పులేందర్‌రెడ్డి, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఆరోగ్య రంగం

ప్రభుత్వాలు చేతులెత్తుస్తున్నాయని వైద్య నిపుణుల ఆందోళన

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: దేశంలో ఆరోగ్య రంగం ప్రమాదంలో పడిందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులపై నియంత్రణ లేకపోవడంతో రోగుల వద్ద నుంచి అందిన కాడికి దోచుకుంటూ మొత్తం వైద్య రంగాన్నే వ్యాపారమయం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రైవేటు వైద్యులు రెండు మూడు మందులకు బదులు చాంతాడంత చీటీలు రాస్తున్నారనీ, ఇవి ఔషధాల షాపులకు మేలు చేసే విధంగా ఉంటున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతీ ముగ్గురిలో ఒకరికి క్యాన్సర్ సోకుతున్నా ప్రభుత్వాసుపత్రులలో మందులు దొరకడం లేదు. ఫార్మా రంగానికి అనేక అంశాలతో పాటు భవిష్యత్తులో ముప్పు పొంచి ఉన్న దృష్ట్యా దీనిపై సుదీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. దీనిపై ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో వివిధ రంగాలకు చెందిన వైద్యులు, ఫార్మారంగ యాజమాన్యాలు, వైద్య రంగ నిపుణులు పాల్గొననున్నారు. ఈ సదస్సులో దేశంలో వైద్య రంగంలో వస్తున్న మార్పులు, అవి పేద రోగులకు మేలు చేస్తున్నాయా ? లేదా ? ప్రభుత్వాలు ఎలాంటి పాత్ర పోషించాలి ? అనే అంశాలపై వైద్య నిపుణులు సూచనలు ఇవ్వనున్నారు.

ఇందిరమ్మ కాలువకు వరదలా నిధులు

రీ డిజైనింగ్‌తో రెట్టింపుకన్న ఎక్కువైన అంచనా

రూ.4729.26కోట్ల నుంచి రూ.9886.19కోట్లకు చేరిక

ఆమోదం తెలిపిన ఇరిగేషన్ స్టాండింగ్ కమిటీ, త్వరలో ఉత్తర్వులు

హైదరాబాద్ ఆగస్టు 27, ప్రభాతవార్త: శ్రీరాంసాగర్ రెండో దశ పనుల్లో భాగంగా చేపట్టిన ఇందిరమ్మ వరద కాలువకు నిధుల వరద మొదలయింది. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు శ్రీరాంసాగర్ నుంచి నీటిని వరద కాలువ ద్వారా తెలంగాణలోని అయిదు జిల్లాల్లో లక్షలాధి ఎకరాలకు సాగునీరందించాలని ఎస్సారెస్పీ-2లో భాగంగా ఈ పనులు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దీనిని(ఇందిరమ్మ వరద కాలువ) ప్రారంభించగా పనుల్లో జాప్యం వల్ల అంచనాలు పెరుగుతూ తెలంగాణ ఆవిర్భావం నాటికి దీనికోసం అయ్యే వ్యయం రూ.4729.26కోట్లకు చేరింది. ఎస్సారెస్పీ పూర్తి స్థిరీకరణతో పాటు, ఇదే వరద కాలువ నుంచి శ్రీరాంసాగర్‌లోకి సైతం నీటిని నింపే అపూర్వమైన పనికి తెలంగాణ శ్రీకారం చుట్టింది. ఇలా ఎన్నో మార్పులు చోటుచేసుకున్న కారణంగా ఇప్పుడు ఈ కాలువలో నిధుల వరద ప్రవాహం మొదలయింది. రీడిజైన్ల కారణంగా దీని అంచనా రెట్టింపు కన్నా ఎక్కువ అయింది. 2009లో దీని అంచనా రూ.4729.26కోట్లు కాగా ఇప్పుడు రూ.9886.19కోట్లకు చేరుకుంది. అంటే రీడిజైన్ కారణంగా ఏకంగా రూ.5,156కోట్లు పెరిగింది. అంటే 2009నాటి మొత్తం వ్యయం కన్నా ఎక్కువ పెరిగింది. పెరిగిన ఈ అంచనా వ్యయాన్ని ఇరిగేషన్ రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఒకటి రెండు రోజుల్లో పెరిగిన అంచనా వ్యయానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలుబడతాయని ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఎస్సారెస్పీ దిగువ నుంచి 20టిఎంసీల వరద నీటిని వినియోగించుకుంటూ 2.2లక్షల ఎకరాలకు నీరందించడానికి 1996లో ఈ ఇందిరమ్మ వరద కాలువను చేపట్టారు. అప్పుడే ఆమోదం పొందినప్పటికి పనులు మాత్రం 2009లో ప్రారంభం అయ్యాయి. అప్పుడు దీని అంచనా రూ.4729.26కోట్లుగా నిర్ణయించి పనులు మొదలుపెట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీనిలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. గోదావరిలో వరద ఉండే 170రోజుల్లో 38.182 టిఎంసీల నీటిని దేవాదుల ప్రాజెక్టుకు ఎత్తిపోసి దీని ద్వారా 6.21లక్షల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఇక్కడ వరద 120రోజులే ఉంటుందని నీటి లభ్యత 27టిఎంసీలనేనని గుర్తించారు. దీంతో దీని నుండి రెండు లక్షల ఆయకట్టును వరద కాలువలో కలిపారు. కొత్తగా ఈ ఆయకట్టుకు నీరందించాలంటే 3.3కిలోమీటర్ల అదనపు టన్నెల్ నిర్మాణంతో పాటు 48కిలోమీటర్ల మేర గ్రావిటీ కెనాల్ తవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. మిడ్‌మానేరు రిజర్వాయర్ తొలి నుంచి 36కిలోమీటర్ల మేర కెనాల్ సామర్థ్యాన్ని 2,600క్యూసెక్కుల నుంచి 4,200క్యూసెక్కులకు పెంచాలని ప్రతిపాదించారు. గౌరవెల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.41టిఎంసీల నుంచి 8.23టిఎంసీలకు పెంచాలని నిర్ణయించారు. గండిపల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 0.15టిఎంసీల నుంచి 1.40టిఎంసీలకు పెంచారు. ఇలా పలు పనులను పెంచడంతో ఇందిరమ్మ వరద కాలువ మొత్తం అంచనా తాజాగా తొలి అంచనా కన్నా వందశాతానికి పైగా పెరిగింది.

నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలి

సెప్టెంబర్ 1 నుండి రైతు సమన్వయ సంఘాలు: మంత్రి పోచారం



ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యాన మహోత్సవం-2017ను ప్రారంభించిన మంత్రి పోచారం

హైదరాబాద్, అగస్టు 27, ప్రభాతవార్త: ఉద్యాన పంటల విషయంలో నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కావాలంటే ప్రజలు నాణ్యమైన, తాజా ఆహారాన్ని తీసుకోవాలని సూచించాచు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో తెలంగాణ ఉద్యన మహోత్సవం-2017ను ఆదివారం మంత్రి పోచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటికి అవసరమైన కూరగాయలను ఇంట్లోనే పండించుకోవాలన్నారు. పురుగు మందులు వాడకుండా సేంద్రీయ పద్దతులను ఆచరించి తాజా కూరగాయలను పండించుకోవాలని సూచించారు. ఇళ్లలోనే కూరగాయలను పండించడానికి అవసరమైన ఆధునాతన, సాంకేతిక పద్దతులను రాష్ట్ర ఉద్యా శాఖ అందు బాటులోకి తెచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు, పండ్లను మన రాష్ట్రంలోనే పండించడమే కాకుండా ఎగుమతి చేసే స్థాయికి ఉత్పత్తులు చేరాలని చెప్పారు. ఉద్యాన పంటల ద్వారానే రైతులు అధిక ఆదాయాన్ని పొదుతారని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం భారీగా రాయితీలను కల్పించి ఉద్యాన పంటల రైతులను ప్రోత్సహిస్తోందని వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలోని 10,800 రెవెన్యూ గ్రామాలను 3,600 యూనిట్స్‌గా విభజించి సెప్టెంబర్ 1వ తేదీ నుండి 9వ తేదీ వరకూ గ్రామ రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 10 నుండి 14వ తేదీలోగా మండల రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసి, రిసోర్స్ పర్సన్స్ ద్వారా సదస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రైతు సమగ్ర సర్వే వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి సమన్వయకర్త, ఎఇఒ సంతకాలతో కూడిన రికార్డుల ఆధారంగా వచ్చే ఏడాది మే 15వ తేదీ నాటికి ఎకాలకు 4 వేల రూపాయల చొప్పున నగదును రైతుల ఖాతాల్లోకి బదిలీ చేస్తామని పేర్కొన్నారు. రెండు పంటలు పండించే ఉద్యాన రైతులకు ఏడాదికి 8 వేల రూపాయలను పెట్టుబడి నిధి కింద అందిస్తామని చెప్పారు. రైతులు అప్పుల బారి నుండి బయట పడి, ఆత్మహత్య రహిత తెలంగాణ సాధనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పోచారం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సి పార్థసారధి, ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామిరెడ్డితోపాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖలో పదోన్నతులు

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: తెలంగాణ జైళ్ల శాఖలో ముగ్గురు అధికారులకు పదోన్నతులు లభించాయి. చంచల్‌గూడ జైలు పర్యవేక్షణాధికారి సైదయ్యకు హైదరాబాద్ రేంజి డిఐజిగా పదోన్నతి లభించింది. కాగా ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా ఎం.ఆర్ భాస్కర్ నియమితులయ్యారు. కాగా సికా ప్రిన్సిపాల్ మురళిబాబును చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం జైలు పర్యవేక్షణాధికారిగా నియమించారు. ఈ మేరకు సర్కారు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నైజాం సర్కరోడా యూనిట్‌కు బిజెపి సత్కారం

హైదరాబాద్, ఆగస్టు 27పభాతవార్త: నైజాం సర్కారోడా సినిమా యూనిట్‌కు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీనేతలు సత్కరించారు. ఆదివారం బిజెపి సినిమా సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా. లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు హాజరై నైజాం సర్కారోడా సినిమా యూనిట్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ బకాయిలకు ఇంకెన్నాళ్లు

మాట నిలబెట్టుకోండి.. ప్రభుత్వానికి రేషన్ డీలర్ల మొర

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: చాలీ చాలని ఆదాయంతో బతుకు బండి లాగలేక పోతున్న తమపై మిడ్డే మీల్స్ భారం మరెంత కాలం అని తెలుగు రాష్టాల రేషన్ డీలర్లు ప్రభుత్వాలను నిలదీస్తున్నారు. కేవలం బియ్యం పంపిణీకే పరిమితమైన తమకు వచ్చే కమిషన్ నిర్వహణ ఖర్చులకే సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్న డీలర్లు 2002 నుండి మధ్యాహ్న భోజన పథకానికి పంపిణీ చేస్తున్న బియ్యానికి సంబంధించి ప్రభుత్వం నుండి ఇప్పటికీ కమిషన్ రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002 నుండి మిడ్డే మీల్స్‌కు సంబంధించిన బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం డీలర్లకు క్వింటాలుకు రూ.17 చొప్పున చెల్లిస్తామని హామినిచ్చిందని డీలర్లు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికీ ఒక్క పైసా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2015 ఫిబ్రవరి నుంచి ఈ పాస్ విధానం అమలు చేస్తున్నారు. ఈ పాస్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కమిషన్ తో పాటు మిడ్డే మీల్స్ బియ్యానికి సంబంధించిన కమిషన్ కూడా చెల్లిస్తామని అప్పట్లో అధికారులు హామినిచ్చారని డీలర్ల సంఘం నేతలు తెలిపారు. మిడ్డే మీల్స్‌కు సంబంధించిన బియ్యం కమిషన్ ఇవ్వక పోగా ఆ బియ్యం లోడింగ్ అన్‌లోడింగ్‌కు సంబంధించిన చార్జీలు కూడా తామే భరిస్తున్నామని, ఈ బియ్యానికి సంబంధించిన సంచులను డీలర్లు తీసుకోవాలని చెప్పినా మిడ్డే మీల్స్ సంచులు ఖాళీ అయిన తర్వాత తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రేషన్ డీలర్‌కు మిడ్డే మీల్స్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమిషన్ బకాయిలు రూ. 10 వేల నుండి రూ. 15 వేల వరకు ప్రభుత్వం నుండి రావాల్సి కుందని ఎపి రేషన్ డీలర్ల సంఘం నాయకులు తెలిపారు. ఈ బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటించి రెండు నెలలు గడిచినప్పటికీ ఆచరణకు నోచుకోలేదని అంటున్నారు. కాగా 2013-14 నుండి అంగన్‌వాడీలకు కూడా రేషన్ డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ చేస్తున్నారని ఇందుకు సంబంధించిన కమిషన్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెప్టెంబరు 2,3 తేదీలలో ప్రజా ఉద్యమాల అణిచివేతకు వ్యతిరేకంగా

సిడిఆర్ఒ, సిఎల్‌సి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు

హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 27 ప్రభాతవార్త: ప్రజాస్వామిక హక్కుల సమన్వయ సంస్థ (సిడిఆర్ఓ) దశాబ్ధ హక్కుల ఉద్యమ ప్రస్థానంలో ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణిచివేతకు వ్యతిరేకంగా అఖిల భారత స్థాయి సదస్సు సెప్టెంబరు 2,3 తేదీలలో నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని సిడిఆర్ఓ, పౌర హక్కుల సంఘం తెలిపాయి. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షుడు వి.రఘునాధ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పి.ఎం.రాజు, సిడిఆర్ఓ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ కాంత్రి చైతన్య తదితరులు ఈ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 2వ తేదీన జరిగే సదస్సులో ఆదివాసీ మహిళలపై జరిగే రాజ్యహింస అనే అంశంపై సోనీసోరీ, ప్రజా ఉద్యమాలపై అణిచివేత న్యాయ వ్యవస్థపై క్రాంతి చైతన్య, జాతీయ ఉద్యమాలు-రాజ్యం అణిచివేతపై గౌతమ్ నవలాఖ, హక్కుల ఉద్యమకారులపై ప్రభుత్వ అణిచివేత అనే అంశంపై జేలాబాటియా ప్రసంగిస్తారని వారు వివరించారు. 3వ తేదీన పత్రికా స్వేచ్ఛా-రాజ్య నిర్భంధం అనే అంశంపై మాలినీ సుబ్రహ్మణ్యం, పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలు-కార్యచరణపై ప్రొఫెసర్ జి.హరగోపాల్, హిందూ ఫాసిజం-దళితులు, మైనారిటిలు అనే అంశంపై ప్రొఫెసర్ ఆనంద్ టెల్‌తుంబ్డె ప్రసంగిస్తారని, సాయంత్రం 6 గంటల నుంచి 9 వరకు జరిగే బహిరంగ సభలో దేశ వ్యాప్తంగా ఉన్న హక్కుల సంఘాల నాయకులు ప్రసంగిస్తారని చెప్పారు. హక్కుల ఉల్లంఘనలు ఎక్కువైన కొద్ది ప్రజలపైన, ప్రజాఉద్యమాలపై అణిచివేతలు ఎక్కువవుతున్న నేపథ్యంలో దేశంలోని వివిధ హక్కుల సంఘాల మధ్య సమన్వయం మరింత అవసరమని, అప్పుడే ఈ దేశంలో మరింతగా బలమైన హక్కుల ఉద్యమాలను నిర్మించడానికి అవకాశం ఉంటుందని, ఆ లక్ష్యంతోనే సిడిఆర్ఓ దశాబ్ధ సమావేశాలను హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్నదని వారు చెప్పారు. నేడు భావ ప్రకటనా స్వేచ్ఛమీద గతంలో ఎన్నడు లేని విధంగా అణిచివేత కొనసాగుతున్నదని, ప్రశ్నించేవారి గోంతునోక్కివేయడమే కాకుండా దాడులు జరుగుతున్నాయని, తమను విమర్శించే వారిపట్ల పోలీసులు అసహనంతో హద్దులు మీరుతున్నారని, ప్రజాస్వామ్య బద్ధమైన నిరసనలకు కూడా ప్రభుత్వాలు సహించే స్థితిలో లేవని, చివరకు నాలుగు గోడల మధ్య జరిగే సమావేశాలకు సైతం పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని, అనుమతులు అడిగితే కుంటి సాకులతో నిరాకరిస్తూ సభలు, సమావేశాలను అడ్డుకుంటున్నారని వారు ధ్వజమెత్తారు.



ఆదివారం హైదరాబాద్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ. గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు తదితరులు

సొగసైన వర్చస్సు కోసం...



నిస్తేజమైన చర్మం, శుష్కించిన జుట్టు, పాతతరకం మేకప్‌లతో విసిగెత్తిపోయిందా? మరైతే కొత్త లుక్‌కోసం ప్రయత్నించాలి. ఎలాగంటారా? వీలున్నంతగా చర్మానికి కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు వేర్వేరు రంగుల కాంబినేషన్‌తో అందాలు దిద్దుకోవాలి. వ్యక్తిత్వాన్ని పూర్తిగా మార్చేసుకుని చూడండి. తప్పకుండా మీకు మీరే కొత్తగా కనిపిస్తారు.

కొత్తకట్స్ రంగులు: ముఖం తాలూకు కట్స్, వయసు, రంగు వీటిని దృష్టిలో ఉంచుకుంటూ, కొత్త హెయిర్ కట్ చేయించుకోవాలి. అలాగని పొడుగాటి జుట్టును మరీ పొట్టిగా కత్తిరించుకోకూడదు. ముందు మిడ్ లెంగ్త్ కట్ చేయించుకుని, అది బావుందనుకుంటే, మరోసారి ఇంకాస్త పొట్టిగా చేయించుకోవచ్చు. హెయిర్ కట్ చేయించుకునేటప్పుడు జుట్టు టెక్చర్‌ను తప్పకుండా దృష్టిలో ఉంచుకోవాలి. జుట్టుకు రంగును వేయించుకోవటం వలన 'లుక్' పూర్తిగా మారిపోతుంది. జుట్టు మొత్తానికి రంగు వేయించుకోవటం నచ్చకపోతే (దీనిన గ్లోబల్ హెయిర్ కలర్' అంటారు) ఒక షేడ్ మాత్రం తీసుకుని జుట్టులో కొంత భాగానికి మాత్రమే రంగు వేయించాలి. అంటే పైభాగం హైలెట్ కావాలన్నమాట.

భారతీయుల స్కిన్ టోన్‌కు సూట్ కాకపోవటం వలననూ, ఫ్యాషన్ కాకపోవటం చేతనూ (గోల్డ్) బంగారు రంగు పూర్తిగా వేయించకూడదు. మనదేశం వారికి సరిపోయే రంగులు బర్గండీ చెస్‌నట్, ఆబర్న్, పర్పుల్ మాత్రమే. హెయిర్ కలర్, స్టయిల్ ఈ రెండూ కూడా లైఫ్‌స్టయిల్, లుక్ హెయిర్ స్ట్రక్చర్‌లకు మ్యాచ్ అయ్యేలా ఉంటే చాలా బావుంటుంది. రోజూ ఒకటే రకం క్రీమ్, ఫేస్‌వాష్, షాంపూ తదితరులు వాడీ వాడీ విసుగ్గా ఉంటే ఎంత మాత్రం సందేహించకుండా వాటిని మార్చాలి. కొత్త ఫేస్‌వాష్, మాయిశ్చరైజర్ వాడి చూడాలి. వీలయితే ఇంట్లోనే స్పా తీసుకోవాలి. స్పాకోసం చిక్కని, క్రీమ్ బాడీ వాష్, బాడీ మాస్క్, మాయిశ్చరైజర్, ఆరోమా ఆయిల్, కొత్త రంగుల కాండిల్స్‌తో సరికొత్త వాతావరణం సృష్టించుకోవాలి.

వయసు మరువకూడదు

అన్ని వయసుల్లోనూ చర్మం జాగ్రత్తలు ఒకే విధంగా తీసుకోకూడదు. వయసు పై బడుతున్న కొద్దీ చర్మం టెక్చర్ మారుతుంటుంది. ఇరవై పాతికేళ్ల మధ్య వారైతే, స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజర్ రాసుకుని తరువాత సన్‌స్క్రీన్ ఉపయోగించవచ్చు. పాతికేళ్ల పై బడిన వారైతే, చర్మరక్షణ కోసం సౌమ్యమయిన (మైల్డ్) సౌందర్య సాధనాలు అవసరమవుతాయి. వాటిలో అండర్ ఐ క్రీమ్, ఫేస్‌వాష్‌లను చేర్చుకోవాలి. అండర్ ఐ క్రీమ్ వల్ల కళ్ల కిందున్న సున్నితమయిన చర్మం మృతకణాలను తొలగించుకుంటూ పునర్జీవిస్తుంటుంది. అలాగే గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేయటం వల్ల ఏర్పడే ఫైన్ లైన్స్‌ను తొలగిస్తుంది.

ముప్పయేళ్ల పై వయసు వారైతే క్రమబద్ధంగా ఫేషియల్ చేయించుకోవటం అలవర్చుకోవాలి. చర్మంపై మెరుపు తెచ్చేందుకు అవసరమయిన సౌందర్య సాధనాలు, యాంటీ ఏజింగ్ ఉత్పత్తులుగా వాడకంలోకి తెచ్చుకోవాలి. వాటితో పాటు వారానికి ఒకసారి డీప్ క్లీనింగ్ మడ్‌మాస్క్ కూడా వేసుకోవాలి. దీన్ని వేసుకోవటం వల్ల చర్మంలోని మృతకణాలు పూర్తిగా తొలగిపోయిన చర్మానికి బిగింపు కలుగుతుంది. ముడతలు రావు. 30యేళ్ల వయసు దాటిన వారికి చర్మంలో శుష్కటి ఎక్కువ ఉంచేందుకు తగిన సాధనాలు వాడటం మంచిది. లుక్‌ను మార్చుకోవాలను కున్నప్పుడు బోటాక్స్, లైపోసక్షన్, ఫేస్ లిఫ్ట్(బ్రెస్ట్ లిఫ్ట్, వంటి సర్జరీల సాయం కూడా తీసుకోవచ్చు. కానీ రైనో ప్లాస్టీ (ముక్కు సర్జరీ) ఫేస్ లిఫ్ట్, ఐ లిడ్ సర్జరీ చేయించుకోవాలనుకుంటే మాత్రం బాగా ఆలోచించిన తరువాత నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే వీటిని చేయించుకున్న తర్వాత శరీర భాగాలు మళ్లీ మునుపటి ఆకారాల్లోకి రావటం చాలా కష్టం. లేజర్ మైక్రో డర్మే (బేజన్, బోటోక్స్‌లలో మాత్రం 'లుక్'ను సంపూర్ణంగానూ, ఖచ్చితంగానూ మార్చుకునే వీలుంటుంది. మైక్రోడర్మే బేజన్, పీల్‌లలో చర్మ నిర్మాణాన్ని చాలా వరకు మేలైనదిగా చేస్తారు. ❒



కంటికింపుగా!

ఎక్కువ సేపు కంప్యూటర్ ముందు పనిచేస్తూ కూర్చునే వారికి కంటికి సంబంధించి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కళ్ల నుండి నీరు రావడం, వేడిగా అనిపించడం, మంట, నల్లని వలయాలు వంటి సమస్యలు బాధిస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు నిపుణులు చెబుతున్న సలహాలు...

♣ కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడితే కమలాపండు రసంలో నాలుగు చుక్కల పాలు కలిపి కళ్ళకింద సున్నితంగా రాయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

♣ గుండ్రంగా కోసిన దోసకాయ ముక్కలను కళ్లకింది పెట్టుకుని ఒక పదిహేను నిమిషాలు ఉంచాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే కళ్ళకింద ఏర్పడిన ముడతలు పోయి వలయాలు తగ్గుముఖం పడతాయి.

♣ రాత్రిపూట పడుకునేముందు కొద్దిగా ఆల్మండ్ క్రీమ్‌ను కంటి చుట్టూ రాసి నెమ్మదిగా మసాజ్ చేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే డార్క్ సర్కిల్స్ తగ్గుముఖం పడతాయి.

♣ రోజ్‌వాటర్‌లో ముంచి దూదిని కళ్లపై పెట్టుకుని ఐదునిమిషాలు విశ్రాంతి తీసుకుంటే మంచిది.

♣ నిద్రకు పడుకునే ముందు కీరదోస రసాన్ని కంటిచుట్టూ పట్టించినా మంచి ఫలితం ఉంటుంది.

♣ టమాట గుజ్జు, పసుపు, నిమ్మరసం, శనగపిండి పేస్టులా చేసి, కళ్లచుట్టూ రాసుకుని ఆరిన తర్వాత నీటితో కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.

ఈ చిట్కాలన్నీ 5,10 నిమిషాలు మించి చేయాల్సిన అవసరం లేదు. పైగా వస్తువులన్నీ ఇంట్లో దొరికేవే. కాబట్టి క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ❒



డా॥కె. ఉమాదేవి, తిరుపతి

పిల్లల్లో వచ్చే మెదడు వాపు వ్యాధి

దీన్నే బ్రెయిన్ ఫీవర్, వైరల్ ఎన్‌సెఫలైటిస్, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ (జె.ఇ.) అని అంటారు. దీన్ని మొదటి 1500 సంవత్సరాల క్రితం ఇండోనేషియా, మలేషియాలలో గుర్తించారు. 1871లో జపాన్‌లో మొదటి కేసుగా మెదడు వాపుని గుర్తించారు. దీనివల్ల 20 జపనీస్ ఎన్‌సెఫలైటిస్‌గా ప్రాచుర్యం పొందింది. ఆసియాలో ప్రతి సంవత్సరం 70,000 కేసులు వస్తుంటాయి. ఇది జెఇవి వైరస్ వల్ల వస్తుంది. ఇది ఫ్లావీ వైరస్ తరగతికి చెందింది. 90శాతం మందిలో ఈ వైరస్ సోకినప్పటికి ఈ వ్యాధి రాదు. పదిశాతం మందిలోనే వస్తుంది. 250 మందికి ఇన్ఫెక్షన్ సోకితే వారిలో ఒకరిలో మాత్రమే వ్యాధి లక్షణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. చాలామందిలో ఎటువంటి వ్యాధి లక్షణాలు కన్పించవు. జె.ఇ.వైరస్ క్రిములు పందిలో వున్నప్పటిక దీనికి రాదు. ఈ వైరస్ గుర్రాలు గేదెలు, ఆవులు, పిల్లలు, కుక్కలు, బాతులు, గబ్బిలాలు, పక్షులలో కూడా వుంటుంది. కాని జె.ఇ.వైరస్ వున్న పందిని కుట్టిన క్యూలెక్స్ దోమలోకి ఈ క్రిములు ప్రవేశిస్తాయి. దోమల్లో 10 రోజుల్లో 10రెట్లు జె.ఇ.వైరస్ క్రిములు వృద్ధి చెందుతాయి. ఈ క్యూలెక్స్ దోమ మనుష్యుల్ని కుట్టినపుడు మనుష్యుల్లో వైరస్ క్రిములు చేరి మెదడువాపు వ్యాధిని కల్గిస్తుంది. దోమలు మెదడు వాపువున్న వ్యక్తికి కుట్టి మరొక వ్యక్తిని కుట్టినంత మాత్రాన రాదు. అంటే పందులు మనుష్యులకు మధ్య వారధి క్యూలెక్స్ దోమలు. కొన్నిసార్లు ఎనాఫిలస్, మాన్సోనియా దోమల వల్ల కూడా వస్తుం ది. ఇది దోమలు, పందులు ఎక్కువగా వున్న ప్రాంతాల్లో మురికివాడలు, జనసమర్థ్యమున్న ప్రాంతాల్లో వర్షాకా లంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వస్తుంది. ముఖ్యంగా ఆగష్టు నుంచి డిసెంబర్ వరకు ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. పట్టణ ప్రాంతాల్లో కొంత తక్కువగా వుంటుంది. ఈ వ్యాధి ఒక ప్రాంతంలో ఒకేసారి అనేక మందికి సోకుతుంది. దీన్నే 'ఎపిడమిక్ డిసీజ్' అని అంటారు. సాధారణంగా 9-10 సంవత్సరాల కొకసారి ఈ వ్యాధి తీవ్రంగా ప్రబలుతుంది. జె.ఇ వైరస్ రెండు దశలలో (పందులు, మనుష్యులు) సాగుతుంది. 1955లో ఇండియాలో మొదటి కేసు గుర్తించారు. తెలంగాణలో ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం, గుంటూరులలో ఈ కేసులు అధికంగా నమోదు అయ్యాయి. అయితే ఇది ఇతర అంటువ్యాధుల్లా ఒకరి నుంచి మరొకరికి నేరుగా సంక్రమించదు.

ఈ వ్యాధి 15 సంవత్సరాల లోపు పిల్లల్లో ఎక్కువగా ముఖ్యంగా 2-5 సంవత్సరాల వారిలో ఇది ప్రమాదకరంగా పరిగణిస్తుంది. వీరిలో మెదడు పైపొరలు, నాడీకణాలు వాస్తాయి. మెదడు దెబ్బ తింటుంది. అందుకే దీన్ని 'బ్రెయిన్ ఫీవర్' అని అంటారు.

వ్యాధి లక్షణాలు: పందుల్లో అభివృద్ధి చెందిన జెఇవి వైరస్ దోమల ద్వారా మనిషి రక్తంలోకి ప్రవేశించిన 5-16 రోజుల్లో వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి. ఇది 4 రకాలుగా కన్పిస్తుంది.

1. ఇన్ఫెక్షన్ తీవ్రత వల్ల వచ్చే లక్షణాలు

అధిక ఉష్ణోగ్రతతో జ్వరం, విపరీతమైన తలనొప్పి వుంటుంది. భరించలేని విధంగా బాడీ పెయిన్స్, గొంతునొప్పి, ఆహారం, నీళ్లు తీసుకోలేకపోవడం, జ్వరం వచ్చిన రెండు మూడు రోజుల్లో అపస్మారకం వంటి లక్షణాలుంటాయి.

మెదడు దెబ్బతినడం వల్ల వచ్చే లక్షణాలు

శరీరంలోని అవయవాలు బలహీనతకు గురవడం, కనుగుడ్లు అటుఇటు తిప్పడం, కాళ్లు చేతులు ఎగరేయడం, అదరడం, బిగుసుకుపోవడం, మగత, గురక, ఎవర్ని గుర్తుపట్టలేకపోవడం వంటి లక్షణాలుంటాయి.

ఇంట్రాక్రేనియల్ టెన్షన్ పెరగడం వల్ల కలిగే లక్షణాలు

స్పృహకోల్పోవడం, శ్వాస సరిగా ఆడకపోవడం, విపరీతమైన తలనొప్పి, కంటిపాప వెలుతురుకు స్పందించకపోవడం, కనుగుడ్లు అసంకల్పితంగా అటుఇటు కదలడం, వాంతులు విపరీతంగా ఉండడం, నాడీ, శ్వాస ఒక క్రమపద్ధతిలో ఉండకపోవడం మెదడులోపల, బైట ఒత్తిడి పెరగడం వంటి లక్షణాలుంటాయి.

మెనింజియల్ ఇరిటేషన్ వల్ల కలిగే లక్షణాలు: మెడ ప్రాంతం గట్టిగా, బిగుసుకొని ఉంటుంది. కదలికలుండవు. దీన్నే 'నెక్ రిజిడిటీ' అంటారు. కాలును నడుం దగ్గర వంచినపుడు మోకాలు ఒక పరిమితికి మించి ముడుచుకోకపోవడం. దీన్నే 'కెర్నింగ్స్ సైన్' అంటారు.

కాంప్లికేషన్స్: బల్బార్‌పాల్సీ, రెస్పిరేటరీ పారాలసిస్, చెవుడు, డీహైడ్రేషన్, అంధ్యత్వం, అవయవాలు చచ్చుపడడం, పక్షవాతం, మెదడు నరాల లోపాలు, బిహేవియర చేంజ్స్, బుద్ధిమాంద్యం, పెరిబ్రల్‌పాల్సీ వృషణాల వాపు, కేంద్ర నాడీమండలం, మెదడు దెబ్బతినడం, మరణం, కోమా వంటి కాంప్లికేషన్స్ ఏర్పడతాయి.

జాగ్రత్తలు-చికిత్స: ఒక్కసారిగా అనేకమంది పిల్లలు వ్యాధికి గురికావడం. పెద్దల్లో ఈ వ్యాధి కన్పించకపోవడం. జ్వరతీవ్రత ఎక్కువగా ఉండి సడన్‌గా సంధి, మగతలోకి జారుకోవడం, డీహైడ్రేషన్, ఒక ప్రాంతంలోని వ్యాధి నిరోధక శక్తి తక్కువగా వున్న పిల్లల్లో జ్వరాలు రావడం జరిగితే బ్రెయిన్ ఫీవర్‌గా గుర్తించాలి.

☛ వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. రక్తంలో ఐజిఎం ఆంటిబాడీస్ వుంటాయి. ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించాల్సి వుంటుంది. వెన్నెముక నుంచి ద్రవం తీసి పరీక్షించాలి. దీన్నే లంబార్ పంక్చర్ అంటారు. దీనివల్ల ఇంట్రాకేనియల్ ప్రెషర్ తగ్గుతుంది.

☛ జెఇ వైరస్‌ను నాశనం చేసే మందులు లేవు. ఆంటిబయాటిక్స్, పారసిటమాల్ మందులు పనిచేయవు. ఆంటివైరల్ మందుల్ని డాక్టర్ల పర్యవేక్షణ లో మందుల్ని వాడాల్సి వుంటుంది.

☛ బ్రెయిన్ ఫీవర్‌కి వాక్సిన్స్ ఉన్నాయి. కాని మనం ఇప్పుడు ఇస్తున్న వాక్సిన్ టైప్ స్పెసిఫిక్ అంటే ఒక రకమైన వైరస్ నుంచి మాత్రమే రక్షణ కల్పిస్తుంది. దీనిలో అనేక రకాల సబ్‌టైప్స్ ఉన్నాయి. వాటి నుంచి రక్షణ లేదు. ఈ వ్యాధి సోకకుండా పిల్లలకి రక్షణ కల్పించాలంటే 50 రకాల వాక్సిన్స్ ఇవ్వాలి. ఏ ప్రాంతంలో ఏ వైరస్ వస్తుందో గమనించి ఆ వైరస్ సోకకుండా వాక్సిన్లు ఇవ్వాల్సి వస్తుంది. ఇది సాధ్యం కాదు. వాక్సిన్ కాలపరిమితి కూడా ఆరేడు నెలల దాకా వుంటుంది. దీనివల్ల సైడ్‌ఎఫెక్ట్స్ వచ్చే అవకాశముంది.



☛ **వ్యాధి రాకుండా..:** ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. పందుల్ని జనవాసాలకు దూరంగా ఉంచాలి. పందుల్ని పెంచేవారు జెఇవైరస్ ఉన్నవాటిని చంపివేయడం మంచిది. దోమలు కుట్టకుండా చూచుకోవాలి. డ్రైనేజ్ నీరు, అపరిశుభ్ర ప్రాంతాలు, నీటికుంటల్లో దోమలు, లార్వాలు పెరగకుండా మలాథియన్ స్ప్రే చేయాలి.

☛ హోమియోలో బ్రెయిన్ ఫీవర్‌కి వ్యాధినిరోధక మందులు అందుబాటులో ఉన్నాయి. బెలడోనా 200 ఉదయం పూట మాత్రమే 4-5 మాత్రలు చొప్పున వరుసగా మూడురోజులు చప్పరించాలి.

☛ కాల్కేరియా కార్బ్ 200 ఉదయం పూట 4-5 మాత్రలు ఒక రోజు 10వ రోజు చప్పరించాలి.

☛ ట్యూబర్ క్యులినమ్ ఉదయం పూట 4-5 మాత్రలు ఒక రోజు 21వ రోజు చప్పరించాలి. వీటి కాలవ్యవధి ఒక సంవత్సరం వరకు ఉంటుంది.

☛ పిల్లల్లో తీవ్రమైన జ్వరం రాగానే వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకొని వెళ్లి బ్రెయిన్ ఫీవర్ అవునా కదా అని నిర్ధారించుకొని సకాలంలో చికిత్స అందించగలిగితే నూటికి 60 మంది రికవరీ అవుతారు.

35 శాతం మందిలో కాంప్లికేషన్స్ ఏర్పడితే మిగిలిన 5శాతం మంది పిల్లలు చనిపోవడం జరుగుతుంది. ❒

జీడిపప్పు పనీర్

కావలసినవి

పనీర్-పావుకిలో, కొబ్బరికాయ-అరకిలో
జీడిపప్పు-50గ్రా, గసగసాలు-15గ్రా
వెల్లుల్లి-15గ్రా, టమాటాలు-పావుకిలో
ఉల్లిపాయలు-పావుకిలో, నూనె-50గ్రా,
కిస్‌మిస్-15గ్రా, జీడిపప్పు-15గ్రా
పచ్చిమిరపకాయలు-15గ్రా, కొత్తిమీర-అరకట్ట, క్రీమ్-30గ్రా,
గరంమసాలా-ఒక టీస్పూన్

తయారుచేసే విధానం

గసగసాలు, కొబ్బరి, జీడిపప్పు కలిపి మెత్తని ముద్దగా నూరుకోండి. ఉల్లిపాయలను సన్నగా తరిగి కళాయిలో కొంచెం నూనెపోసి ఎర్రగా వేయించండి. అందులో అల్లం వెల్లుల్లి ముద్దను వేసి మరో 5నిమిషాలు వేయించండి. నూరుకున్న కొబ్బరి గసగసాలు ముద్దను అందులో వేసి మరో 5నిమిషాలు వేయించండి. తరిగిన టమాటాలు పచ్చిమిరపముక్కలు వేసి కొంచెం క్రీమ్‌ను ఉడుకుతున్న మిశ్రమానికి చేర్చి కలిపి, రెండునిమిషాలు ఉంచి, దించి సెర్వ్‌క్‌డిష్‌లోకి ఈ మిశ్రమానికి మార్చుకోండి. గరం మసాలా చల్లి జీడిపప్పు, కిస్‌మిస్‌లు, తరిగిన కొత్తిమీరతో అలంకరించి వేడిగా వడ్డించండి. ❒



నిమిత్తమాత్రం భవ!

ఆధ్యాత్మికం

కొబ్బరి చెట్టు ఎక్కేవాడు చెట్టుకు నమస్కరించి ఎక్కుతాడు. అంటే, ఎక్కే శక్తి తనకు లేక కాదు. పైకి పోయినవాడు కాలు జారి క్రిందపడే అవకాశాన్ని కొట్టిపారేయలేక. అంతేకాదు. చెట్టు నెక్కే శక్తి తనకు ఉన్నా, ఆ శక్తి వాస్తవానికి పరమాత్మదే అనే సత్యం గుర్తించటం వలన.

డ్రైవరు స్టీరింగు పట్టుకునే ముందు రెండు చేతులు జోడిస్తాడు. నదికి నమస్కరించి ఈతగాడు నదిలో దూకుతాడు. బావిలో పడిన పాత్రను తీయటానికి బావిలో దిగేవాడు ముందుగా బావికి నమస్కరిస్తాడు. వంట చేసే ముందు తల్లులు పొయ్యికి నమస్కరిస్తారు.

తనకు నైపుణ్యమున్నా ప్రమాదాన్ని డ్రైవరు మనసు నుండి తీసివేయలేడు. తనకు ఈత తెలిసినా తెలియని సుడులుంటాయనే సత్యాన్ని ఈతగాడు విస్మరించలేడు. పాత్ర కొరకే బావిలో దిగుతున్నా, పాములుంటాయేమో అనే సంశయాన్ని దిగేవాడు తొలగించుకోలేడు. వంట అనేది మంటతో కూడుకున్న పని. చేయి కాలుతుందేమో; గ్యాసు లీక్ అవుతుందేమో-ఏమో! జీవితంలో ఎప్పుడు ఏది జరుగుతుందో ఎవరికి తెలుసు? అందుకే,

నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్

"అర్జునా! నీవు నిమిత్తమాత్రంగా ఉండు" అన్నాడు గీతలో శ్రీకృష్ణుడు.

నిమిత్తమాత్రంగా ఉండు అంటే, అహంకారం లేకుండా ఉండమని అర్థం. ఇది కేవలం అర్జునునికి చేసిన ఉపదేశం కాదు. మనందరికీ ఉపకరించే సందేశము. సమరంలో అర్జునుడు నిమిత్తమాత్రుడు. సంసారంలో అందరూ నిమిత్తంగా ఉండాలని పరమాత్మ అభిప్రాయము. సన్యాసంలో అయితే మరీను.

మనం నిమిత్తం కాగలిగితే సర్వానికి పరమేశ్వరుడే సమాయత్తమవుతాడు.

నీకు ఎంత శక్తి ఉన్నా, పరమాత్మ అనుగ్రహం లేకుండా నిన్ను నీవు రక్షించుకోలేవు. అశక్తులైనవారు కూడా పరమాత్మ కృపను పొంది శోభిస్తూ ఉండటం చూస్తూనే ఉన్నాం.

మనం భక్తులమైతే మన వద్ద భక్తే ఉంటుంది. నిమిత్త మాత్రులం కాగలిగితే మన కార్యాలలో నారాయణుని పాదముద్రలే కదులుతూ ఉంటాయి.

పరమాత్మను విస్మరిస్తే మనలో అహంకారమే ఉంటుంది.

భగవంతుని కార్యంలో నిమిత్తంగా చరించే భాగ్యం అందరికీ రాదు. భక్తి చేస్తేనే భక్తి కలుగుతుంది. మరేదో చేస్తే మరేదైనా రావచ్చు. చేసేది భక్తి కాకపోతే వచ్చేది ముక్తి కాలేదు.

భక్తిని భారంగా కాకుండా బలంగా చేయాలి. పాలకడలిని చిలికి అమృతాన్ని వెలికి తీసినట్లు, బ్రతుకును చిలికి భక్త్యామృతాన్ని సాధించాలి. మరి, విషం పుడితేనో! పుట్టనివ్వండి. మింగేందుకు మహేశ్వరుడు మనతోనే ఉన్నాడు. ప్రతిబంధకాలన్నీ పరమాత్మ కృపతో పలచబడిపోతాయి.

భక్తి పవిత్రము. భక్తి సాధన పవిత్రము. భక్తిలో అహంకారం చేరితే భక్తి మలినపడుతుంది. అపవిత్రమవుతుంది.

అహంకారిలో ఉండేది భక్తి కాదని చెప్పలేము. అది భక్తే కావచ్చు. కాని, ముక్తికి ఉపకరించదు. పాలు పవిత్రమైన ఆహారము. విషం కలిస్తే? అప్పుడు కూడా అవి పాలే. కానీ, పానయోగ్యం కావు. విషం కలిసిన పాలలాగా అహంకారం కలిసిన భక్తి నిష్ప్రయోజనం.

న వైరాగ్యా త్పరం భాగ్యం
న బోధా త్వరమం సుఖం

వైరాగ్యానికి మించిన భాగ్యము లేదు. జ్ఞానాన్ని మించిన సుఖం లేదు. వైరాగ్యముంటే భక్తి, భక్తి ఉంటే జ్ఞానము ఒకదానినొకటి అంటిపెట్టుకొని వస్తాయి. అందుకనే శ్రీ ఆదిశంకరాచార్య స్వామి

జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం
భిక్షాం దేహి చ పార్వతి

'అమ్మా! జ్ఞాన వైరాగ్యముల కొరకు భిక్షమడుగుతున్నాను' అన్నారు అన్నపూర్ణాష్టకంలో.

పరమాత్మ ముందు జ్ఞానులే భిక్షగాళ్ళు నిలబడ్డారు. రెండు చేతుల్తో సమానంగా శరప్రయోగం చేయగల వీరుడైన అర్జునుని (సవ్యసాచి) నిమిత్తంగా ఉండమన్నాడు శ్రీకృష్ణుడు. ఇక మనమేపాటివారము? పెంచుకొంటే తోక పెరుగుతుంది. తెగిన రోజు బాధనంతా మనమే భరించాలి.

రాలేందుకు బ్రతుకు రాలేదు. కాని రాలిపోవటమనేది కాయానికి తప్పదు. లేచిపోయేందుకే ప్రాణాలున్నాయి. రాలిపోయేందుకే దేహాలున్నాయి.

తెలియక, తెలివిలేక జీవితంలో కొంతకాలం వృధా అవుతుంది. తెలిసిన తరువాత, తగిలించుకున్న బంధాలను తొలగించుకోలేక బ్రతుకు అనుక్షణం అలమటిస్తూ ఉంటుంది.

ఎవరి కొరకు ఎవరూ లేరనే సత్యం ఏనాడైనా వంటబట్టవలసిందే. ఆ రోజేదో, ఈ రోజైతే ఈ క్షణం నుండే స్వేచ్ఛాగాలులు పీల్చుకోవచ్చు. పరిస్థితుల్ని చక్కబరచగలమేమో గాని ప్రారబ్ధాలను సరిచేయలేము.

జరిగేవి జరిగిపోనీ! నిమిత్తమాత్రం భవ!

- స్వామి సుందర చైతన్యానంద

వారఫలం

మేషం: గృహసౌఖ్యం, వాహనయోగం, ఆరోగ్యం. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. తగాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండడం మంచిది. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

వృషభం: జాయింటు సమస్యలు, వృత్తియందు ధనలాభం. శత్రుబాధలు వెంటాడుతాయి. ద్రవ్యనాశనం. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు. నూతన కార్యకలాపాలకు శ్రీకారం చుడతారు.

మిథునం: భోజన సౌఖ్యం, విశేష ఆరోగ్యం, ప్రమోషన్స్. రుణాలు తీరుస్తారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది. పూర్వపు మిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. వస్తులాభాలు, వాహన సౌఖ్యం పొందుతారు.

కర్కాటకం: కార్యసాధన, సామాన్య ధనలాభం, సుఖం. చర్చలు చేస్తారు. స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు. బంధువుల నుండి శుభవార్తలు వింటారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

సింహం: శారీరక బాధ, ఉద్యోగ వృత్తిలో రుణబాధలు. శుభకార్యానుకూలం. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. మిత్రులతో ఏర్పడిన విరోధాలు పరిష్కారమవుతాయి.

కన్య: ఆపదలు, సంతాన విషయ చర్చలు, సమస్యలు. అనుకోని ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

తుల: ఆరోగ్య లోపం, దూరదేశ ప్రయాణాలు చేస్తారు. వాహనయోగం పొందుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ధనలాభం పొందుతారు.

వృశ్చికం: సంతానాది సుఖములు, వ్యాపారంలో లాభాలు. దూరప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

ధనుస్సు: ఉత్సాహం, దూరదేశ ప్రయాణాలు చేస్తారు. ఆకస్మిక సంఘటనలకు అవకాశం. కుటుంబ సభ్యుల సలహాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. దైవధ్యానం మనోబలాన్ని పెంచుతుంది.

మకరం: శారీరక మానసిక బాధలు, సంతోషాలు, ప్రమోషన్స్. రాజభయాలు ఉంటాయి. వాహన యోగం పొందుతారు. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుంది.

కుంభం: వృత్తియందు లాభాలు, అధికార సందర్శనాలు చేస్తారు. స్థానచలనం, వ్యతిరేకతలకు అవకాశం. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

మీనం: కొన్ని నూతన ప్రణాళికలు తయారు చేస్తారు. పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. వాహనయోగం పొందుతారు.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్



మెగాస్టార్‌కు గురువుగా!



మెగాస్టార్ చిరంజీవి 151వ సినిమా, స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను చేయనుండటం ఒక విశేషయమైతే అందులో జాతీయస్థాయి నటుడు, బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ నటిస్తుండటం మరో విశేషం.. అమితాబ్ చేరికతో ఈ భారీ చిత్రం నేషనల్ లెవల్‌లో గుర్తింపు పొందుతోంది.. ఇకపోతే ఈచిత్రంలో అమితాబ్ ఏపాత్ర చేయబోతునా ్నరనే ప్రశ్న కూడ గత కొన్ని రోజులుగా అభిమానుల్లో , ప్రేక్షకుల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతూ వస్తోంది. సినీ వర్గాల్లో వినబడుతున్న కథనం ప్రకారం అమితాబ్ చిరంజీవికి గురువుగా నటిస్తారట.. అంటే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితంలో, తిరుగుబాటులో ప్రధానపాత్ర పోషించిన గురువుగా వ్యవహరించిన గోసాయి వెంకన్నపాత్రను అమితాబ్ చేయనున్నారని తెలుస్తోది.. అయితే ఈ సమాచారంతో ఎంతమేరకు నిజం ఉందన్న విషయం తెలియాలంటే మెగాక్యాంప్ నుంచి పూర్తి క్లారిటీ వచ్చేదాకా ఆగాల్సిందే మరి. రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహించనున్నారు.

అభిమానులకు బర్త్‌డే గిఫ్ట్



అక్కినేని నాగార్జున తాజా చిత్రం రాజుగారి గది 2కు సంబంధించిన ప్రచార హడావుడి మొదలైపోయింది.. త్వరలోనే మోషన్ పోస్టర్ లాంచ్ చేయబోతున్నట్టు కూడ ప్రకటించారు.. ఇందో మూడు రోజుల్లో అంటే ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు నాడు రాజుగారి గది 2 ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ లాంచ్ చేయబోతున్నారు.. ఇంకో నెలన్నరలోనే ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇక ప్రమోషన్ మొదలుపెట్టి జనాల్లోకి సినిమాను తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని టీం భావిస్తోంది. దీపావళి కానుకగా అక్టోబర్ 13న ఈచిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించారు.. డైరెక్టర్ ఓంకార్ దర్శకత్వంలో రూపొందతున్న ఈచిత్రంలో రాజుగారి గదిలో నటించని ఓంకార్ తమ్ముడు అశ్విన్‌కూడ ఓ కీలకపాత్ర చేస్తున్నాడు.. అదేవిధంగా సమంత, సీరత్‌కపూర్ ముఖ్యపాత్రలు చేస్తున్నారు.. పివిపి సినిమాస్ ఈచిత్రాన్ని నిర్మిస్తోంది.. నాగార్జున ఇందులో మోడర్న్ మాంత్రికుడి పాత్రలో నటిస్తున్నట్టు సమాచారం.. అయన గెటప్ కొత్తగా ఉంటుందని అంటున్నారు..

ప్రేమను సంతోషంగా పంచండి



హిందీ సీరియల్స్‌లో తెగ కన్పించేసే అందగత్తె కరిష్మా శర్మ. సీరియల్స్‌లో హీరోయిన్ అయినా. సినిమా హీరోయిన్‌కు ఏమాత్రం తగ్గనిస్థాయిలో ఈమె క్రేజ్ ఉంటుంది.. గ్లామర్ విషయంలో ఎప్పటికపుడు అప్‌డేటెడ్‌గా ఉండే కరిష్మాశర్మకు కెమెరా ముందు అందాలు ఆరబోయడంలో పెద్దగా అభ్యంతరాలు ఉండవు అయితే.. బుల్లితెరపూ ఈమె చేసే రోల్స్ కాసింత సాంప్రదాయ బద్ధంగానే ఉంటాయి.. అందుకే తన అల్ట్రా మోడర్న్ అవతార్‌ను చూపించేందుకు సోషల్ మీడియాను బాగానే ఉపయోగించుకుంటుంది.ఫొటో షూట్స్‌తో తెగ మత్తెక్కించేసే కరిష్మా శర్మ-లేటెస్ట్‌గా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో షేర్ చేసిన పిక్ ఒకటి ..చూపరుల మత్తి పోగొట్టేస్తోంది.. ఎపుడూ గమ్యం ఏంటనేది ముఖ్యంకాదు.. ప్రయాణం ఎలా ఉంది..దాన్ని ఎంతగా ఎంజాయ్ చేశామన్నదే ముఖ్యం.. ప్రేమను.. సంతోషాన్ని పంచండి.. అంటూ చెప్పుకొచ్చిన కరిష్మా శర్మ.. లవ్ ఫెయిల్యూర్స్‌పై తనదైన స్టైల్‌లో ఇలా రియాక్ట్ అయ్యిందని అంటున్నారు.

అమ్మడుకు మీడియా కష్టాలు

బాలీవుడ్‌బ్యూటీ రాధికా ఆప్టే అంటే బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ అనే సంగతి ఎవరైనా ఒప్పుకోవాల్సిందే ..ఎవరో చెప్పాల్సిన పనిచేలేదు.. ఈ విషయాన్ని స్వయంగా తనే చెప్పేయగల తెగువ ఆమెకు ఉంది.. కెరీర్ మొదట్లో తెలుగులో కూడ నటించింది.. రక్తచరిత్ర. లెజెండ్ ., ధోనీ వంటి సినిమాలోల మెరిసిన రాధికా ఆప్టే.. ఆ తర్వాత ఓ సమయంలో టాలీవుడ్‌పై వివాదాస్పద వ్యాఖ్యలుచేసింది.. అయితే ఈమెకు ఇపుడు మీడియా కష్టాలు వయ్యాయట.. ఛానెల్స్ ఎక్కువైపోయి ఏదో ఒక వివాదాన్నే పట్టుకుని పాకులాడ్డం.. ఒక్క క్లిక్ కోసం వెంటబడే ఫొటోగ్రాఫర్స్ నుంచి తప్పించుకునేందుకు పాట్లు, హీరోయిన్స్‌కు ఇప్పటికే అలవాటు అయిపోయాయి.. అయితే ఇపుడు వచ్చిన కష్టం సోషల్ మీడియాతో ..కొంతకాలం క్రితం తమె ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అవ్వగా.. ఎలాగోలా కష్టపడి మళ్లీ తన స్వాధీనం చేసుకుంది.. ఇపుడు మళ్లీ తన ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యిందని చెబుతోంది.. .. ' నా ఫేస్‌బుక్ అకౌంట్ మరసారి హ్యాకింగ్‌కు గురైంది.. దయచేసి ఎవరూ మెసెంజర్‌లో నాకు మెసేజ్‌లు చేయవద్దు.. థ్యాంక్యూ' అంటూ ట్వీట్ చేసింది..

వలపుల చూపులు



మహేష్‌బాబు మురుగదాస్ దర్శకత్వంలో స్పైడర్ మూవీ షూటింగ్ పార్ట్ పూర్తయిపోయిన సంగతి తెలిసిందే.. సెప్టెంబర్ 27న ఈచిత్రం థియేటర్లలోకి రానుండగా, దేశవ్యాప్తంగా పలు భాషల్లో భారీ స్థాయిలో ఈచిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.. అలాగే ఈసినిమాతో తమిళ మార్కెట్‌లో కూడ మహేష్‌పాగా వేస్తారని అంచనాలు ఉన్నాయి. మరో నెలరోజుల్లో మహేష్ స్పైడర్ రిలీజ్ కానుండగా, ఇంకా ఈ చిత్రానికి ఆడియో ఫం క్షన్ నిర్వహించలేదు.. అసలు ఫస్ట్‌లుక్ నుంచి టైటిల్ వరకూ అన్నీ లేటుగానే జరుగుతుండగా, ఇపుడు రిలీజ్ దగ్గరపడటంతో ప్రమోషన్స్‌పై దృష్టిపెట్టింది టీం.. సూపర్‌స్టార్‌తో తొలిసారిగా రకుల్‌ప్రీత్ సింగ్ జోడీ కట్టగా, ఇద్దరూ కలిసి ఓ పాటకు డ్యాన్స్ చేస్తున్న లుక్‌ను రిలీజ్ చేశారు.. ఫుల్‌సూట్‌లో మహేష్ కన్పిస్తుండగా, స్లీవ్‌లెస్ వైట్ టాప్‌లో రకుల్ అందాల కుమ్మరి స్తోంది..మురుగదాస్, మహేష్ కాంబో రేంజ్‌కు తగినట్టుగా బాగా రిచ్‌గా లావిష్‌గా రూపొందించారు..



ప్రొటెక్టివ్‌గా అన్పిస్తుంది

నందమూరి బాలయ్య 101వ చిత్రం 'పైసా వసూల్' సెప్టెంబర్ 1న రిలీజ కానున్న సంగతి తెలిసిందే.. ఈచిత్రంలో బాలయ్య సరసన శ్రియశరణ్ హీరోయిన్‌గా నటించింది.. వీరిద్దరూ కలిసి నటించటం ఇది మూడోసారి.. బాలయ్యతో ఎన్ని సినిమా చేసినా కొత్తగానే ఉంటుందన్న శ్రియ.. ఆయన పక్కనుంటే చాలా ప్రొటెక్టివ్‌గా ఉంటుందని పెద్ద కాంప్లిమెంట్ కూడ ఇచ్చిందీ భామ. .ఆయనతో మొదటిసినిమా చెన్నకేశవరెడ్డి చేసేప్పుడు తనుకు ఏమీ తెలీదని, అంతా బాలకృష్ణగారు, దర్శకుడు వివి వినాయక్ చూసుకున్నారని, ఆ రోజుల్ని అంత సులభంగా మర్చిపోలేనని, ఇప్పటికీ ఆయన పక్కనుంటే చాలా ప్రొటెక్టివ్‌గా అన్పిస్తుందని ఆమె పేర్కొంది.. ఆ తర్వాత గౌతమిపుత్ర శాతకర్ణి చేసేటపుడు కూడ చాలా సపోర్ట్ ఇచ్చారని, తన జీవితంలో వాశిష్టి పాత్రే క్లిష్టమైందని, పైసావసూల్‌లో కూడ తన జంటగా ఫ్రెష్‌గానే ఉంటుందని చెప్పుకొచ్చారు.



రొమాంటిక్ మూవీ

నాని హీరోగా గత ఏడాది రిలీజ్ అయిన మజ్ను మూవీలో నటించింది ప్రియశ్రీ.. తన అందంతోపాటు అభినయం తోనూ ఆడియన్స్‌ను ఆకట్టుకున్న ప్రియశ్రీ. అక్కడి నుంచి దాదాపు ఏడాది గడిచినా కొత్త సినిమాను అంగీకరించలేదు.. అరంగేట్రంలోనే సక్సెస్ అందుకున్న ఈ భామకు అవకాశాలకు కొదువేమీ లేదు.. కానీ ఈ బ్యూటీ స్క్రిప్ట్ సెలక్షన్‌లో బాగా ఆచితూచి వ్యవహరి స్తుందనే టాక్ ఉంది. మోడల్‌గా కూడ వెలుగులు విరజిమ్ముతున్న ఈ ముంబై భామ ఇపుడు తెలుగు సినిమాకు సైన్ చేసింది.. శోభన్ హీరోగా రూపొందు తున్న ఓ సినిమాలో నటించనుందట.. పేపర్‌బోయ్ అనే టైటిల్‌పై రూపొందుతున్న ఈ మూవీ రొమాంటిక డ్రామాగా తెరకెక్కనుండగా, ఇందులో కాలేజ్ అమ్మాయిగా కన్పించనుంది ప్రియశ్రీ. ధన వంతుల కుటుంబం నుంచి వచ్చిన ఓ కాలేజ్‌గాళ్ గా కన్పించనుంది.. ఆమె పాత్రలో పలు ఆసక్తికరమైన కోణాలు ఉంటాయని చెబుతున్నారు.

ఫ్యామిలీతో బన్నీ








స్టైలిష్‌స్టార్.. అల్లు అర్జున్ కొన్నేళ్లుగా ఏడాదికో మూవీ మాత్రమే అన్నట్టుగా ఉంటునానరు.. సరిగ్గా పరిశీలిస్తే.. ఈమార్పు అంతా అల్లు అర్జున్ పెళ్లి తర్వాత.. ముఖ్యంగా పిల్లలు పుట్టినప్పటి నుంచి అనే విషయం అర్థమవుతుంది.. పెళ్లయిన తర్వాత ఫ్యామిలీకి టైం కేటాయించటంలో అల్లు అర్జున్ ఏమాత్రం తటపటాయించటం లేదు.. అలాగని తన కుటుంబ విశేషాలను తనే దాచుకోవటం లేదు కూడ. ఎప్పటికపుడు అభిమానులకు చూడచక్కని ఫొటోలను అందిస్తూ అలరిస్తున్నారు.. ఇపుడ బన్నీ తన ఫ్యామిలీతోపాటు రకరకాల వయసుల్లో ఉన్న ఫొటో ఒకటి నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.. మొత్తం మూడు ఫొటోలను కలిపి ఈ పోస్టర్‌ను తయారుచేశారు.. ఇందులో మొదటి ఫొటోలో అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డి మాత్రమే ఒక స్కూటర్‌పై ఉంటే. వెనకాల బన్నీ గాల్లో ఎగురుతూ ఇచ్చిన ఫోజ్ ఉంటుంది.. రెండో ఫొటోకు వచ్చేసరికి.. స్నేహ చేతుల్లోకి కొడుకు ఆయాన్ వచ్చి చేరతాడు.. కానీ అల్లు అర్జున్ ఫోజ్‌మాత్రం సేమ్‌టు సేమ్ టుంటుంది.. మూడో ఫొటోలో అల్లు అర్జున్, స్నేహ, అయాన్‌లతోపాటు అల్లు అర్హా కూడ కన్పిస్తుంది.. ఇక్కడ కూడ బన్నీ గాల్లోకి ఎగురుతూనే ఉంటాడు బన్నీ.. ఆ స్కూటల్ మాత్రం సేమ్ టు సేమ్ కన్పిస్తాయి.. ఇదే సమయంలో వెనుక ఉన్న చెట్టు ఎంత గుబురుగా ఎదిగిందో కూడ గమనించవచ్చు..

అఖిల్ భామకు గోల్డెన్ చాన్స్

అక్కినేని అఖిల్ తొలిచిత్రం 'అఖిల్'తో వెండితెరకు పరిచ యమైన హీరోయిన్ సాయేషా సైగల్ ఆసినిమా తర్వాత తెలుగు పరిశ్రమ నుంచి కోలీవుడ్‌కు వెళ్లి అక్కడ జయం రవిచిత్రం వనమాగన్‌తో ఎంట్రీ ఇచ్చి తమిళ ప్రేక్షకుల మనసు దోచుకుంది.. దీంతో వరుస అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వస్తున్నాయి.. ఈ మధ్యే ప్రభుదేవా డైరెక్షన్‌లోనే విశాల్, కార్తీ నటిస్తున్న ఒక చిత్రానికి సైన్ చేసిన ఆమె తాజాగా మరో గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. ప్రస్తుత తమిళ స్టార్ హీరోల్లో మంచి ఫామ్‌లో ఉన్న నటుడు విజయ్ సేతపతి, ఇటీవలే విక్రమ్ వేద తో మంచి విజయాన్ని అందుకున్న సేతుపతి త్వరలో చిరంజీవి 151 సినిమా సైరా నరసింహారెడ్డిలో నటించనున్నారు. అలాగే దర్శకుడు గోకుల్ డైరెక్షన్‌లో జుంగా అనే సినిమాను కూడ స్టార్ట్‌చేయ నున్నారు.. ఈసినిమాలోనే సాయేషా ప్రధాన హీరోయిన్‌గా కుదిరింది.. ఈ ప్రాజెక్టు ఆమె ఎదుగుదలకు బాగా దోహదపడుతుందనటంలో ఏమాత్రం సందేహం లేదంటున్నారు.



మామిడి, దానిమ్మ దిగుమతులకు కెనడా ఓకే!


బెంగళూరు, ఆగస్టు 27: కెనడా ప్రభుత్వం ఎట్టకేలకు భారత్ దెందిన పండ్లు కూరగాయలను అనుమతించింది.అరటి, మామిడి, దానిమ్మ, బెండి వంటి కూరగాయలను అనుమతించింది. అపెడా ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదింపులు ఎగుమతి దారులకు తీసుకోవలసిన జాగ్రత్తలతో కెనడా సానుకూలంగా తననిర్ణయాన్ని ప్రకటించింది. భారతీయ కూరగాయలు, పండ్లు వంటి వాటిని ఉత్తర అమెరికా మార్కెట్లకుసైతం ఎగుమతిచేసుకునే వీలు కలుగుతోంది. ఫైటో శానిటరీ దిగుమతి ప్రూవేటీ వంటి వాటికి కొంతలోనవుతాయి. కెనడా ఆహార ఉత్పత్తుల తనిఖీ ఏజెన్సీగా ఉన్న ఈ సంస్థ దిగుమతులను పరిశీలించినతర్వాత మార్కెట్లకు విడుదలచేస్తుంది. కెనడాకు తగ్గుతున్న ఎగుమతులను మరింత పెంచేందుకు ఈ నిర్ణయం దోహదంచేసింది. 2016-17లో రూ.838 కోట్లకు ఎగుమతులు తగ్గాయి. 2014-15లో 1046 కోట్లు ఉన్న ఎగుమతులు ఏటికేటికి తగ్గుతున్నాయి. తాజా కూరగాయల ఎగుమతులు కెనడాకు రూ.36 కోట్లుగా ఉన్నాయి. తాజా పండ్ల ఎగుమతులు పెరుగుతాయని అంచనా. 2016-17 ఆర్థిక సంవత్సరంలో పండ్ల ఎగుమతులు ద్రాక్షవంటివి రూ.13.7 కోట్లకు పెరిగాయి. అపెడా ఛైర్మన్ డికెసింగ్ మాట్లాడుతూ భారతీయ మామిడి, దానిమ్మలకు కెనడా మార్కెట్ కీలకమని వెల్లడించారు. ఇప్పటికే అమెరికాకు భారత్ ఎగుమతులుచేస్తోంది. సమీపంలోని కెనడా మార్కెట్లకు సైతం తరలిస్తుందని అన్నారు. కెనడా కీలకమైన మార్కెట్ అయినప్పటికీ రవాణా పరంగా ఎక్కువ దూరం కావడం వల్ల రవాణా ఛార్జీలు ఎక్కువవుతున్నాయి. వాయురవాణా ఛార్జీలు ఎక్కువ భరించాల్సి వస్తోందని సింగ్ వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం జలరవాణాను ప్రోత్సహిస్తోందని, రెండు దేశాలమధ్య జలరవాణాను పెంపొందించే ఆర్ఈండి కేంద్రాలను కూడా రెండువైపులా ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. భారత్ వ్యవసాయశుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులు ఏడాదాంతపెరిగి ఏప్రిల్,జూన్ త్రైమాసికంలో రూ.28,320 కోట్లకు పెరిగాయి. గతంలో కొంతకాలంపాటు యూరోపియన్ దేశాలకు భారత్ ఉత్పత్తులను నిషేధించిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి సంప్రదింపులు జరుపుతూ వస్తున్న భారత్‌కు సానుకూల అంశాలు కనిపించాయి. ఎట్టకేలకు కెనడా ప్రభుత్వం భారతీయ ఆహారం, పండ్ల ఉత్పత్తులను తమతమ మార్కెట్లలో విక్రయించుకునే అవకాశాలు కల్పించింది.ఇప్పటికీ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు అనుగుణంగా కొన్ని దేశాలతో పలు అగ్రరాజ్యాల్లోకొన్ని కొన్ని భారతీయ ఉత్పత్తులపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే.ప్రధానిమోడీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచివిదేశాలకు భారత్ ఎగుమతులు ఊపందుకున్నాయి. చేసుకున్న ఒప్పందాలు భారత్‌ను ఎగుమతులకు మరింతగా ప్రోత్సహిస్తున్నాయి. అయితే నిబంధనల్లో కొన్ని సడలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎగుమతిదారులు పేర్కొంటున్నారు.

జిడిపి గణాంకాలే మార్కెట్లకు కీలకం!

ఈ వారం మంత్రాంగం



ముంబయి, ఆగస్టు 27: దేశీయ స్టాక్ మార్కెట్లకు వచ్చేవారం ఆర్థిక గణాంకాలు కీలకం అవుతున్నాయి. మరోవైపు ఆగస్టు డెరివేటివ్స్ సిరీస్ గురువారం ముగియనున్నది. ట్రేడర్లు ఆగస్టు పొజిషన్లను సెప్టెంబరు సిరీస్‌కు రోలోవర్‌చేసుకునే వీలున్నదని దీనితో వచ్చే వారం మార్కెట్లు కొంతమేర ఒడిదుడుకులు ఎదుర్కొనవచ్చని విశ్లేషకులు తెలిపారు. ఈ ఏడాది తొలిక్వార్టర్ జిడిపి గణాంకాలు ఎఫ్‌అండ్ఒ ముగింపు అంశాలువచ్చేవారంలో దేశీ స్టాక్ మార్కెట్ల ధోరణులను నిర్దేశించే అవకాశం ఉందని అంచనా. 31వ తేదీ కేంద్రం జిడిపి గణాంకాలు వెలువరిస్తుంది. మార్చితో ముగిసిన గత ఏడాది చివరిత్రైమాసికంలో జిడిపి 6.1శాతం వృద్ధి సాధించింది. గడచిన తొమ్మిది త్రైమాసికాలతో పోలిస్తే ఇది కనిష్టం కాగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 6.6శాతం పురోగతి నమోదుకావచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. వస్తుసేవలపన్ను జిఎస్‌టి అమలు నేపథ్యంలో జిడిపి 6.5శాతం స్థాయిలో పుంజుకునే వీలున్నట్లు ఆర్థికవేత్తల అంచనా. ఇటీవల దేశీయస్టాక్స్‌లో నికర అమ్మకం దారులుగా నిలుస్తున్న విదేశీ పోర్టుఫోలియో ఇన్వె స్టర్ల తీరు ట్రెండ్‌కు కీలకంగా నిలిచింది. ఆగస్టులో ఇప్పటి వరకూ ఎఫ్‌పిఐలు రూ.16వేల కోట్లకుపైగా విలువైన స్టాక్స్ విక్రయించారు. దీనితో ఎఫ్‌పిఐల పెట్టు బడులు సెంటిమెంట్‌ను ప్రభావితంచేస్తాయని నిపుణుల అంచనా. ఇది కాకుండా ముడిచమురు ధరలు డాలరురూపాయి మారకం విలువలు మార్కెట్లపై ప్రభావాన్ని చూపిస్తాయి. శుక్రవారం జాక్సన్ హోల్‌లో అంతర్జాతీయ బ్యాంకర్లమావేశం మొదలైన నేపథ్యంలోప్రపంచ స్థాయిలో వడ్డీరేట్లపై వెలువడే అంచనాలకు ప్రాధాన్యం ఉన్నట్లు నిపుణులు చెపుతున్నారు. అమెరికా ఫెడ్ ఛైర్‌పర్సన్ జన్నెట్ ఎల్లెన్ సహా 40దేశాలకుపైగా కేంద్ర బ్యాంకుల చీఫ్‌లు ఈ సమావేశంలో పాల్గొంటూన్నారు. బుధవారం అమెరికా జిడిపి, వ్యవసాయేతర ఉపాధి గణాంకాలు, పెండింగ్ గృహ విక్రయాల గణాంకాలు వెల్లడి అవుతాయి. వీటి ఆధారంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు నడుస్తాయని నిపుణుల అంచనా.

డిఎల్‌ఎఫ్ సైబర్‌సిటీలో 33.34శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ, ఆగస్టు 27: దేశీయంగా రియల్‌ఎస్టేట్ రంగంలోమరో అతిపెద్ద డీల్‌కు తెరలేచింది. అద్దె ఆదాయాల అనుబంధ సంస్థ డిఎల్ఎఫ్ సైబర్‌సిటీ డెవలపర్స్‌లో 33.34శాతం వాటాను విక్రయించేందుకు రియాల్టీ దిగ్గజం డిఎల్‌ఎఫ్‌బోర్డు శుక్రవారం సాయంత్రం అనుమతించింది దీనితో సింగపూర్ పెట్టుబడులసంస్థ జిఐసికి డిసిసిడిఎల్‌లో 33.34 శాతం వాటాను విక్రయించేందుకుమార్గం ఏర్పడింది. ఈ డీల్‌ద్వారా కంపెనీకి రూ.11,900కోట్లు లభిస్తాయి. దీనితో డిసిసిడిఎల్ విలువ రూ.35,617 కోట్లుగా లెక్కతేలినట్లు కంపెనీ బిఎస్‌ఇకి వివరించింది. ఈ ఏడాది మార్చినెలలోనే డిసిసిడిఎల్‌లో 40శాతం వాటాను జిఐసికి విక్రయించేందుకు డిఎల్‌ఎఫ్ తుదిప్రణాళికలు ఖరారుచేసింది.డీల్ విలువను రూ.13వేల కోట్లుగా అంచనావేసింది. అయితే తాజాగా నిర్వహించిన బోర్డు సమావేశంలోరూ.11,900కోట్లుకు 33.34శాతం వాటాను విక్రయించాలనినిర్ణయించింది. కాగా ఈ డీల్ తర్వాత డిసిసిడిఎల్‌లో మాతృసంస్థ డిఎల్ఎఫ్ 66.66శాతం వాటాను కలిగి ఉంటుంది. నిధుల్లో అత్యధిక భాగాన్ని డిఎల్‌ఎఫ్‌కు ఉన్న రుణభారాన్ని తగ్గించుకునేందుకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనితో సోమవారం ట్రేడింగ్‌లోడిఎల్‌ఎఫ్ కౌంటర్‌కు డిమాండ్‌కనిపిస్తుందని నిపుణుల అంచనా.

'నానో'ను నిలిపివేసే ప్రశ్నేలేదు

టాటామోటార్స్ సిఒఒ సతీష్ బోర్వాంకర్

కోల్‌కతా, ఆగస్టు 27: టాటామోటార్స్ మానస పుత్రికగా తీసుకువచ్చిన నానోకారును నిలిపివేసే ప్రశ్నేలేదని కంపెనీ ప్రకటించింది. నానో భవిష్యత్తుపై టాటామోటార్స్ సిఒఒ సతీస్ బోర్వాంకర్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ప్రణాళికలతో ముందుకువస్తున్నట్లు తెలిపారు. ఈ చిన్నకారుకు విద్యుత్ వెర్షన్ కూడా తెస్తున్నామని, కంపెనీకి నానో ఏమాత్రం లాభదాయకం కానప్పటికీ ఉత్పత్తిని మాత్రం నిలిపివేయమని వాటాదారులు కూడా ఉత్పత్తిని కొనసాగించాలని కోరుతున్నారన్నారు. సింగూర్‌ప్లాంట్‌ను నిలిపివేసిన తర్వాత ఆప్లాంట్‌ను గుజరాత్‌లోని సనంద్‌కు తరలించారు. సుమారు1000కిపైగా నానోకార్లు ప్రతినెలా విక్రయిస్తున్నట్లు తెలిపారు. సనంద్‌ప్లాంట్‌లో నానో, టియాగో, టిగార్ ప్యాసింజర్ వాహనాలను ఉత్పత్తిచేస్తున్నట్లు వివరించారు. టిగోర్, టియాగోతో పోలిస్తే నానోఉత్పత్తి తక్కువేనన్నారు. వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ వాహనాల మార్కెట్ తగ్గుతోందని, ఇందుకుగల కారణాలనుఅన్వేషించి కష్టమర్లకు చేరవయ్యేందుకు కృషిచేస్తున్నామన్నారు. పూణెలోని రంజన్‌గాంవ్ ప్లాంట్‌నుంచి టాటామోటార్స్ కంపాక్ట్ ఎస్‌యువిని విడుదలచేసింది. ఈ కారును దీపావళికి ముందే విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీకి వాణిజ్యవాహనాలు ఉత్పత్తిచేస్తున్న ప్లాంట్లసామర్థ్యం 75శాతంపెరిగిందని, ప్యాసింజర్ వాహనాలయూనిట్లు మాత్రంగరిష్టంగా ఉత్పత్తౌతున్నట్లు వెల్లడించారు.



కంపెనీతొలినాళ్లలో రతన్‌టాటావాహనదారులకుహామీ ఇచ్చినట్లుగా రూ.లక్షకేకారును తయారుచేస్తామని నానోను ఉత్పత్తిచేసి విడుదలసమయంలో స్వయంగా ఆయనే నడుపుకుంటూ వచ్చారు.

రూ.5వేల కోట్ల విదేశీ పెట్టుబడులకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వం ఐదువేల కోట్ల రూపాయల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదించింది. వీటిలో అమెజాన్ రిటైల్ ఇండియా కూడా ఉంది. గణాంకాలను బట్టిచూస్తే బిసిపి అడ్వయిజర్లు, ఆవేయో రియల్ ఎస్టేట్ హోల్డింగ్స్ వంటివాటిని తిరస్కరించినట్లు తేలింది. అమెజాన్‌రిటైల్ భారత్‌లో రూ.3500 కోట్ల పెట్టుబడులనుపెట్టాలని నిర్ణయించింది.భారత్‌లో మొత్తం 100శాతం ఎఫ్‌డిఐతో అనుబంధ కంపెనీని ఏర్పాటు చేస్తోంది, భారత్‌లోనే తయారుచేసిన ఉత్పత్తులు, ఆహార వస్తువులను విక్రయించేందుకు ఈ పెట్టుబడులతో వస్తోంది. ఇందుకోసం అమెజాన్ రూ.3500 కోట్లు పెట్టుబడులు సిద్ధంచేసింది. అలాగే సూపర్‌మార్కెట్లు, కిరాణం సంస్థలు కూడా ప్రాథమికంగా ఫుడ్‌రిటైల్ బిజినెస్‌లో రూ.105 కోట్లు వెచ్చిస్తోంది. ప్రాథమికంగా వచ్చే 18 నెలల్లో రూ.800 నుంచి రూ.1000 కోట్లు పెట్టుబడులు పెడుతుంది. ఇక బ్లూ ఎయిర్ ఇండియా సింగిల్‌బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్‌కు సంబంధించి 100కోట్ల విదేశీ పెట్టుబడులకు గతంలోనే అనుమతులు సాధించింది. క్యాష్ అండ్ క్యారీ హోల్‌సేల్ ట్రేడింగ్‌లో ఎయిర్‌ప్యూరిఫయర్లను విక్రయిస్తోంది. ఇక గృహాలకరణ పరిష్కార సేవలందించే అర్బన్ లేడర్ 15మిలియన్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అందుకున్నది. మరో పది వరకూ దరఖాస్తులను తిరస్కరించడం, లేదా మూసివేయడం, లేదా ఉపసంహరించడం వంటివి జరిగాయి. అంతకుముందు దీపమ్ ఇదేనెలలో వాణిజ్యమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు నివేదిక ఇస్తూ 99కిపైగా విదేశీప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనలు వివిధ మంత్రిత్వశాఖల్లోను, ప్రభుత్వశాఖల్లోను పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 43.47 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తెలిపారు.



సృజన్ కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు



న్యూఢిల్లీ, ఆగస్టు 27: కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ బీహార్‌లోని సృజన్‌కుంభకోణం దర్యాప్తునుచేపట్టింది. ప్రభుత్వ నిధులు సుమారు రూ.1000 కోట్ల వరకూ దుర్వినియోగం అయ్యాయని, ప్రభుత్వేతర సంస్థలకు అంటే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వ నిధులుబదిలీఅయ్యాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మొత్తం ఈ కేసులో పది ఎఫ్ఐఆర్‌లను నమోదుచేసిన సిబిఐ బీహార్ పోలీస్ ఆర్థికనేరాల విభాగం ముందు దర్యాప్తుచేసింది. తర్వాత బీహార్‌ప్రభుత్వం కేసును సిబిఐకు అప్పగించాలని సిఫారసు చేయడంతో సిబిఐ దర్యాప్తు ప్రారంభించింది. నిబంధనలను అనుసరించి సిబిఐ మరోసారి ఎఫ్ఐఆర్‌లను నమోదుచేసింది. అయితే దర్యాప్తుపరంగా ఇప్పటికే ఒక తుదివిడత అభిప్రాయానికి వచ్చిందని, ఒక నివేదికను రూపొందించి ఛార్జిషీటును లేదా కేసు మూసివేత నివేదికను ఇస్తుందని అంచనా. ఈ ఎఫ్ఐఆర్‌లు అన్నీ కూడా సృజన్ మహిళా వికాస్ సమితి డైరెక్టర్ మనోరమా దేవి ఇతర అధికారులు, బ్యాంకు అధికారులపై నమోదయ్యాయి. ఈ ఏజెన్సీ కేంద్రం నుంచి సిఫారసులు తెచ్చుకోవడంతో సిబిఐ దర్యాప్తును చేపట్టింది. అంతేకాకుండా బీహార్‌ప్రభుత్వం నుంచి తగినన్ని ఆధారాలు దస్త్రాలను కూడా సాధించింది. బీహార్ పోలీస్ ఇప్పటికే సృజన్ కార్యదర్శి ప్రియా కుమార్ ఆమె భర్తలపై లుక్ ఔట్ నోటీసులు జారీచేసింది. బీహార్‌లోని భాగల్పూర్‌లో ప్రభుత్వనిధులు ఇంచుమించురూ.950కోట్లు దుర్వినియోగం చేయడంతో కేసులు నమోదుచేసింది. ప్రియాకుమార్ ఎన్‌జిఒ వ్యవస్థాపకురాలు మనోరమాదేవికి కోడలు. మనోరమాదేవి ఈ ఏడాది ప్రారంభంలోనే మృతిచెందారు. ఎన్‌జిఒ అప్పటి నుంచి ప్రియాకుమార్, మనోరమాదేశి కుమారుడు అమిత్‌కుమార్‌ల పర్యవేక్షణలో సాగుతోంది.

జిడిపిలో 2.5%కి విదేశీ పెట్టుబడులు



ముంబయి, ఆగస్టు 27: భారత్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు జిడిపిలో 2.5శాతానికి పెరుగుతాయని అంచనా. వచ్చే ఐదేళ్లలో ఆర్థికవృద్ధి మరింత పెరుగుతుండటం, నిర్మాణాత్మక సంస్కరణలు వస్తుండటంతో విదేశీ పెట్టుబడులు మరింత పెరుగుతాయని అంచనా. భారత్‌కు వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గడచిన దశాబ్దకాలంగా చూస్తే రెట్టింపు అయ్యాయి. 42 బిలియన్ డాలర్లకు చేరాయి. జిడిపిలో 1.9 శాతం వాటాతో ఉన్నాయి. 2014 సాధారణ ఎన్నికల తర్వాత ఎఫ్‌డిఐ నిధుల రాక సగటున 11శాతం వార్షిక వృద్ధితో ఉంది. అయితే గడచిన ఐదేళ్లలో ఆరుశాతం తగ్గాయి. ఇక ముందున్న కాలంలోఎఫ్‌డిఐ నిధులు భారత్‌కరానున్న ఐదేళ్లలో జిడిపిలోనే 2.5శాతానికి సమాననిధులు అందుతాయని చెపుతున్నారు. చైనాతరహాలో ఎఫ్‌డిఐ విధానాలకు చెల్లుచీటి చెప్పినట్లు కాకుండా భారత్ తన వ్యూహాత్మక వైఖరితో విదేశీ ఇన్వెస్టర్ల నుంచి నిధులు రాబడుతోంది. నిరంతర నిర్మాణాత్మక సంస్కరణలతోనే వృద్ధి ఇమిడి ఉంటుందని అంచనా. గడచిన రెండేళ్లకాలంలో భారత్ ఎఫ్‌డిఐ నిధులు మరింతగా పెరిగాయి. ఉత్పత్తిరంగానికి మరింతగా పెరిగాయి. చారిత్రాత్మకంగా ఇలాంటి పెట్టుబడులు ఎక్కువగా సేవా రంగానికి వస్తాయి. అలాంటిది గడచిన మూడేళ్లలో ఉత్పత్తిరంగానికి పెరిగాయి. ఎఫ్‌డిఐ టెలికాం రంగానికి 4.2 బిలియన్ డాలర్లు అందాయి. ఆ తర్వాత బీమారంగం, సిమెంట్, విద్యుత్ యంత్రసామగ్రి, బ్యాంకింగ్ సేవలు, మెటలర్జికల్ రంగపరిశ్రమలు వంటివి ఎక్కువ ఉన్నాయి. భారత్‌కరెంటు ఖాతా లోటు భర్తీకి మరింతగా విదేశీ నిధులు రాబట్టుకోవాల్సిన వసరం ఉందని యుబిఎస్ సెక్యూరిటీస్ వివరించింది. స్థిరమైన ఎఫ్‌డిఐలను రాబట్టేందుకు ఉత్పత్తిరంగంలో మరింత పోటీతత్వం పెరగాల్సి ఉందని, అంతేకాకుండా ఉత్పత్తి రంగాన్ని అంతర్జాతీయస్థాయి విలువల చైన్‌గా మార్చాలన్న వైఖరి వెల్లడించింది. సాంకేతికంగానను, సంసా ఋుగతంగాను కంపెనీలు ఉత్పత్తినిపెంచేందుకుమరింత మద్దతును అందించాలి. భారత్‌మొత్తంవృద్ధికి అనుగుణంగా సరైన వాతావరణాన్ని నిర్మించాల్సిన అవసరం పాలకులపైనే ఉందని యుబిఎస్ వెల్లడించింది.

'సిప్' పెట్టుబడులవైపు ఫండ్ సంస్థల చూపు

దీర్ఘకాలిక సంపద సృష్టిపై ఐసిఐసిఐఫండ్

ముంబయి,ఆగస్టు 27: దీర్ఘకాలిక సంపద సృష్టి లక్ష్యంతో ఫండ్ సంస్థలుసిప్‌వేపు వస్తున్నాయి. చిన్న, సన్నకారు ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు రూ.10వేలు పెట్టుబడులు పెట్టండి పదేళ్లలో మూడులక్షలు పొందండి అంటగేలం వేస్తున్నాయి. భారీ ఫండ్‌యాజమాన్య సంస్థగా కొనసాగుతున్న ఐసిఐసిఐ ప్రుడెన్షియల్‌డైనమిక్ ప్లాన్ కొత్త ఫండ్‌ను ఆవిష్కరించింది. ఐసిఐసిఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో విడుదలయిన ఈ ప్లాన్‌ను 2002 అక్టోబరులో విడుదలచేసింది. స్టాక్‌మార్కెట్ మూలధన విలువల్లో పెట్టుబడులు పెట్టడంద్వారా రిటర్నులు సాధించే లక్ష్యంతో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. ఎలాంటి అనిశ్చిత వాతావరణం ఉన్నా మంచి రిటర్నుల్లఉ వస్తాయని చెపుతున్నారు. 27 ఏళ్లఅనుభవం ఉన్న శంకరన్‌నరేన్ ఇహాబ్ దల్వాల్‌లు ఈఫండ్‌ను నిర్వహిస్తున్నారు. క్రిసిల్ రేటింగ్‌లో ఈఫండ్‌కు టాప్ 30లో ఒకటిగా నిలిచింది. బెంచ్‌మార్క్ నిఫ్టీలో ఈ ఫండ్ భారీస్థాయిలో ర్యాలీ తీసింది. ఆంఫి విభిన్నఈక్విటీ పనితీరు సూచీలో కూడా టాప్ స్థానంలో నిలిచింది.ఉదాహరణకు ఈఫండ్‌లో 2002లోనే పదివేలు పెట్టుబడిపెట్టినట్లయితే వార్షికవృద్ధి చొప్పున 24.11శాతం పెరిగి 240,553 రూపాయలకు చేరుతుందని, బెంచ్‌మార్క్ వార్షికవృద్ధి 17.19శాతం చూపి 103,291రూపాయలుగా ఉంటుందని ఫండ్‌సంస్థ వివరించింది. సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ కింద రూ.10వేలు సిప్‌ద్వారా పెట్టుబడులు పెడితేపదేళ్లకు 26.98 లక్షల రూపాయలు పెరుగుతాయి. అదే బెంచ్‌మార్క్ కేటగిరీలో 20.73 లక్షలకు చేరుతుందని, 25.21లక్షలకు చేరుతుందని తెలుస్తోంది. గడచినమూడేళ్లలో ఐసిఐసిఐ ప్రుఫండ్‌ఎఎంసి 120 స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టింది. కొంతమేర లార్జ్ క్యాప్ కంపెనీల్లో కూడా మొగ్గుచూపించింది. 74శాతం ఈక్విటీని కేటాయించింది. మొత్తం 120 స్టాక్స్‌లోని పెట్టుబడులు 11 స్టాక్స్ 19.51శాతం వాటాతో ఉన్నాయి. రెయిన్‌ఇండస్ట్రీస్ మంచి పనితీరు చూపించి 174శాతం రిటర్నులు ఇచ్చింది. కల్పతరు పవర్‌ట్రాన్స్‌మిషన్ 74.46 శాతం పవర్‌గ్రిడ్‌కార్పొరేషన్ 51.26శాతం చొప్పున రిటర్నులిచ్చాయి. విభాగాలపరంగా బ్యాంకింగ్ స్టాక్స్‌మంచి పనితీరు చూపించాయి. 14.59శాతం సగటు రిటర్నులు ఇచ్చాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వీటలో టాప్‌బ్యాంకుగా నిలిచింది. 90శాతానికిపైగా ఈ కాలంలో పెరిగింది. అలాగే సాఫ్ట్‌వేర్‌రంగంపరంగా చూస్తే రెండో అతిపెద్ద సూచీగా నిఇచి 11.03శాతం రిటర్నులు తెచ్చింది. ఫండ్ కేటాయింపులు 18.43శాతం నుంచి 7.57శాతానికి తగ్గించినా విద్యుత్, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాలు టాప్ ఫైవ్ సూచీల్లో నిలిచాయి. బజాజ్ ఫిన్‌సెర్వ్ ఫండ్ పనితీరుకు మంచి క్రియాశీలక పాత్ర పోషించింది. గుజరాత్ నర్మదావ్యాలీ ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, కళ్యాణి ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, టాటా కెమికల్స్ వంటిస్టాక్స్ ఫండ్‌కు మంచి మద్దతునిచ్చాయి.



ఇఫ్కో గ్రామీణ ఇ-కామర్స్

ముంబయి, ఆగస్టు 27: భారతీయ రైతుఎరువుల సహకారసంస్థ (ఇఫ్కో) గ్రామీణప్రాంతాల్లో ఇ-కామర్స్ విధానంలో ఎరువులు, ఉత్పత్తులు విక్రయించాలని నిర్ణయించింది. ఇందుకోసం సిఎస్‌సి ఇగవర్నెన్స్ సేవ ల సంస్థతో ఒప్పందంచేసుకుంది. డిజిటల్‌కార్యాచరణకు తాముకూడా సిద్ధం అవుతున్నట్లు ఇఫ్కో ఒక ప్రకటనలో తెలిపింది. ఈఒప్పందం ప్రకారం అన్నిఉత్పత్తులు సేవలు కూడా ఇఫ్కో గ్రూప్‌కంపెనీలకు సంబంధించినవి అన్నీకూడా సిఎస్‌సి ఇ-కామర్స్ వెబ్‌పోర్టల్‌లో ప్రదర్శిస్తారు. గ్రామస్థాయి పారిశ్రామికవేత్తలు రైతులనుంచి ఆర్డర్లను తీసుకుని పంపించుకోవచ్చు. ట్రక్‌లోడు లేదా కనీస మొత్తానికి ఆర్డర్లు స్వీకరిస్తే గ్రామస్థాయి వ్యాపారులు సిఎస్‌సి పోర్టల్‌లోనే ఆర్డరుచేసి చెల్లింపులు జమచేయవచ్చని ఇఫ్కో వెల్లడించింది. రైతులకు మరింత సులువుగా సత్వరమేవ్యవసాయ ఉత్పత్తులు అందించేందుకు ఈఒప్పందం దోహదం చేస్తుందని,ఇఫ్కోఎండియుఎస్‌అవస్థి వెల్లడించారు.

సిగ్నాటిటికె నుంచి 'ప్రొహెల్త్ సెలెక్ట్'

ముంబయి, ఆగస్టు 27: టిటికె సిగ్నా కార్పొరేషన్ తాజాగా కొత్త ఆరోగ్యబీమా ప్రొహెల్త్ సెలెక్ట్‌ను పరిచయం చేసింది. సులభమైన, సాధారణంగా ఉపయోగించేప్రణాళిక తీవ్రమైన అనారోగ్యం, శాశ్వత పూర్తి వైకల్యం సందర్భాల్లో ప్రీమియం లేకుండా రెండేళ్లపాటు యాధృచ్ఛికంగా విస్తరించే రీ అస్యూరెన్స్ ప్రయోజనం అందిస్తుంది. క్లెయింతో నిమిత్తంలేకుండా ప్రతి ఏటా మొత్తం బీమాను ద్రవ్యోల్బణ షీల్డ్ సర్దుబాటుచేస్తుంది. ప్రొహెల్త్ సెలెక్ట్ కస్టమర్ల విభిన్న ఆరోగ్య అవసరాలకు భద్రత కల్పించేందుకు రూపొందించామని కంపెనీ ఎండి సిఇఒ సందీప్‌పటేల్ వెల్లడించారు. ప్రొహెల్త్ సెలెక్ట్ వంటిది భారత్‌లో మొదటి స్కీం అని కస్టమరు కవరైన తీవ్రమైన అనారోగ్యం శాశ్వత పూర్తి వైకల్యంతో బాధపడుతున్న సందర్భంలో ఆరోగ్యబీమా ప్రీమియంను రెండేళ్ల వరకూ మినహాయింపును అందిస్తుందని ఆయన అన్నారు. ఆయుష్ కవర్, మూడులక్షల వరకూ టాపప్ ఎంపికలు, రీ అస్యూరెన్స్ ప్రయోజనం, ద్రవ్యోల్బణ షీల్డ్‌తో కలిసి అందిస్తుందనిఅన్నారు. పట్టణగ్రామీణ మార్కెట్లన్నింటిలోనూ ఈఉత్పత్తులు లభిస్తాయన్నారు.

గుడ్ల ధరలు

Ph:040-23234068

వందకు, రూ.లలో		Rs.per 100 eggs
హైదరాబాద్	355	Hyderabad
నెక్ రేట్లు (28 - 8 - 2017)		NECC RATES
(రిటైల్ ధర రూ.4.15		(Retail Price Rs.4.15)
విజయవాడ	359	Vijayawada
గోదావరి	359	Godavari
విశాఖపట్నం	362	Visakha
వరంగల్	357	Warangal
చిత్తూరు	390	Chittoor
చెన్నై	397	Chennai
ముంబయి	400	Mumbai
న్యూఢిల్లీ	370	New Delhi
కోల్‌కతా	393	Kolkata
బెంగళూరు	380	Bangalore
నమక్కల్	387	Namakkal

చికెన్‌కాబ్

Mobile No.9849219870

(రూ. కిలోకు) (RS.PER Kg)

ఫామ్‌గేట్	(Farmgate)	82
డ్రెస్డ్	(Dressed)	97
విత్ స్కిన్	(with skin)	136
స్కిన్‌లెస్	(Skinless)	160

బులియన్ ధరలు

	27 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29680	29010
22 క్యారెట్లు (10గ్రా)99.5	27800	27130
వెండి .999 (కేజి)	41933	41072
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29660	28980
22 క్యారెట్లు (10గ్రా)99.5	27780	27100
వెండి .999 (కేజి)	41921	41061
చెన్నయ్		
24 క్యారెట్లు10గ్రా)	29670	29000
22 క్యారెట్లు	27790	27120
వెండి బార్ (కేజి)	41948	41085
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	29720	29030
22 క్యారెట్లు (10గ్రా)	27840	27150
వెండి (కేజి)	41956	41083
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29670	29000
22 క్యారెట్లు (10గ్రా)99.5	27790	27120
వెండి .999 (కేజి)	41933	41072
విశాఖపట్నం		
24 క్యారెట్లు10గ్రా)	29670	29000
22 క్యారెట్లు	27790	27120
వెండి బార్ (కేజి)	41933	41072

ఇండియన్ ఇమ్యునలాజికల్స్ నుంచి 'జస్ప్రే'

హైదరాబాద్, ఆగస్టు 27: ఇండియన్ ఇమ్యునలాజికల్ సంస్థ హెర్బల్ మార్కెట్‌కు విస్తరించింది. జంతువులకోసం జస్‌ప్రే ఔషధాన్ని మార్కెట్‌కు తెచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ఈ సంస్థ జంతువుల కోసమే ప్రత్యేకించి ఈ ఉత్పత్తిని విడుదల చేసింది. దేశీయంగా జంతుసంక్షేమ హెర్బల్ మార్కెట్ రూ.480 కోట్లుగా ఉంది. జస్‌ప్రే కూడా అన్ని విధాలుగా



గాయాలను జంతువులకు సులువుగా తగ్గిస్తుందని అన్నారు. కంపెనీ ఎండి డా.కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ హరిద్రా శక్తి జస్‌ప్రేలో ఎక్కువ ఉంటుందని, ఇతర చర్మవ్యాధులకు సైతం జస్‌ప్రే ఎంతో నివారణిగా పనిచేస్తుందన్నారు. మియాసిస్, ఫూట్ లెసన్స, ఎఫ్ఎండి, యోక్ గాల్స్, డినెల్లా, రింగ్‌వార్మ్, స్కేబీస్ వంటి వ్యాధుల నుంచి జస్‌ప్రే నివారణిగా పనిచేస్తుందన్నారు. గాయాల మాన్పిడికి భారతీయ సార్వత్రిక వ్యాధినిరోధక సంస్థ రూపొందించిన జస్‌ప్రే ఎంతో శక్తివంతంగాపని చేస్తుందన్నారు. 100ఎంఎల్‌స్ప్రే సీసాల్లోప్రస్తుతం అన్నిరిటైల్ షాపుల్లోను లభిస్తుందని కంపెనీ ఎండి వివరించారు.


ఐడియా సెల్యులర్‌కు రూ.2.97 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 27: దేశంలో రెండో అతిపెద్ద టెలికాం రంగంగా పేరున్న ఐడియా సెల్యులార్‌కు టెలికాం రెగ్యులేటరీ ట్రాయ్‌రూ.2.97 కోట్ల జరిమానా విధించింది. మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ వినియోగదారులపై ఎక్కువ ఛార్జిలు విధించిందనే కారణంతో ట్రాయ్ ఐడియా సెల్యులర్‌కు జరిమానా వేసింది. 2005 మేనుంచి 007 జనవరి మధ్యకాలంలో బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ నెట్‌వర్క్ కాల్స్‌ను టెర్మినేట్‌చేసేటపుడు ఐడియా ఈ విధంగా భారీ మొత్తం ఛార్జిలు విధించింది. ప్రస్తుతం వొడాఫోన్ ఇండియాతో విలీనం కాబోతున్న ఐడియా, 15రోజుల్లో టెలికాం కన్స్యూమర్ ఎడ్యుకేషన్ అండ్‌ప్రొటెక్షన్ ఫండ్ వద్ద ఈ మొత్తాన్ని జమచేయాల్సి ఉంటుంది. ట్రాయ్ చట్టం 1997లో అధికారాలతో ఈ అథారిటీ ఐడియాకు 2,97,90,173కోట్ల మొత్తంచెల్లించాలని ఆదేశించింది. 2005 మేనుంచి 2007జనవరి మధ్య కాలంలో చందాదారులపై ఎక్కువ ఛార్జీలు వేసిన కారణంతో ఈ ఆదేశాలు జారీచేసినట్లు ట్రాయ్ వెల్లడించింది. ఒకేరాష్ట్రంలోప్రాంతాలను బట్టిఐడియాపలు ట్యారిఫ్‌లు వసూలుచేసింది. 2005 మేనెలలో టెలికాం సవరించిన లైసెన్సు షరతులకు ఈట్యారిఫ్‌లు వివక్షతో అస్థిరంగా ఉన్నాయని ట్రాయ్ అంచనా వేసింది.

త్వరలో తమిళ సిఎంగా స్టాలిన్!

ట్విట్టర్లో బిజెపి నేత సుబ్రమ్మణ్యస్వామి జోస్యం
డిఎంకెతో చేతులు కలపనున్న దినకరన్?
పళనిసామి ప్రభుత్వం కూలటం ఖాయమని ట్వీట్లు

చెన్నై, అగస్టు 27 : తమిళనాడు అసెంబ్లీని విపక్ష డిఎంకె కైవసంచేసుకుని, స్టాలిన్ ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకోబోతున్నారంటూ సంచలన ట్వీట్లు చేసారు బిజెపి సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి. ఆదివారం ఆయన తన ట్విట్టర్ ఖాతాలో పలు ట్వీట్లు ఉంచుతూ, అన్నాడిఎంకె నుంచి విపక్ష డిఎంకెలోకి 22 మంది సభ్యులు జంప్ అవుతు న్నారని చెప్పారు. వీరికితోడుగా అన్నాడిఎంకెలోని శశికళ వర్గానికి నేతృత్వం వహిస్తున్న దినకరన్‌తో ఇప్పటికే నడిచిన శాసనసభ్యులతో కల్సి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని తేల్చి చెప్పారు స్వామి. మరికొద్ది రోజుల లోనే పళనిసామి ప్రభుత్వం కుప్పకూలనుందని, ఎన్నికలకు మరి మూడేళ్ల పైచిలుకు సమయం ఉండ టంతో అంతవరకు డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్ పాలనా పగ్గాలు అందుకునేందుకు అన్ని అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. స్టాలిన్‌కు మద్దతుగా ప్రస్తుత ప్రభు త్వానికి మద్దతుగా నిలుస్తున్న స్వతంత్ర్య సభ్యులలో ఒకరు బైటకురానున్నట్లు చెప్పారు సుబ్రహ్మణ్య స్వామి. ఇప్పటికే శశికళ మేనల్లుడు టిటివి దినకరన్ సహా శాసనసభ్యులంతా పళనిసామిని సిఎం పదవి నుంచి తప్పించాలంటూ గవర్నర్‌ని కలవటం, మరోవైపు స్టాలిన్ సైతం ప్రభు త్వంపై అవిశ్వాసానికి



సిద్ధమవుతున్నట్లు ప్రకటించిన క్రమంలో అధికార అన్నాడిఎంకె వర్గాలలో సంచలనం రేగుతోంది. ఇప్పటికే 21 మంది సభ్యులు దినకరన్ వెంట నడవ టంతో మైనార్టీలోపడ్డ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు పళనిసామి, పన్నీరు సెల్వంలు సంయుక్తంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వానికి మద్దతు ఉపసంహారిం చుకున్నట్లు గవర్నర్‌కు లేఖ సమర్పించిన 19 మంది శాసనసభ్యులపై వేటు వేయటంతోపాటు గత వర్షా కాల సమావేశాల సందర్భంగా నిషేధిత గుట్కా ప్యాకెట్లు అసెంబ్లీలో ప్రదర్శించిన విపక్ష సభ్యులపైనా కేసులు నమోదుచేసి, వారి సభ్యత్వానికి ఎసరు పెట్టడందా్వరా మెజార్టీని నిరూపించుకో వాలన్న యోచనలో అన్నాడిఎంకె నేతలు ఉన్నట్లు కనిపిస్తోం దన్నది రాజకీయవర్గాలలో వినవస్తున్న అంశం. కాంగ్రెస్‌పార్టీసైతంరాష్ట్రప్రభుత్వాన్ని రద్దుచేసి తాజాగా ఎన్నికలు జరిపించాలంటూ డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చింది. దీంతో గవర్నర్ విద్యాసాగరరావు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

బిజెపి నుంచి దేశాన్ని రక్షిద్దాం

పాట్నాలో ఆర్జేడీ నేతృత్వంలో విపక్షాల భారీ ర్యాలీ
నితీష్ ఆదేశాలు ధిక్కరించి శరద్‌యాదవ్ హాజరు
2019 ఎన్నికల్లో బిజెపి, నితీష్‌ని ఓడించాలని లాలూ పిలుపు

పాట్నా, ఆగస్టు 27 : బిజెపి నుంచి ఈ దేశాన్ని రక్షించాలన్న నినాదంతో లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడి ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభలకు 21 బిజెపి యేతర పక్షాలన్నీ హాజరయ్యాయి. బీహార్ రాజధాని పాట్నా పట్టణంలోని చారిత్రిక మహాత్మాగాంధీ మైదాన్‌లో జరిగిన ర్యాలీలో లాలూ ప్రసాద్ యాదవ్ తనదైన శైలిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు మహాకూటమికి పట్టం కడితే బిజెపి పార్టీ వారి విశ్వాసాలను తుంగలోకి తొక్కి జెడియుని కూటమి నుంచి తప్పించి నితీష్‌నే తిరిగి ముఖ్యమంత్రిని చేసిందని మండి పడ్డారు. మిత్ర పక్షాల మధ్య విభేదాలు సృష్టించి బిజెపి రాజకీయంగా లబ్ధిపొందా లని చూసారని, లాలూతో జతకట్టడం వల్లే నితీష్ గతంలో గెలుపొందిన విషయాన్ని మరచి మిత్రద్రోహానికి పాల్పడ్డారని విమర్శించారు. నితీష్‌కుమార్ కేవలం లాలూనో, తేజస్వియాదవ్‌నో మోసం చేసినట్లు తను భావించడంలేదని యావత్ బీహారీలను విశ్వాసాన్ని దెబ్బతీసారని భగ్గుమన్నారు లాలూ. ఆర్జేడీ నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాకరమైన ర్యాలీలో ప్రజలను కోరేది ఒక్కటే 2019 పార్లమెంట్ ఎన్నికలలో బిజెపిని, నితీష్‌కుమార్‌ని సాగనంపాలని నిర్ణయం తీసుకోవాలని సూచించారాయన. దేశంలో అన్ని పార్టీల నేతలు, వివిధ రాష్ట్రాలలోని ఆర్జేడి కార్యకర్తలు నాయకులు వస్తున్నందున ప్రజలకు తన ర్యాలీతో ఎలాంటి అసౌకర్యం కలగుకూడదనే ఆదివారంను సభలు జరపాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ రోజున వ్యాపారాలు, కార్యాలయాలతో పాటు పాఠశాలలకు సైతం సెలవు కావటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, భవిష్యత్‌లోనూ తమ పార్టీ జరపనున్న అన్ని ర్యాలీలు ఆదివారం జరిగేలా చూస్తానని లాలూ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్రమంతా వరద బీభత్స ఉన్నప్పటికీ తనపిలుపుకు స్పందించి వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలను చూసి నితీష్ ఆర్జేడి బలం ఏపాటిదో గుర్తుంచుకోవాలని సూచించారు. ఇక బిజెపి, జెడియు



పాట్నాలో ఆర్‌జెడి నేతృత్వంలో జరిగిన విపక్షాల ర్యాలీలో ప్రసంగిస్తున్న ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ

సర్కారుకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో పాటు నితీష్‌ని వీడి వస్తున్న శరద్‌యాదవ్‌తో కలిపి పనిచేస్తామని ప్రకటించారాయన. ఈ ర్యాలీలో బిహార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ చౌదరి దూరంగా ఉండగా, రాజ్యసభ సభ్యుడు, పార్టీ సీనియర్ నేత గులాంనబి ఆజాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి సిపి జోషి, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో సహా పలు పార్టీల నేతలు హాజరయ్యారు. మరోవైపు మహాకూటమి నుంచి బైటకు వచ్చినందున లాలూ నిర్వహిస్తున్న సభకు వెళ్లరాదంటూ జెడియు చీఫ్, బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, జెడియు తిరుగుబాటు నేత, రాజ్యసభ సభ్యుడు శరద్‌యాదవ్, గుజరాత్ నుంచి ఎన్నికైన జెడియు నుంచి బహిష్కృతుడైన రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్‌లు ఈ ర్యాలీలో పాల్గొనటం విశేషం.

లాలూని పరిహాసిస్తున్న నెటిజన్లు

పాట్నా భారీ ర్యాలీ బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు హాజరయ్యారంటూ లాలూ ప్రసాద్ యాదవ్ ట్విట్టర్లో ఉంచిన ఫోటో ఇప్పుడు వైరల్‌గా మారింది. వాస్తవానికి సభ జరిగిన పాట్నా మహాత్మాగాంధీ స్టేడియం మైదానంలో జనం అరకొరగా ఉండగా, లాలూ ట్వీట్ చేసిన ఫోటో మాత్రం పెద్ద ఎత్తున జనం ఉన్నట్లుం డటంతో నెటిజన్లు ఆయనపై సెటైర్లు వేస్తున్నారు. లాలూజీ ఫోటో షాప్ మీకన్నా మాకు బాగా వచ్చంటూ చేస్తున్న వ్యాఖ్యలు నెటిజన్లలో నవ్వులు పూయిస్తున్నాయి. లాలూ తన ప్రసంగాలతో పాటు ఫోటోలతోనూ బాగా జోకులు పేలుస్తారంటూ మరికొందరు వ్యాఖ్యలు చేయటం గమనర్హం.

పెరుగుతున్న నైజీరియన్ల ఆగడాలు

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: నైజీరియన్ల ఆగడాలు హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా అనేక నగరాలలో పోలీసులకు తలనొప్పి వ్యవహారంగా మారాయి. ఒకప్పుడు చిన్నా చితక నేరాలు, చోటా మోటా మోసాలకే పరిమితమైన నైజీరి యన్లు నేడు అంతర్జాతీయంగా నిషేధానికి గురైన అనేక రకాల మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతూ ఓవైపు యువతను పాడు చేస్తుండడంతో పాటు మరోవైపు కొత్త రకం నేరాలకు బీజం వేయసాగారు. ఆఫ్రికా దేశాలతో వాణిజ్య పరంగా వున్న సంబంధాల నేపథ్యంలో నేరాలకు పాల్పడుతున్న నైజీరియన్ల విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరించడం లేదని విమర్శలు వున్నాయి. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లుగా చిన్నపాటి నేరగాళ్లుగా వున్న నైజీరియన్లు నేడు బడా క్రిమినల్స్‌గా మారుతూ అనేక నగరాలలో శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తుండడంతో కేంద్రం ఇకనైనా వీరి విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం వుందని నిపుణులు అంటున్నారు. ఏడాది క్రితం గోవా బీచుల్లో యువతకు మాదకద్రవ్యాలు అమ్ముతున్న 25 మంది నైజీరియన్లను అరెస్టు చేశారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. కాగా తమ వారిని అరెస్టు చేయడాన్ని స్థానికంగా వుండే కొందరు నైజీరియన్లు, ఆఫ్రికన్ దేశస్తులు జీర్ణించుకోలేక గోవా వీధుల్లో నానా హంగామా సృష్టించడంతో గోవా పోలీసులు వారిని కటకటాల్లో నెట్టారు. ఈ ఘటన తరువాత నైజీరియా, ఆఫ్రికా దేశాల్లో ఇండియాకు వ్యతిరేకంగా ఆందోళ నలు జరిగాయి. ఇండియాలో తమవారు ఏం చేసినా పట్టించుకోవద్దంటూ వీధుల్లో ప్రదర్శనలు చేశారు. గోవా ఘటన తరువాత నైజీరియన్ల కదలికలపై పోలీసులు నిఘా ఉంచి నేరాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేయసాగారు. ఈ నేపథ్యంలోనే గడచిన ఆరునెలల్లో అనేక నగరా లలో మోసాలు, మాదకద్రవ్యాలు తదితర నేరాల్లో వందమందికి పైగా నైజీరియన్లు పట్టుబడ్డారు.

తాత్కాలిక వీసాలపై ఉంటూ

దేశ వ్యాప్తంగా ఐదు లక్షల మంది ఆఫ్రికన్ దేశస్తులు ఇండియాలో వుంటున్నారు. వీరంతా తాత్కాలిక వీసాలపై వస్తూ ఇక్కడే తిష్ట వేస్తూ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఐదారేళ్లుగా నైజీరియన్లు మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నేపథ్యంలోనే హైదరాబాద్‌లో పట్టుబడిన కెల్విన్ అనూహ్యంగా అబ్కారీ శాఖకు కెల్విన్ అరెస్టు తరువాత 15 మంది నైజీరియన్లు మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోయారు.

వెనుకాడుతున్న కేంద్రం

ఆఫ్రికా దేశాల వాణిజ్య సంబంధాల కారణంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై కేంద్రం కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలువున్నాయి. ఈ విషయంలో కేంద్రం ఇకనైనా కఠినంగా వ్యవహరించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కార్లపై సెస్ పెంపునకు కేంద్రం ప్రతిపాదన

హైదరాబాద్,ఆగస్టు 27 ప్రభాతవార్త: పెద్ద కార్ల విక్రయాలపై ఈ వారంలో సెస్ పెంపునకు ప్రతిపా దనలు సిద్ధమయ్యాయి.ఇందుకు గాను ఆర్డినెన్స్ ద్వారా లగ్జరీకారు సెస్‌ను 25శాతం మేరకు పెంచనున్నారు.పెద్ద కార్లు,మధ్య తరహా కార్లతో పాటు ఎస్‌యువిఎస్‌లపై ఈ సెస్ ప్రభావం చూప నుంది.ప్రస్తుతం అమలవుతున్న 15 శాతం కాకుండా 25 శాతం వరకు సెస్‌ను పెంచాలని ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.లగ్జరీ కార్లు, ఎస్‌యువి కొనుగోలు దారులకు మరింత భారం కానుంది.ఇందుకోసం ఆర్డినెన్స్‌జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది.సెక్షన్ 8యాక్ట్ 2017 ప్రకారం జిఎస్‌టిని సవరించనున్నారు.ఆరు మాసాల వ్యవధిలో కాబినెట్ ఈ విషయంపై ఆర్డినెన్స్ ద్వారా సవర ణను పరిశీలించనున్నారు.ఒక చట్టాన్ని లేదా మార్పును ఆమోదించడానికి పార్లమెంట్ సెషన్‌లో లేని పక్షంలో ఒక ఆర్డినెన్స్ జారీ చేయబడుతుందనే విషయం తెలిసిందే.ఆరు మాసాలలోపు బిల్లును పార్లమెంట్ ఆమోదంతో సరైనశాసనంతో భర్తీ చేయాల్సి ఉంటుంది.కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జిఎస్‌టి కౌన్సిల్ అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన జిఎస్‌టి కౌన్సిల్ మోటార్ వాహనాలపై గరిష్టంగా సెస్ పెంపునకు శాసన సవర ణలు సిఫారసు చేసింది.ప్రస్తుతం 15 శాతం నుంచి 25 వరకు సెస్ పెరగనుంది.చట్టం సవరించిన తరువాత జిఎస్‌టి కౌన్సిల్ సెస్‌ను నూతన సెస్‌ను అమలు చేయనుంది.ఈ క్రమంలో వచ్చే ప్యానెల్ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించను న్నారు. సెప్టెంబరు 9న ఈ సమావేశం జరుగనుంది.అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జిఎస్‌టి కౌన్సిల్ అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన జిఎస్‌టి కౌన్సిల్ మోటార్ వాహనాలపై సెస్ పెంచడానికి నిర్ణయించనుంది. మోటారు వాహనాలపై గతంలో ఉన్న జిఎస్‌టి 52 నుంచి 54.72కు చేరుకుంది.సెంట్రల్ టాక్స్,దీంతో జిఎస్‌టి మొత్తం పన్ను 43 శాతానికి చేరుకుంది.చిన్న పెట్రోల్ కార్లు 1200 సిసిల 1 శాతం సెజ్,చిన్న డిజిల్ కార్లు 1500 సిసి ఇంజన్లు 3 శాతం సెజ్‌లను అమలు చేయనున్నారు.

రత్నాలు,ఆభరణాల నగదు బదిలీకి రెగ్యులేటర్ విధానం

పిఎంఎల్‌ఎ సెక్టర్ ద్వారా రత్నాలు,ఆభరణాల రంగంకోసం జిఎస్‌టి ఇంటలిజెన్స్ ఆర్మ్ నియం త్రిస్తుంది.కొత్తగా ఏర్పడిన జిఎస్‌టి ఇంటలిజెన్స్ ఆర్మ్,డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఇంటలిజెన్స్‌గా నామకరణం చేశారు. రత్నాల,ఆభరణాల రంగంలో నగదు బదిలీ కేసుల వ్యవహారాలకోసం ఈ రెగ్యులేటర్ పనిచేయనుంది. ఆర్థికమంత్రిత్వ శాఖ గూడ్స్, ఆభరణాల రంగానికి సంబంధించి నియంత్రణా ధారుల డైరెక్టరేట్ జనరల్,సేవా టాక్స్ ఇంటలి జెన్స్(డిజిజిఎస్‌టి)ని రెగ్యులేటర్‌గా నియమిం చింది. మనీ లాండరింగ్ నిబంధనలను ఇటీవలే సవరించింది. పిఎంఎల్‌ఎ కింద నియంత్రన మార్గదర్శకాలు,వివిధ లావాదేవీలలో క్లయింట్ గుర్తింపునకు స్థాపించడానికి చర్యలను సూచి స్తుంది. క్లయింట్ గుర్తింపు,వ్యాపార సంబంధాలు, స్వభావం,మొత్తం నగదు లాండరింగ్, లాభదాయ కమైన ఫైనాన్షియల్ ఫైనాన్సింగ్ నష్టాల ఆధారంగా లావాదేవీల విలువ పరిగణలోకి తీసు కోవడం,నిబంధనలను రాష్ట్రంగా పరిగణనలోకి తీసుకునేందుకు ఇది మెరుగైన లేదా సరళీకృ తమైన చర్యలు సూచించవచ్చు.

35 శాతం వ్యాపారులు జిఎస్‌టి రిటర్ను దాఖలు

తెలంగాణకు చెందిన 35 శాతం వ్యాపారులు తమ జులై రిటర్నులను దాఖలు చేశారు.దీంతో ఇప్పటి వరకు 582 కోట్లు జిఎస్‌టి ద్వారా టాక్స్ వసూలైంది.కాగా జులై నెలకు గాను 1,700 కోట్లు రూపాయలు రావాల్సి ఉంది.ఈ క్రమంలో ఐ 684 జిఎస్‌టి నుంచి ,మరో 372 కోట్లు సిజి ఎస్‌టి నుంచి రానుంది.ఇప్పటి వరకు తెలంగా ణకు జిఎస్‌టి నుంచి ఆశాజనకమైన రీతిలో ఆదాయం లభించింది.ఇంకా కొందరు వ్యాపారులు జిఎస్‌టి రిటర్ను చేయడానికి అవకాశం ఉంది. ఆగస్టు 28 వరకు గడవు వస్తుందని వాణిజ్య పన్నుల విభాగం అధికారిక వర్గాలు ఈ విష యాన్ని వెల్లడిస్తున్నాయి. చివరి నిమిషంలో రిట ర్నులు దాఖలు చేయడం జిఎస్‌టిఎన్ సర్వర్‌ను పనితీరు మందగించనుంది.రిటర్ను దాఖలు చేయ డానికి రద్దీ ఉన్నప్పుడు గంటల్లో సర్వర్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

జిఎస్‌టిఎన్ సర్వర్‌తో వర్తకులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.25 శాతం హోటళ్ల నిర్వాహకులు గత వారం వరకు తిరిగి దాఖలు చేశారు.మిగిలిన 75 శాతానికి గడువుకు ముందు వారి రిటర్ను దాఖలు వీలుఉంది. జిఎస్‌టి విషయంలో ఇంకా వ్యాపార వర్గాల్లో ఆయో మయం పూర్తిగా తొలగిపోలేదు. దీంతో చెల్లిం పులు ఆలస్యం అవుతున్నాయని తెలుస్తుంది. జిఎస్‌టి ద్వారా 2.5 లక్షల పరిధి వ్యాపారుల నుంచి ఆశాజనకంగా రిటర్నులు వచ్చాయి.కాగా 15 శాతం వర్తకులు మాత్రమే 90 శాతం రిట ర్నులను దాఖలు చేశారు.ఆగస్టు 28 గడువులోగా పన్ను చెల్లింపులకు 15 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది.

డేరాబాబాకు శిక్షపై నేడు తీర్పు

రోహ్‌తక్ జైలుకు వెళ్లిన జడ్జి
ఇద్దరు సాధ్వీలపై అత్యాచార కేసులో శిక్ష ఖరారు
దాడుల్లో మృతులు 39 - తీర్పు నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
కోర్టు నుంచి బాబాని తప్పించాలని చూసిన పోలీసులపై వేటు

చండీగఢ్, ఆగస్టు 27 : ఇద్దరు సాధ్వీలపై అత్యాచార కేసులలో శిక్ష ఖరారైన డేరాబాబా గుర్మీన్ రామ్ రహీమ్ సింగ్‌పై తుదితీర్పును సోమవారం మధ్యాహ్నం 2:30కి ప్రకటించనున్నారు. ఈ మేరకు పంచకుల సిబిఐ ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి నేరుగా కోర్టు నుంచి డేరాబాబాని ఉంచిన పంచకుల జైలుకు చేరుకుని తీర్పుని చదివి వినిపించడంతో శిక్ష ఖరారవుతుంది.కనీసం ఈ కేసు బాబాకు ఏడేళ్ల వరకు జైలుశిక్ష ఖరారు అయ్యే ఆస్కారం కనిపిస్తోంది. మరోవైపు బాబా మద్దతు దారులు చేసిన విధ్వంసాల కారణంగా జరిగిన నష్టాన్ని ఆతని ఆస్తులను అమ్మి బాధితులకు నష్టపరిహారం అందించాలన్న డిమాండ్ సామాజిక మీడియాలో మిన్నంటుతోంది. ఇప్పటికే ఈ అంశంపై హర్యానా హైకోర్టు ధర్మాసనం యోచి స్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. బాబా ఆస్తులు, వ్యాపారాల లావాదేవీల విషయమై నివేది కలు అందించాలని పంజాబ్, హర్యానా రాష్ట్రాల పోలీసు కమిషనర్లకు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.

తేరుకుంటున్న పంచకుల..

పంచకులలో డేరా బాబా అనుచర గణం చేస్తున్న దాడుల నుంచి ఇప్పుడిప్పుడే ఉపశమనం లభి స్తోందని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రకటించారు. ఆదివారం ఆయన మీడి యాలో మాట్లాడుతూ శుక్రవారం పోలీసులు కఠినంగా వ్యవహరించంలో విఫలమైనందనే పరి స్థితి అదుపుతప్పిందన్నది వాస్తవమని అంగీక రించారు. ఇప్పటికే చట్టాన్ని చేతుల్లోనికి తీసు కున్న వారిని గుర్తించామని, అనేక మందిని పోలీ సులు అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు



ఖట్టర్. పంచకులతోసహా పలు పట్టణాలలో 144 సెక్షన్ అమలవుతోందని, ఈ ప్రాంతాలలో మీడియా సిబ్బందిపైనా డేరా అనుచరులు దాడులుచేసి వారి వాహనాలు బూడిద చేసిన విష యాన్ని గుర్తించామని, ఈ నష్టాన్ని వారం రోజుల లోపలే పూరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు సిఎం. ఇప్పటి వరకు అల్లర్ల కారణంగా 300 మందికి పైగా ప్రజలు క్షతగాత్రులు కాగా మృతుల సంఖ్య 38కి చేరినట్లు చెప్పారు. సోమవారం తీర్పు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భద్రతని కట్టుదిట్టం చేసామని, ఘర్షణ ప్రాంతాలను పూర్తిగా పారా మిలటరీ దళాలు ఆధీనంలో ఉన్నట్లు సిఎం వివరించారు.

బాబాని తప్పించాలని చూపారు..

మరోవైపు రేప్ కేసులో దోషిగా నిరూపితమైన గుర్మిత్‌ని జైలుకు తరలించేందుకు పోలీసులు ఏర్పాటు చేస్తున్నప్పుడు డేరాబాబా భద్రతా సిబ్బంది ఏడుగురు ఆతన్ని తప్పించేందుకు ప్రయ త్నించారని పంచకుల పోలీస్ సెక్టర్ -5 ఇనస్పె క్టర్ కబీర్‌సింగ్ చెప్పారు. వీరిలో దేరాబాబా భద్రతకు వినియోగిస్తున్న ఐదుగురు పోలీసులతో పాటు మరి ఇద్దరిపైనా కేసు నమోదు చేసే వీలు న్నట్లు చెప్పారు. గుర్మత్‌ని తమ వాహనంలో కోర్టుకుదూరంగా ఉన్న బాబా మద్దతుదారుల మధ్యకు తీసుకు వెళ్లాలని భావించినట్లు చెప్పారు. అప్పటికే వాహనాలు విధ్వంసం జరుగుతు న్నందున గుంపు ద్వారా బాబా తప్పించుకు పారిపోయే అవకాశాలను పసిగట్టిన పారామిలటరీ దళాలు సూచనలతో హెలికాప్టర్‌ద్వారా రోహ్‌తక్ జైలుకు తరలించామని వివరించారు. బాబా పారిపోయేలా చేసేందుకు యత్నించిన భద్రతా సిబ్బంది ఏడుగురినీ గుర్తించినట్లు ఆయన చెప్పారు.

వరుస వర్షాలతో అధికారులు అప్రమత్తం

ఏజెన్సీలలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం
1414 హైరిస్క్‌గ్రామాలలో ఇప్పటికే క్యాంపులు
సెల్ కౌంటర్ మిషన్లతో త్వరగా గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త : తెలంగాణలో ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. సర్వత్రా అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా ఆయా విభాగాలను సమన్వయం చేస్తూ ప్రాణా పాయం లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలకు సిద్ధమయ్యారు. ఈ సిజన్‌లో అంటువ్యాధుల నివారణకు గాను తీసుకుంటున్న చర్యలలో భాగంగా కొత్తగా సెల్‌కౌంట్ మిషన్లను వినియోగిస్తున్నారు. వీటి వినియోగంతో అంటు వ్యాధులను అతి త్వరగా గుర్తించవచ్చనీ, దీంతో వెంటనే వైద్య చికిత్సలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వరుసగా కురు స్తున్న వర్షాల కారణంగా ఏజెన్సీ ఏరియాలలో ప్రజలను చైతన్యపరుస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యాధిగ్రస్తులతో అంటు రోగాలు మన రాష్ట్రంలోనూ విస్తరించే ప్రమాదం ఉన్నందున హైరిస్క్ ఏరియాలను గుర్తించి ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియాసిస్ వంటి వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో ప్రత్యేకించి ఏజెన్సీ ఏరి యాలలో ఎక్కువగా ఈ వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1414 హైరిస్క్ గ్రామాలను గుర్తించగా, వాటిలో 36 మున్సిపాలిటీల పరిధిలోనే ఉన్నాయి. నివారణ చర్యలలో భాగంగా 3, 35, 711 ర్యాపిడ్ డయా గ్నసిస్ పరీక్షలు నిర్వహించగా, ఆర్టిమెసినిన్ ట్యాబ్లెట్లను అన్ని పీహెచ్‌సిల్లోనూ సిద్ధంచేసి, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణనీటిపారుదలశాఖ (ఆర్‌డబ్ల్యుఎస్) అధికారులతో సమ న్వయం చేసుకుంటూ వ్యాధుల నివారణకుచర్యలు చేపడుతున్నారు.గిరిజ నులకు వైద్య సేవలు అందక గిరిజనులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిం చాల్సిన దుస్థితి నెలకొంది.దీంతో నాటువైద్యానికి ఆ వ్యాధులు నయం కాకపోగా ఆర్థికంగా భారం కావడం వారి దుస్థితికి అద్దం పడుతోంది. గిరిజనులు నివసించే ప్రాంతాలలో దోమల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం దోమ తెర పథకాన్ని ప్రారంభించింది.

చెన్నైలో ఘనంగా 'క్రీమ్ మద్రాసు-2017' వేడుకలు

చెన్నై, ఆగస్టు 27, ప్రభాతవార్త : మద్రాసు వారోత్సవాల సందర్భంగా 'క్రీమ్ మద్రాసు-2017' వేడుకలు ఆదివారం చెన్నైలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై, అన్నాయూనివర్శిటీలో ఇంటర్ స్కూల్ కాంపిటేషన్స్‌ను ఏర్పాటు చేశారు. మద్రాసు నగరం 378వ జన్మదినాన్ని జరుపుకుంటున్న తరుణంలో ఈ వినూత్న పోటీలకు శ్రీకారం చుట్టింది 'నీడ్ ఆఫ్ ది సేఫ్ స్ట్రీట్' అనే అంశంపై దీనిని ఏర్పాటు చేశారు. ఇందులో చెన్నైలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో చెన్నై పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసే విధంగా విజ్ఞాన కూడలిలు ఏర్పాటు చేశారు. ఇందులో అనేక పోస్టర్లు, చార్టులు, ప్రెజెంటేషన్స్‌చోటుచేసుకున్నాయి. ట్రాఫిక్ కామింగ్, సేఫ్ స్ట్రీట్స్ లైటింగ్ తదితర అంశాల గురించి విద్యార్థులు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.



చెన్నైలో విద్యార్థులు రూపొందించి మద్రాసు జన్మదిన వేడుకల కూడలి

చిన్నారులను కాపాడేందుకు ప్రాణాలు పణంగా పెట్టి..

బాంబుతో పరుగులు తీసిన కానిస్టేబుల్

చెన్నై, ఆగస్టు 27, ప్రభాతవార్త: పాఠశాలలో ఉన్న చిన్నారులను కాపాడాలనే తపనతో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టేందుకు ఓ పోలీస్ కానిస్టేబుల్ సిద్ధపడ్డాడు. పది కేజీల బరువు ఉండే బాంబును భుజాన పెట్టుకొని కిలోమీటరు దూరం పరుగెత్తాడు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ ప్రాంతంలో ఉన్న పాఠశాలలో బాంబు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పాఠశాలకు చేరుకున్న పోలీసులు బాంబుకోసం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కానిస్టేబుల్ పటేల్‌కు పాఠశాలలో పెట్టిన 10 కేజీల బరువు, 12 అంగుళాల పొడవు ఉన్న బాంబు కంటపడింది. అప్పటికీ బాంబు నిర్వీర్య బృందం పాఠశాలకు రాలేదు. దాంతో పాఠశాలలో ఉన్న చిన్నారులను కాపాడేందుకు పటేల్ పది కేజీల బరువు ఉన్న బాంబును భుజాన పెట్టుకొని నిర్జన ప్రదేశంలో పాదేయడానికి పరిగెత్తాడు. ఆ సమయంలో పాఠశాలలో 400 మంది చిన్నారులు ఉన్నారు. కిలోమీటరు దూరం పాటు ఆ బాంబును అలాగే పట్టుకొని పరిగెత్తుకుంటూ వెళ్లిపోయాడు. అదృష్టవశాత్తూ ఆ బాంబు పటేల్ చేతిలో ఉన్నప్పుడు పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అసలు పాఠశాలలో ఎవరు బాంబు పెట్టారో, ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై



మధ్యప్రదేశ్‌లో బాంబు భుజాన పెట్టుకొని పరిగెత్తుతున్న కానిస్టేబుల్

పోలీసులు విచారణ చేపట్టారు. అసాధారణమైన ధైర్య సాహసాలు ప్రదర్శించి, 400 మంది చిన్నారుల ప్రాణాలను కాపాడిన పటేల్‌ను సహోద్యోగులు, ఉన్నతాధికారులు అభినందించారు. ఆయన చూపించిన ధైర్యాన్ని ప్రశంసిస్తూ ఐజీ రివార్డు ప్రకటించింది.

ఆయిల్ కంపెనీల పెట్రో షాక్...

రోజువారీ సవరణలతో వినియోగదారులపై పెనుభారం

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త : పెట్రోల్ ధరలను రోజువారి సవరణల పేరుతో కొద్ది కొద్దిగా పెంచుతున్న చమురుసంస్థలు పెట్రో వినియోగ దారులపై పెనుభారం మోపుతున్నాయి. గత జులై నుంచి ఇప్పటివరకు పెంచిన మొత్తం చూస్తే షాక్‌కు గురికావాల్సిందే. జులై నుంచి పెట్రోల్ ధరలు లీటరుకు రూ.6 పెరుగగా డీజిల్ ధరలు లీటరుకు రూ.3.67 మేర పెరిగాయి. పెట్రోల్ ధరల పెరు గుదల చూస్తే గత మూడేళ్ళ గరిష్టస్థాయిలో పెరుగు దల కనిపిస్తోంది. డీజిల్ ధరలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. రోజువారీ ధరల సవరణ వినియోగదా రుల నడ్డి విరిచేలా ఉంది. ప్రతి నెలా 1, 16 తేదీల్లో ధరలను సవరించే విధానానికి స్వస్తి చెప్పిన ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు గత జూన్16 నుంచి రోజూ ధరలను సవరించే విధానాన్ని అవలంభిస్తు న్నాయి. ఈ పద్ధతిని అనుసరించడం ప్రారంభమైన తొలి పక్షం రోజుల్లో స్వల్పంగా తగ్గినట్టు కనిపించిన పెట్రోల్ ధరలు ఆ తర్వాత పెరుగుతూనే ఉన్నాయి. గతంలో పెట్రోల్ ధరలకు పక్షంరోజులకు ఒకసారి పెంచ డంతో వినియోగదారులకు అవగాహన ఉండేది. ఇపుడు రోజువారీ సవరణతో రోజుకు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల పైసల్లో ఉంటుండడంతో వినియోగ దారులు పెద్దగా దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో ఆయిల్ కంపెనీలు ఇష్టానుసారంగా పెంచు తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆయిల్ కంపెనీల గణాంకాల ప్రకారం జూన్ 16న లీటర్ పెట్రోల్ ధర రూ.65.49 ఉండగా జులై 2న రూ.63.06కు తగ్గింది. ఆ తర్వాత ధరలు పెరు గుతూ వచ్చాయి. డీజిల్ లీటర్ ధర రూ.54.49 ఉండగా జులై2న రూ.53.36కు స్వల్పంగా తగ్గింది. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.70.33 ఉండగా డీజిల్ ధర రూ. 57.03 ఉంది. ప్రభుత్వం వీటికి జీఎస్టీ నుంచి మినహాయించినప్పటికీ పెట్రో ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. పలు రా ష్ట్రాలు, కేంద్రం వేస్తున్న లెవీలు మాత్రం ధరలపై ప్రభావం చూపుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ ఆ ప్రయోజనాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. అంతర్జాతీయంగా ధరలు తగ్గుతూ ఉంటే పెట్రోల్ ధరలు తగ్గాల్సింది పోయి పెరగడమేమనిటని విని యోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గం.లకు పెట్రోల్ ధరలను ఆయిల్ కంపెనీలు సవరిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కె ట్‌లో మారుతున్న ముడి చమురు ధరలకను గుణంగా నిత్యమూ ఈ ధరలను సవరిస్తున్నారు. తాజాగా ఆది వారం నాడు పెట్రోల్ లీటరు పై 5 పైసలు, డీజల్‌పై 7 పైసలు పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పెట్రోల్ ధర లీటరుకు రూ. 73.12 ఉండగా డీజిల్ దర రూ.61.96కు పెరిగింది. ఢిల్లీలో పెట్రోల్ రూ.69.06, డీజిల్ ధర రూ. 57.03 ఉంది. కోల్‌కొతాలో పెట్రోల్ రూ. 71.82, డీజిల్ ధర రూ. 59.69, ముంబైలో పెట్రోల్ రూ.78.18, డీజిల్ 60.58, చెన్నైలో రూ. 71.56, డీజిల్ రూ.61.96 కు పెరిగింది.

కోర్టుకిచ్చిన హామీ కూడా హుళక్కే!

గడువు ముగిసినా అమలుకాని తెలంగాణ ప్రభుత్వ హామీ
మౌలిక వసతులు లేక విద్యార్థుల అవస్థలు
టీచర్ల నియామకంలోనూ నాన్చుడే



హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో పాఠశాలలు దుర్భరంగా కొనసాగుతున్నాయి. మౌలిక సదుపాయాల కొరతతో విద్యార్థులు తీరని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాఠశాలల పున: ప్రారంభం నాటికే పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలను కల్పి స్తామని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు తెలిపాయి. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలైంది. కానీ ఇప్పటి వరకు సౌకర్యాల విషయంలో తెలుగు రాష్ట్రాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా తెలంగాణలో ప్రభుత్వ ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కూడా ఇప్పుడప్పుడంటూ పులి కథను తలపిస్తుంది. ఉపాధ్యాయ ఖాళీలతో పాటు మౌలిక సదుపాయాలను కల్పన పట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సదుపాయాలతో పాటు టీచర్ల భర్తీని పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆదేశించినా... స్పందన లేదు. పైగా పలు రకాల సాకులను చూపి సమయాన్ని కోరాయి. దీంతో ప్రభుత్వాలు కోరిన సమయం శుక్రవారంతో ముగిసింది. అయినా రెండు రాష్ట్రాలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

పాఠశాలల పరిస్థితులివి: ప్రతి ఒక్కరు చదువుకోవాలి... 14ఏళ్ల లోపు వారు పాఠశాలల బయట కనపడకూడదు... నిర్బంద విద్య రాజ్యాంగంలోని ప్రధానాంశాలలో ఒకటి. రెండు తెలుగు రాష్ట్రాల వైఖరిలు చూస్తే ఒకరు కేజి టు పీజి ఉచిత విద్య అని ... మరొకరు విద్యారంగంలో తాము చేస్తున్న సంస్కరణలు భేష్ అంటూ వారికి ఇరు రాష్ట్రాలు ఎవరికి వారే కితాబిచ్చేసుకుంటున్నారు. ప్రతి విద్యాసంవత్సరం ఆరంభంలో బడిబాట అంటూ అధికారులను, టీచర్లను ఇంటింటికి తిప్పి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. అంతేకాదు ఫలితాలు రాకుంటే ఖబడ్దార్ అనడమే కాదు చక్కటి ఫలితాలు రాని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లపై చర్యలు తీసుకుంటున్నారు. ఇంత వరకు బా గానే ఉన్నా... చదువుకోవాలంటే ప్రశాంత వాతావరణం, మౌలిక వసతులు ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. కూర్చోవాలంటే నేల తప్ప బెంచీలుండవు, అరకొర తరగతి గదులు, ఆరు బయ ట, చెట్లకింద చదువులు సాగు చదువులు, ఎప్పుడు రూఫ్ కూలిపోయి మీద పడుతుందో తెలియని భవనాలు, ఏ పొద నుంచి ఏ విషపు పురుగులు, పాములు, తేళ్ల తరగతి గదిలోకి వస్తాయో అన్న రీతిలో పాఠశాలల ఆవరణలు, ఈడుకు వచ్చిన విద్యార్థినులు మూత్ర విసర్జన చేయాలన్నా లేని టాయ్‌లెట్లు ఇలా చెప్పుకుంటూ పోతే సర్కారు బడులు అసౌకర్యాలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి... మౌలిక సదుపాయాలు... కనీస సౌకర్యాల కల్పనలో గతం కంటే భిన్నమైన పరిస్థితులేమి లేవు... సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించడమే కాకుండా పాఠశాలల పటిష్టతకు మరింత చొరవ చూపుతామని ప్ర భుత్వం ప్రకటించినా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా తర్వాత పాఠశాలలను పటిష్టం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలుగు రాష్ట్రాలు ప్రకటించాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కనీసం ఆ దిశగా చర్యలు అనవాళ్లు కూడా లేవు. పాఠశాలల మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులతో పాటు ఉపాధ్యాయులు లేకపోవడంతో తగ్గుతున్న విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని ఇరు రాష్ట్ర ప్ర భుత్వాలను సు ప్రీంకోర్టు ఆదేశించింది. ఉపాధ్యా య ఖాళీలను జూన్ 24వ తేదీలోపు భర్తీ చేసి జూలై 24వ తేదీన నివేదికను అందించాలని మార్చి 23న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ముందుగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించాల్సి ఉంటుందని జూలై 24వ తేదీన ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. టెట్ నిర్వహణను పూర్తి చేశామని.. త్వరలోనే ఫలితాలను విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చ ర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇందుకోసం సెప్టెంబర్ 11వ తేదీ వరకు సమయం కావాలని సర్కార్ కోర్టును అభ్యర్థించింది. ఈ లోగా డిఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయాలని న్యాయస్థానం ఆదేశి ంచింది. తీసుకున్న సమయం ముగిసినా టీచర్ల నియామకాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఒక స్పష్టతకు రాలేదు. సౌకర్యాల కల్పన విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిది కూడా అదే పరిస్థితి.

ప్రచార ఆర్భాటాలే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత తెలంగాణ, ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రాలు పాఠశాల విద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని ప్రకటించాయి. ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్న చందంగా ఈ ప్రయత్నాలు మారాయి. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు విద్యా ప్రగతి కోసం కీలకమైన మార్పులు తీసుకుంటామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు అవసర మైన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం అజామాయిషీ ఉండేందుకు ఒకటి నుంచి ఐదవ తరగతి కూడా ప్రభుత్వ పాఠ్యాంశాలనే వినియోగించాలని, ఫీజు క్రమబద్ధీకరణకు సైతం కమిటీ ఏర్పాటు చేసింది. కానీ ఇప్పటి వరకు అధికారులు వీటి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాఠశాలల యాజమాన్యాల ఒత్తిడి కారణంగా ప్రభుత్వం వీటి అమలు పట్ల ఆసక్తిని కనబర్చలేకపోతున్నారు.

చేదెక్కనున్న చక్కెర!

తగ్గుతున్న దిగుబడులు- ఇబ్బందుల్లో పరిశ్రమ

హైదరాబాద్, అగస్టు 27, ప్రభాతవార్త: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో చక్కెర ధరలు పెరగనున్నాయి. చెరకు పరిశ్రమలు తీవ్ర ఇబ్బందుల్లో ఉండడంతో చక్కెర ధరల్లో భారీగా మార్పులు చోటు చేసుకోనున్నాయి. దేశవ్యాప్తంగా వరుస కరువులతో చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఫలితంగా త్వరలో చెక్కర ధరలకు రెక్కలు రావడం తప్పవని అంచనా వేస్తున్నాయి. దీని ప్రభావం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంటుందని సంబంధిత అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. దేశంలో మొత్తం చక్కెర ఉత్పత్తిలో మూడో వంతు ఉత్పత్తి అయ్యే మహారాష్ట్రలో ఈసారి అత్యల్ప దిగుబడులు రికార్డయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్స రంలో రానున్న రోజుల్లో దిగుబడి మరింత తగ్గుతుందని అంటున్నారు. మహారాష్ట్రలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి 40 శాతం మేర చక్కెర ఉత్పత్తి తగ్గొచ్చని లెక్కకడుతున్నారు. దీంతోపాటు అధికంగా ఉత్పత్తి చేసే కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కరువుతో 44 శాతం ఉత్పత్తి పడిపోయిందని, ఇది ధరలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయని అధికారవర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చెరకు పరిస్థితి రానురాను దయనీయంగా తయారైంది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో చక్కెర రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పండించిన పంటకు కనీస పెట్టుబడులు రాకపోగా, అమ్మిన ఉత్పత్తులకు సైతం సకాలంలో చేతికి సొమ్ము అందిరావడం లేదు. తెలంగాణలో పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాక, రావాల్సిన సొమ్ములు చేతికి అందక చెరుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మద్దతు ధరలు లేకపోవడం, చక్కెర మిల్లుల దయనీయ పరిస్థితుల ప్రభావం చెరుకు సాగుకు అన్నదాతను దూరం చేస్తోంది. చెరుకు ఫ్యాక్టరీల బకాయిలు పెరుగుతుంటే, మరోపక్క బెల్లం తయారీ కూడా నామ మాత్రంగానే ఉంది. ఉన్నదానిని దక్కించుకుని బెల్లం తయారీ, ఫ్యాక్టరీలకు తరలించినా పెట్టుబడులు కూడా దక్కడం లేదు సరికదా రైతులకు సకాలంలో చేతికి సొమ్ములు అందడం లేదు. ఫ్యాక్టరీలు రైతులకు కోట్లాది రూపాయల మేర బకాయిలు పడుతున్నాయి. పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో ఫ్యాక్టరీలు కూడా సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో అప్పులు చేసినా గిట్టుబాటు ధర లభిస్తుందన్న నమ్మకం లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట వేస్తే అప్పులే మిగులుతాయనే భయంతో పలువురు రైతులు సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. జహీరాబాద్, సంగారెడ్డి పట్టణాల్లో షుగర్ ఫ్యాక్టరీలు ఉన్నా క్రషింగ్ సమయంలో తిప్పలు తప్పడం లేదు.వరుసగా మూడేళ్ల నుంచి ధరల్లో మార్పులు లేకపోవడంతో రైతులు చెరకు సాగును తగ్గిస్తున్నారు. సంగారెడ్డి, జహీరాబాద్‌లో ఉన్న పంచదార ఫ్యాక్టరీల్లో గతంలో ప్రతీ ఏటా దాదాపు 15 లక్షల టన్నులకు పైగా చెరుకు క్రషింగ్ చేసేవారు. అయితే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో యాజమాన్యాలు విఫలం కావడంతో వారు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతీ ఏటా నవంబర్ నెలలో క్రింగ్ ప్రారంభం కావడం సర్వసాధారణమైంది. గత నాలుగేళ్లుగా టన్ను చెరుకు ధర 2,600 రూపాయలకు మించడం లేదు. గత ఏడాది మాత్రం 2,700 రూపాయల చొప్పున కొనుగోలు చేశారు. అయితే క్వింటాలుకు నాలుగు వేల రూపాయలకు పెంచాలనే డిమాండ్ రైతుల నుండి ఉంది. కాగా ఎరువులు, విత్తనం ధరలతో పాటు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చే కూలీ భారీగా పెరగడంతో గతంలో ఎకరాకు 30 వేల రూపాయల పెట్టుబడి పెడితే, అది ఈ ఏడాది 45 వేల రూపాయలకు పైగా చేరినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో రైతాంగం బారీగా నష్టపోవడం తప్పడం లేదు. మరోపక్క చెరుకు పంటకు సంబంధించి తెలంగాణలో ఫ్యాక్టరీల నుంచి రైతులకు అందాల్సిన బకాయిలు దాదాపు 400 కోట్ల రూపాయల వరకూ ఉన్నాయని అధికారిక అంచనా. దీనికితగినట్లుగా చెరుకు పంటకు ఎకరాకు సుమారు 40 వేల రూపాయల వరకూ ఖర్చుపెడితే సరాసరి 25 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. వీటికి కేంద్రప్రభుత్వం రెండు వేల రూపాయల గిట్టుబాటు ధర కల్పిస్తే, రాష్ట్ర ప్రభుత్వం, మిల్లులు కలిపి మిగిలిన డబ్బును రైతులకు ఇవ్వాలి. 2002 వరకూ కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలపై ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం సలహా ధరను ఇచ్చేది. అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని ఎత్తివేయడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సలహా ధరను ఇవ్వాలని సుప్రీం కోర్టు సైతం సూచించినా అది ఇప్పటికీ అమలు కావడం లేదు. అయితే పక్క రాష్ట్రాలు సలహా ధరను అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మాత్రం వీటిని అమలు చేయకపోవడం పట్ల రైతుల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పలు ఫ్యాక్టరీలు అత్యంత తక్కువగా 2,350 రూపాయలను మాత్రమే ఇస్తున్నాయి. ఈనేపథ్యంలో చెరుకు పంటకు గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో చెరుకు సాగును రైతులు మానుకుంటున్నారు. ఎక్సైజ్ సుంకాన్ని తొలగిస్తే 40 రూపాయలకే కేజీ చక్కెర దొరికే వీలుంటుందని ఆమేరకు కేంద్రం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే ప్రపంచంలోనే అత్యధికంగా చక్కెర ఎగుమతి చేస్తున్న బ్రెజిల్ దేశం నుండి దిగుమతి చేసుకుంటేనే తప్ప ఈ పరిస్థితిలో మార్పు రాదని కూడా సూచిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ మూలాలను ఛేదించే పనిలో పోలీసులు

వైఎస్సార్సీ ఎమ్మెల్యేల పాత్రపై పూర్తిస్థాయిలో ఆరా - రెండోసారి విచారణకు హాజరైన కోటంరెడ్డి
జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ఉత్కంఠ - సిటీ ఎమ్మెల్యే అనిల్‌కు ఊరటేనా?

నెల్లూరుక్రైం, ఆగస్టు 27 ప్రభాతవార్త: జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాన్ని పూర్తిస్థాయిలో ఛేధించేందుకు జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ నిమగ్నమయ్యారు. ఎస్పీ బాధ్యతలు చేపట్టాక మొదటిగా ఎర్రచందనంపై ఉక్కుపాదం మోపారు. తర్వాత క్రికెట్ బెట్టింగ్ ఆట కట్టించే పనిలో ఎస్పీ రామకృష్ణ నిమగ్నమయ్యారు. ముఖ్యంగా క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో నెల్లూరుసిటీ పి అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పాత్రపై పూర్తిస్థాయిలో ఆరాతీస్తున్నారు. ఇప్పటికే ఆయా ఎమ్మెల్యేల అనుచరులను విచారించారు. ఆ విచారణలో ఎమ్మెల్యేల పేర్ల ప్రస్తావన రావడంతో ఈ నెల 22వ తేదిన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇద్దరు ఎమ్మెల్యేలను విడివిడిగా విచారించారు. తిరిగి 27వ తేదిన విచారణకు హాజరుకావాలని ఎమ్మెల్యేలకు పోలీసులు సూచించారు. ఈనేపథ్యంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. అయితే సిటీ ఎమ్మెల్యే అనిల్ మాత్రం విచారణకు హాజరుకాలేదు. దీనిపై భిన్నకథనాలు తెరపైకి వచ్చాయి. కోటంరెడ్డి విచారణ తర్వాత మధ్యాహ్నం నుంచి అనిల్‌కు విచారణ ఉంటుందని, ఎమ్మెల్యే అనిల్‌ను విచారించకుండా ఆయన అనుచరుడు, కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్‌ను విచారించాక అనిల్‌ను విచారణకు పిలుస్తారంటూ అనేక పుకార్లు షికారు చేశాయి.

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రెండోమారు క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో విచారణకు హాజరైన నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంవద్ద హైడ్రామా చోటుచేసుకుంది. ఉదయం నుండే పోలీసులు ఆ ప్రాంతంలో పెద్దఎత్తున మోహరించారు. మరొపక్క కోటంరెడ్డి అనునీయులు కూడా భారీగానే అక్కడికి చేరుకొని పరిస్థితిని గమనిస్తున్నారు. ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. అభిమానులు, కార్యకర్తలు కార్యాలయం వైపు పరుగులు తీశారు. కోటంరెడ్డి మీడియాతో మాట్లాడి విచారణకు వెళ్లారు. దాదాపు ఒకటన్నర గంటపాటు శ్రీధర్‌రెడ్డిని విచారించారు. ఏఎస్పీ బి శరత్‌బాబు నేతృత్వంలో సాగిన విచారణ అత్యంత గోప్యంగా జరిగింది. ఎమ్మెల్యే కోటంరెడ్డి విచారణ జరుగుతున్నంతసేపు ఆ ప్రాంతంలో ఉత్కంఠత నెలకొంది. కోటంరెడ్డి విచారణ అనంతరం ఒంటిగంట సమయంలో పోలీస్



విచారణకు హాజరైన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి

కార్యాలయంనుంచి బయటకు వచ్చారు. ఆయనకు మద్దతుగా సరస్వతి నగర్‌లో ఉన్న కోటంరెడ్డి కార్యాలయం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పోలీస్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు చోటుచేసు కున్నాయి.

క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ రెండోమారు విచారణకు హాజరవ్వాలని పోలీసులు సూచించారు. అయితే ఆయన ఆదివారంజరిగిన విచారణకు హాజరుకాలేదు. దీనిపై అనేక అనుమానాలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో అనిల్ పాత్ర లేనందు వల్లే పోలీసులు ఆయనను రావద్దని సమాచారం పంపినట్లు కొందరు భావించగా మరికొందరు ముందుగా అనిల్ ముఖ్య అనుచరుడు రూప్‌కుమార్ యాదవ్‌ను విచారించాక అనిల్‌ను విచారణకు పిలుస్తారన్న వాదన తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్‌యాదవ్‌ను నేడే, రేపో రహస్యంగా విచారించనున్నట్లు సమాచారం. మొత్తం మీద అనిల్ విచారణకు హాజరుకాకపోవడం పట్ల ఆయనకు కొంత మేర ఊరట లభించింది. ఇదిఇలావుంటే అనిల్ అనునీయులు క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కీలక వ్యక్తులుగా పోలీసులు భావిస్తున్నారు. వీరందరిని పూర్తిస్థాయిలో విచారించాక అనిల్ ప్రస్తావన ఉంటే ఆయనను మరోమారు విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తమపై రాజకీయ కక్ష్యసాధింపులో భాగంగానే వేధింపులు, బెదిరింపులు, అక్రమ కేసులను బనాయించే పనిలో ఉన్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. పోలీస్ విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు చేపట్టిన విచారణకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తున్నానని తెలిపారు. తన కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంటర్ల వివరాలను కూడా అందజేశానన్నారు. పోలీసుల చేత పోలీస్ డ్యూటీ చేయించకుండా పొలిటికల్ డ్యూటీ సిఎం చంద్రబాబు చేయిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో తమపై కుట్ర జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం చేతులో ఉందికాదా అని తమను బెదిరించాలని చూస్తే బెదిరేది లేదని అన్నారు. చేతనైతే హత్య, హత్యాయత్నం, ఎర్ర చందనం స్మగ్లింగ్, అవసరమైతే డేరాబాబా అల్లర్లలో తమ ప్రమేయం ఉన్నట్లుగా చిత్రీకరించి కేసులు పెట్టుకోవచ్చునని సవాల్ విసిరారు. సిఎం బుడ్డ బెదిరింపులకు బెదిరేదిలేదన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు చేసే తనపై అక్రమ కేసులు బనాయిస్తే ప్రజాపోరాటానికి కూడా సిద్ధమేనన్నారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో మంత్రులు, మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పోలీస్ అధికారుల గన్‌మెన్లు, డ్రైవర్ల కాల్‌లిస్ట్ డేటాను సేకరించి ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. వీరందరికి కూడా నోటీసులు జారీచేసి విచారిస్తే క్రికెట్ బెట్టింగ్‌ను పూర్తిస్థాయిలో నివారించగలుగుతామన్నారు. గోవా టూర్‌లో జాతీయ బుకీ కృష్ణసింగ్ తమకు సహకరించారని, ఆర్థిక లావాదేవీలు జరిపారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గోవా టూర్‌లో ఖర్చంతా మేయర్ అబ్దుల్ అజీజ్ మాత్రమే భరించారని తెలిపారు. అబ్దుల్ అజీజ్‌కు కూడా నోటీసులు జారీ చేసి ఎందుకు విచారణ జరపడం లేదని కోటంరెడ్డి ప్రశ్నించారు. తనపై అధికార పార్టీ చేస్తున్న కక్ష సాధింపు చర్యలను ఐజీ, డీజీపీలకు వివరిస్తారని, వారు కూడా పట్టించుకోకుంటే హైకోర్టును ఆశ్రయిస్తానని ఎమ్మెల్యే కోటంరెడ్డి చెప్పారు.

అప్రమత్తంగా లేకుంటే బొత్స రాజ్యం వచ్చేస్తుంది..

జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలకు కేంద్రమంత్రి అశోక్ హెచ్చరిక

బొబ్బిలి ఆగస్టు 27 ప్రభాతవార్త: జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలంతా అప్రమత్తమై వ్యవహరించకపోతే జిల్లాలో మళ్లీ బొత్స రాజ్యం రావడం ఖాయమని, అప్పుడు తల గోక్కోవడం తప్ప చేసేదేమీ లేదని కేంద్ర పౌరవిమానయాన శాఖామాత్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు హెచ్చరించారు. ఆదివారం బొబ్బిలి కోటలో జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ జిల్లాను తాగుబోతుల జిల్లాగా మార్చిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హయాంవస్తే ఆ కుటుంబమంతా మళ్లీ ఎమ్మెల్యేలవుతారని, మళ్లీ మద్యం ఏరులైపారుతుందని అన్నారు. అవినీతికి చెక్ పెట్టకపోతే మన స్వాతంత్ర్యానికి అర్థం లేకుండా పోతుందని, అన్న నందమూరి తారకరామారావు తరచూ ఇదే మాట చెబుతుండేవారన్నారు. 43 వేల కోట్ల రూపాయల కుంభకోణంతో జైలుపాలై, ప్రతీ శుక్రవారం స్టేషన్‌కు వెళ్లి సంతకం చేస్తున్న వైసీపీ అధినేత జగన్ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికలలో ముఖ్యమంత్రి చంద్రబాబు భోజనం తీసుకెళుతున్న వాహనాన్ని కూడా అటకాయించి వైసీపీ నానా హడావిడిచేసిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేస్తున్నారన్నారు. పోలవరం, పట్టిసీమలను జగన్ వ్యతిరేకిస్తున్నాడన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు లాఠీ దెబ్బల అనుభవం ఉండేదని, చంద్రబాబు రైతులకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్ర విభజన అంశం టేబుల్ ఐటెమ్‌గా చర్చించారని, మహిళల రక్షణకోసం వాడే పెప్పర్ స్ప్రేయింగ్ కూడా జరిగిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన తీవ్ర అన్యాయాన్ని ఎన్నటికీ మరిచిపోలేనిదని అన్నారు. తెలుగువారైన పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయితే ఆయనపై పోటీ పెట్టకుండా ఎన్టీఆర్ సముచితంగా గౌరవించారని, ఇప్పుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడును అంతేరీతిలో సత్కరించారన్నారు. వైఎస్ జగన్ పన్నుతున్న కుట్రలో ప్రజలు భాగస్వాములు కాకుండా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చూడాలని లేకుంటే దొంగలరాజ్యం వస్తుందని ఎద్దేవా చేశారు. కృష్ణా నదిలో నేడు నీటి వనరులు తగ్గిపోవడానికి నాటి వైఎస్ విధానాలేనని అశోక్ తప్పుబట్టారు. అవినీతి మహారాజుగా వెలిగిపోయిన వైఎస్



జిల్లా పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అశోక్

రాజశేఖరరెడ్డి ఆల్మట్టి ప్రాజెక్టును అడ్డుకోలేకపోవడంతో నేడు ఈ దుస్థితి దాపురించిందన్నారు. తోటపల్లి నిర్వాసితులపై వైఎస్ కాల్పులు జరిపిన సంగతిని గుర్తు చేశారు. 35 ఎకరాల విస్తీర్ణంలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో వైఎస్ జగన్ బెంగళూరులో పెద్ద భవంతి కట్టుకున్నాడని, మహారాజులకు సైతం అలాంటి భవంతులులేవని అన్నారు. సొంత లాభంతో ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా భావించి భోంచేసి జైలు పాలయ్యారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబులు చాలా కష్టించి పనిచేస్తున్నారని, వారికి ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని, ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి గుర్తింపును పొందడం ఖాయమని అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అబద్ధాలతో వైఎస్సార్సీ పబ్బం : మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ పూర్తి అబద్ధాలతో పబ్బం గడుపుకోవాలని చూస్తోందని రాష్ట్ర భూగర్భ వనరుల శాఖామాత్యులు ఆర్‌వి సుజయ్ కృష్ణరంగారావు అన్నారు. ఇటీవల నంద్యాల ఉప ఎన్నికల్లో ఆ పార్టీ వైఖరి పూర్తిగా బయటపడిందన్నారు. సినీనటుడు మహేశ్‌బాబు, పవన్‌కళ్యాణ్‌ల మద్దతు వైసీపీకి ఉందని చెప్పుకోవడం, బీజేపీతో తెలుగుదేశం పొత్తు పోయి వైసీపీతో ఉంటుందని ప్రచారంతో ఓట్లు దండుకోవాలని చూశారన్నారు. వాస్తవానికి మహేశ్‌బాబు బావగారైన ఎంపీ గల్లా జయదేవ్, కేంద్రమాజీ మంత్రి పురందేశ్వరిలు వైసీపీ ప్రచారాన్ని తిప్పికొటిన విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సుజయ్ తెలిపారు. గతంలో జిల్లాలో దోపిడీకి పాల్పడిన నాయకులు మళ్లీ ప్రజల ముందుకు నిస్సిగ్గుగా వస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ చేసి చూపిస్తున్న అభివృద్ధి పనులను పెద్దఎత్తున వివరించాలన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఇందుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే కచ్చితంగా నివృత్తి చేసుకొని వైసీపీ ఎత్తుగడలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఉత్తుత్తి శంకుస్థాపనలు చేసే అలవాటు తమకు లేదని మంత్రి సుజయ్ అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి మృణాళిని మాట్లాడుతూ పెంచిన పెన్షన్, తోటపల్లి ప్రాజెక్టు విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. నెలిమర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అవినీతి తగ్గిందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని కితాబు ఇచ్చారు. జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పనీతీరుపై పెద్ద ఎత్తున చర్చ జరగాలని, ప్రజల్లోనికి తీసుకెళ్లాలని హితవు పలికారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, నియోజకవర్గఇన్‌చార్జి తెంటు లక్ష్మునాయుడు, యువరాజా బేబీనాయన, పార్వతీపురం ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సాలూరు ఇన్‌చార్జి ఆర్‌పి భంజ్‌దేవ్, రాష్ట్రపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిలు ఎల్‌ఎల్ నాయుడు, తూముల భాస్కరరావు, ఐవీపీ రాజు, జనార్దన్ థ్రాట్రాజ్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ పనీతీరును పొగుడుతూ ప్రతిపక్షనాయకుడు జగన్‌పై విమర్శలు గుపి ్పంచారు. ఇంకా ఈ సమావేశంలో బొబ్బిలి, విజయనగరం మున్సిపల్ ఛైర్‌పర్సన్స్ తూముల అచ్యుత వల్లి, ప్రసాదుల రామకృష్ణ, శోభాహైమవతి, గొట్టాపు వెంకటనాయుడు, చోడిగంజి రమేష్‌నాయుడు,అప్పికొండ శ్రీరాములు నాయుడు, అల్లాడ భాస్కరరావు, రాంబార్కి శరత్, పువ్వల శ్రీనివాసరావు, జెడ్‌పీటీసీలు, ఎంపిలు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యవేక్షణలో పనులు - విడుదలయ్యేనా నిధులు!

రూ.2812కోట్లకు చేరుకున్న ప్రాజెక్టు పనుల పెండింగ్ బిల్లులు

హైదరాబాద్ ఆగస్టు 27, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల పనులకు చెల్లించాల్సిన బిల్లులు పెద్దమొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం కేటాయించనా ఆర్థికశాఖ విడుదల చేయకపోతుండడంతో పనులు ఆశించిన వేగంగా జరగడం లేదు. ఇకనుంచి తానే స్వయంగా ప్రాజెక్టుల పనులను పర్యవేక్షిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. అంటే ఈ పనులను ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నది స్పష్టమయింది. దీంతో పెండింగ్ బిల్లులు రావడంతో పాటు మిగిలిన పనులకు నిధులు చకచకా వస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా రూ. 25వేల కోట్లు సాగునీటి వనరుల పూర్తికే కేటాయిస్తామని సిఎం ఎప్పుడో స్పష్టం చేశారు. అంతే కాదు ప్రతి నెల క్రమం తప్పకుండా రూ. 2వేల కోట్లు ఇస్తామని చెప్పారు. కాని ఈ పనిని పూర్తి స్థాయిలో చేయలేక పోతున్నారు. ఈ ఏడాది సాగునీటి రంగానికి 24,263కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులన్నీ ఖర్చు చేసి పనులు చేయించాలంటే కాంట్రాక్టర్లకు ప్రతి నెల రూ. రెండు వేల కోట్లు ఇవ్వాలి. దీనికి కనుగునంగా నిధులు విడుదల చేయాలి. అయితే కేటాయింపులకు తగ్గట్టు చెల్లింపులు ఉండడం లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 2812కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో(చేసిన పనులకు చెల్లించాల్సినవి) ఉన్నట్లు నీటిపారుదల శాఖ సమా చారం. భూసేకరణ, పునరావాస పనులు, విద్యుత్‌సరఫరా, రైల్వే, రోడ్డు క్రాసింగులు వంటి పనులు చేయించ డానికి నీటిపారుదలశాఖ కసరత్తులు చేస్తోంది. ముఖ్యమంత్రితో సహా నీటి మంత్రి హరీష్‌రావు ఎన్నో సమీక్షలు నిర్వహిస్తూ పనులను పరిగెట్టించే పని చేస్తున్నారు. అయితే ఆర్థిక శాఖ విడుదల చేస్తున్న నిధులను పరిశీలిస్తే లక్ష్యానికి తగ్గట్లుగా లేవు. ఆగస్టు 13వ తేది వరకు ఆర్థిక శాఖ చెల్లించింది రూ. 3352కోట్లు మాత్రమే. అంటే సరాసరి నెలకు వెయ్యి కోట్లు ఇచ్చింది. అంతకు మించి ఇవ్వలేకపోయిందంటే ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ప్రకారమే సగం చెల్లించే పరిస్థితిలో ఆర్థికశాఖ ఉంది. చేసిన పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులే రూ. 2812కోట్లు ఉంది. ఇక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుకే పెండింగ్ బిల్లులు ఎక్కువ ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్స రంలో ఈ ప్రాజెక్టు పనులకు ఇప్పటి వరకు రూ. 1398కోట్లు చెల్లించారు. ఇంకా చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ. 1212.75కోట్లు ఉన్నాయి. మిగిలిన ప్రాజెక్టులకు సంబంధించి కూడా చెల్లింపులు తక్కువగానే ఉన్నాయి. సీతారామా ఎత్తిపోతల పథకం పనుల్లో కొన్ని ఇటీవలే మొదలయ్యాయి. మరి కొన్ని ఒప్పంద దశలో ఉండడంతో దీనికి ఖర్చు నామమాత్రంగానే చేస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి రూ. 30వేల కోట్లు విలువ చేసే 18ప్యాకేజీల పనులకు ఒప్పందాలు జరిగాయి. అయితే కోర్టుకేసులు, హరిత ట్రిబ్యునల్ అనుమతులు వంటి అనేక కారణాలతో దీని పనులు కూడా లక్ష్యానికి తగ్గట్టుగా జరగడం లేదు. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేసి నీరందించాలన్న లక్ష్యం పెట్టుకున్న ప్రాజెక్టు పనులకు చెల్లింపులు

ప్రాజెక్టు పేరు	కేటాయింపు	చెల్లింపు	పెండింగ్
కాళేశ్వరం	6338.76	1398.47	1212.75
పాలమూరు	4028.99	464.53	323.58
దేవాదుల	1510.64	150.99	86.66
సీతారామా	1011	30.68	22.70
ఎస్ఎల్‌బిసి	897.75	146.32	275.59
ఎల్లంపల్లి	408.47	46.11	71.55
నెట్టెంపాడు	223.50	21.18	54.28
కల్వకుర్తి	1001	134.84	161.94
భీమా	219.50	16.66	14.47
ప్రాణహిత	800	40.82	67.01
డిండి	500	1.11	46.47
కంతన్‌పల్లి	505	17.77	000
మధ్యతరహా	817.05	64.33	44.27
చిన్న నీటిపారుదల	2258.47	386.79	146.50

తక్కువగానే ఉన్నాయి. వివిధ ప్రాజెక్టులకు జరిగిన కేటాయింపులు, చెల్లింపులు, పెండింగ్ బిల్లులు రూ. కోట్లలో ఇలా ఉన్నాయి.

పనులు చేపట్టాక ప్రజాభిప్రాయ సేకరణా? : సిపిఐ

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణను పోలీసుల నిర్బంధంలో చేపట్టడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది. నిర్వాసితులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వెల్లడించకుండా ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం అప్రజాస్వామికమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టు పనులు చేపట్టిన చాలారోజుల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం అర్థరహితమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణాల నుంచి నిర్వాసితులను ఈడ్చుకెళ్ళి బయటకు గెంటివేయడం, అసాంఘిక శక్తులపై వినియోగించే డ్రోన్‌లతో ప్రహార కాయడం ప్రభుత్వ దాష్టికానికి అద్దం పడుతుందని విమర్శించారు. ఇప్పటి వరకు 15 కేంద్రాలలో ప్రజాభిప్రాయ సేకరణ జరగడం జరిగిందని తెలిపారు. కనీసం 30 రోజుల వ్యవధితో సేకరణ కేంద్రాలు పెట్టాల్సి ఉండగా ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వారం రోజులు కూడా సమయం కేటాయించకుండా కేంద్రాలను ఏర్పాటు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ పథకం ప్రకారమే టీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి నిర్వాసితులు, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం, ప్రజాభిప్రాయ సేకరణ అధికారులు మౌనపాత్రలో ఉండడాన్ని దుర్మార్గపు చర్యలుగా అభివర్ణించారు. ఈ సందర్భంగానే ప్రతిపక్ష నాయకులను పోలీసులు అరెస్టు చేయడం కూడా దుర్మార్గపు చర్యేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టాలని అన్ని పార్టీలు ముక్త కంఠంతో కోరుతున్నాయని అయితే ప్రతిపక్షాలు రైతులు కోల్పో తున్న భూములకు 2013 చట్టం ప్రకారం నష్ట పరిహారం, పునరావాస ప్యాకేజీని కల్పించాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు.

ఇది కూడా ప్రభుత్వానికి మింగుడు పడకపోవడం విచారకరమన్నారు. నిర్వాసితులు, ప్రతిపక్షాల గొంతు నొక్కడాన్ని సిపిఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

పోరాడి ఓడిన సింధు

వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లోనూ రజతంతోనే సరి

ఫైనల్లో ఓడినా హృదయాలను గెలిచింది



గ్లాస్గో: తెలుగింటి ఆడబిడ్డ...హైదరాబాదీ షట్లర్ పూసర్ల వెంకట సింధు ప్రపంచ బ్యాడి మ్మింటన్ ఛాంపియన్ సిప్ మహిళల సింగిల్స్ తుది సమరంలో పోరాడి ఓటమిపాలైంది. ఎన్నో ఆశల మధ్య ఫైనల్లో అడుగుపెట్టిన సింధు ప్రత్యర్థి జపాన్‌షట్లర్ ఒకుహురచేతిలో ఓటమిపాలై రజతంతో సరి పెట్టు కుంది. హోరాహోరీగా సాగినమ్యాచ్‌లో ఒకుహర విజేతగా నిలిచింది. అంతకు ముందు రెండు సార్లు కాంస్యం సాధించి చరిత్ర సృష్టించిన సింధు...ఈసారి రజతం సాధించింది. పివి సింధు ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో జపాన్ క్రీడాకారిని నొజొామా ఒకుహారా చేతిలో ఓటమి పాలైంది. సింధుపై ఒకుహురా 19-21, 22-10, 20-22 తేడాతో గెలుపొందింది. ఇద్దరు అగ్రశ్రేణి క్రీడాకారిణులు నువ్వా నేను అన్నట్లు 110నిమిషాల పాటు జరిగిన ఫైనల్ పోరులో పివి సింధు శక్తిమేర పోరాడినప్పటికీ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తొలి సెట్‌ను 21-19తో ఒకుహారా పైచేయి సాధించగా...రెండో సెట్‌లో పుంజుకుంది. మలి సెట్‌లో ఓ దశలో సింధు 20-17తో ఆధిక్యం వెల్లింది. ఈదశలో పుంజుకున్న ప్రత్యర్థి వరుసగా మూడు పాయింట్లు సాధించడంతో తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. ఈ స్థితిలో సత్తా చాటిన సింధు 22-20తో రెండో సెట్ గెలుపొందింది. విజేతను నిర్ణయించే కీలకమైన మూడో సెట్‌లో తొలుత ఒకుహర ఆదిపత్యం ప్రదర్శించింది. కానీ వెంటనే తేరుకున్న సింధు...ప్రత్యర్థికి ధీటుగా బదులిచ్చింది. ఇద్దరూ హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ 15-15తో ఉత్కంఠగా సాగింది. చివరి వరకు విజయం కోసం అద్భుతంగా పోరాడారు. సుదీర్ఘమైన ర్యాలీలలో ఒకరికి ఒకరు పోటీగా మరొకరు ఆడటంతో 20-20తో ఇద్దరూ సమ ఉజ్జీలుగా నిలిచారు. కానీ వరుసగా రెండు పాయింట్లు కోల్పోబడంతో నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఒకుహార 22-20తో పైచేయి సాధించడంతో సింధు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఓటమిపాలై రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫైనల్లో పోరాటంలో అలసిపోయానని, సింధు గట్టిపోటీనిచ్చిందని మ్యాచ్ అనంతరం ఒకుహార తెలిపింది. గతంలో రెండు సార్లు ప్రపంచ ఛాంపియన్‌సిప్‌లో కాంస్యంతో సరిపెట్టుకున్న సింధు ఈసారి రజతంతో సంతృప్తి చెందింది.

ఇప్పటికి ఐదు సార్లు తలపడ్డ సింధు-ఒకుహార.

సింధు, ఒకుహార ఇప్పటివరకు ఐదునాలుగు సార్లు తలపడ్డారు. అందులో నాలుగుసార్లు విజయం జపాన్ అమ్మాయిదే కావడం విశేషం రియో ఒలింపిక్స్‌లో సెమీస్‌లో సిందు ఒకుహారకు షాక్ ఇచ్చింది. 21-19, 21-10తో వరుస గేముల్లో చిత్తు చిత్తుగా ఓడించింది. రియో నాటి నుంచి ఫిట్‌నెస్‌తో ఉన్న సింధు స్వర్ణం సాధిస్తుందని అందరూ భావించారు. సింధుకు గతంలో ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో రెండు స్వర్ణాలు సాధించిన అనుభవం కూడా ఉంది. ఒకుహారకు అదిలేదు. అయినప్పటికీ ఒకుహార తన పోరాట పటిమను ప్రదర్శించి అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఎట్టకేలకు విజయం సాధించి స్వర్ణాన్ని ఎగురేసుకపోయింది.

వన్డే సిరీస్ భారత్ కైవసం

వరుసగా మూడో వన్డేలో విజయ సాధించిన భారత్



పల్లెకెలె: ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్ శ్రీలంకల మధ్య పల్లెకెలె వేదికగా జరుగుతున్న మూడో వన్డేలో ఆతిథ్య లంక జట్టుపై టీమిండియా 6వికెట్ల తేడాతో విజయం సాధించి 3-0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంకేయులు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 217 పరుగులు చేశారు. తిరిమన్నె 105బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 80పరుగులతో ఒక్కడే ఆతిథ్య జట్టులో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేశాడు. భారత బౌలర్లు 5 వికెట్లు తీయగా, హార్ధిక్ పాండ్యా, పటేల్, జాదవ్‌లు తలో వికెట్ తీశారు. 218 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా 61 పరుగులకే 4 వికెట్లు కోల్పోయినా ఓపెనర్ రోహిత్ శర్మ 145బంతుల్లో 16ఫోర్లు, రెండు సిక్సర్లతో(124 నాటౌట్) , మాజీ సారథి ధోని 86బంతుల్లో 4ఫోర్లు, ఒక సిక్సర్‌తో (67 నాటౌట్) బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో 45.1 ఓవర్లలో టీమిండియా 218పరుగుల లక్ష్యాన్ని చేధించి విజయం సాధించింది.

5వికెట్లు తీసి లంకను వణికించిన బూమ్రా....

టాస్ గెలిచిన లంక మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు డిక్వెలా, చండీమాల్‌లు ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంకను బూమ్రా ఆదిలోనే దెబ్బతీశాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన నిరోషన్ డిక్వెల్లా (13)ను అయితే జట్టు స్కోరు 18 వద్ద ఎల్‌బి డబ్ల్యుగా పెవిలియన్‌కు చేర్చాడు. జట్టు స్కోరు 28 వద్ద మెండిస్ (1) వికెట్లు చేజార్చుకుని ఆతిథ్య జట్టు కష్టాల్లో పడింది. ఈనేపథ్యంలో క్రీజులోకి వచ్చిన తిరిమనె (80), చండీమాల్ (36)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. వీరిద్దరూ క్రీజులో కుదురుకుని అడపదడపా బౌండరీలు బాదుతూ జట్టు స్కోరు ముందుకు నడిపించారు. వికెట్ల మధ్య పాతుకుపోయిన ఈ జోడీని పాండ్యా విడదీ శాడు. దీంతో 72 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్‌లెవరూ చెప్పుకోదగిన ప్రదర్శన చేయ లేదు. దీంతో లంక జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన లంక బ్యాట్స్‌మెన్‌ను వణికిం చాడు. బుమ్రా కెరీర్‌లో ఇదే తొలి ఐదు వికెట్ల హాల్ కావడం విశేషం. భారత బౌలర్ వన్డేల్లో ఐదు వికెట్ల హాల్ సాధించడం మూడేళ్ల ఇదే తొలిసారి కావడం విశేషం. చివరిసారిగా 2014లో స్టువర్ట్ బిన్నీ బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్లు తీశాడు. రెండో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా లంక కెప్టెన్ ఉపుల్ తరంగపై వేటు పడగా...అతడి స్థానంలో కపుగెదర ఈ మ్యాచ్‌లో జట్టుకు నాయకత్వం వహించాడు. ఉపుల్ తరంగ స్థానంలో జట్టులోకి వచ్చిన తిరమన్నే ఒక్కడే 80 పరుగులతో రాణించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ ఎవరూ పెద్దగా రాణించలేదు. దీంతో లంక జట్టు మరోసారి స్వల్ప స్కోరుకే పరిమతమైంది. లంక బ్యాట్స్‌మెన్‌లో ఐదుగురు రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. దీంతో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ లంక స్వల్ప స్కోరుకే పరిమతమైంది.

సెంచరీతో కదం తొక్కిన రోహిత్

218పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా ఆదిలోనే రెండు వికెట్లు చేజార్చుకుంది. సిరీస్‌లో వీరోచిత ఫామ్‌లో ఉన్న ఓపెనర్ శిఖర్ ధావన్ (5) తక్కువ పరుగులకే వెనుదిరిగాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్ తొలి బంతికి మలింగ షార్ట్‌పిచ్‌లో వేశాడు. ఆఫ్‌సైడ్‌ది ఆఫ్‌స్టంప్ వెళ్లిన బంతిని ధావన్ కట్ చేయడంతో ఇన్‌సైడ్ ఎడ్జ్‌గా బలయ్యాడు. అతడి నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన సారథి కోహ్లీ (3) ఒత్తిడికి గురయ్యాడు. విశ్వా ఫెర్నాండో వేసిన ఆరో ఓవర్ తొలి బంతిని ఫ్లిక్‌చేసిన కోహ్లీ...చమీరా చేతికి చిక్కాడు. ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ 19/2 చేసింది. జట్టు స్కోరు 61 పరుగుల వద్ద 13.5ఓవర్ బంతికి కెఎల్ రాహుల్ (17) ధనుంజయ బౌలింగ్‌లో తిరిమన్నెకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆతర్వాత 15.1ఓవర్ బంతికి జాదవ్ (0) ధనుంజయ్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. 61పరుగులకే 4 వికెట్లు కోల్పోయి టీమిండియా కష్టాల్లో ఉన్న దశలో ఓపెనర్ రోహిత్ శర్మ, మాజీ సారథి ధోని బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేశారు. ఒక పక్క రోహిత్ దాటిగా బ్యాటింగ్ చేస్తుంటే...ధోని నెమ్మదిగా బ్యాటింగ్ చేస్తూ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. ఈక్రమంలో రోహిత్ శర్మ 118 బంతుల్లో 14ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ పూర్తిచేశాడు. కెరీర్‌లో రోహిత్‌కిది 12వ సెంచరీ చేశాడు. వీరిద్దరూ 5వికెట్‌కు 157 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియా 4 వికెట్లకు 218 పరుగులు చేసి 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. రోహిత్ శర్మ (124 నాటౌట్), ధోని (67 నాటౌట్)పరుగులతో నిలిచారు. శ్రీలంక బౌలర్లలో ధనుంజయ 2వికెట్లు తీయగా, మలింగ, ఫెర్నాండో ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత్ 44 ఓవర్లకు టీమిండియా 210 పరుగులు చేసింది. భారత్ లక్ష్యానికి చేరువలో ఉండగా ప్రేక్షకులు గ్రౌండ్‌లోకి బాటిల్స్ విసిరేశారు. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను కొంత సేపు నిలిపివేశారు. కొద్ది సేపటికి మరల మ్యాచ్‌ను ప్రారంభించారు.

గువహాతిలో ఫిఫా అండర్-17 ట్రోఫీ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యమిస్తోన్న ఫిఫా అండర్-17 ప్రపంచ కప్ ట్రోఫీ, ఆతిథ్య సిటి లోగోను ఆవిష్కరించారు. అక్టోబర్ 6 నుంచి ప్రారంభమయ్యే ఫిఫా అండర్-17 ప్రపంచ కప్ టోర్నీకి దేశంలోని ఆరు ప్రధాన నగరాలు ఆతిథ్యమిస్తున్నాయి. టోర్నీలో భాగంగా గౌహతిలో ఒక సెమీఫైనల్ మ్యాచ్‌కు వేదికగా నిర్ణయించారు. అధికారికంగా విజేతకు అందించే ట్రోఫీని గోవా ముఖ్యమంత్రి శర్బానంద్ సోనావాల్ ఈసందర్భంగా ఆవిష్కరించారు. ట్రోఫీని ఆవిష్కరణ చేయడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని, యువతలో ఉత్సాహాన్ని మరింత రెట్టించేందుకు ఈ టోర్నీ దోహదపడుతుందని అన్నారు. టోర్నీ ఆవిష్కరణ కార్య క్రమంలో ప్రపంచకప్ డైరెక్టర్ జేవియర్ సెప్పీ పాల్గొన్నారు. గతవారం ఈ ట్రోఫీని న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియం గేటు వద్ద ప్రదర్శనగా ఉంచారు. మొత్తం మీద 2.5లక్షల మంది ట్రోఫీని తిలకించినట్లు అంచనా.

జోరూట్ అరుదైన రికార్డు



లీడ్స్: దక్షిణా ఫ్రికా స్టార్ బ్యాట్స్‌మెన్ ఎబి డివిలియర్స్ నెలకొల్పిన అరుదైన రికార్డు త్వరలో బద్దలు కాబోతుంది. గతంలో వరుసగా 12 టెస్టుల్లో హాఫ్ సెంచరీలు సాధించిన డివిలియర్స్ సరికొత్త రికార్డును నెలకొల్పిన సంగతి తెలిసిందే. ఇపు ్పడు ఆ రికార్డును ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్ జో రూట్ సమం చేశాడు. ప్రస్తుతం లీడ్స్‌లో వెస్టిండీస్‌తో జరగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో జో రూట్ ఈ ఘనత సాధించాడు. జో రూట్‌కి ఇది 31వ హాఫ్ సెంచరీ. వెస్టిండీస్‌పై మూడోది. జో రూట్ తన తొలి హాఫ్ సెంచరీ 2016 అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరంభించాడు. గతంలో వరేంద్ర సెహ్వాగ్, గౌతమ్ గంభీర్, సర్ వివిఎన్ రిచర్డ్స్ వరుసగా 11 టెస్టుల్లో హాఫ్ సెంచరీలు సాధించారు.

భారత్ పారా సైక్లింగ్ జట్టు కోచ్‌గా దత్తాత్రేయ



హైదరాబాద్: తెలంగాణ సైక్లింగ్ సంఘం కార్యదర్శి కె.దత్తాత్రేయ గొప్ప అవకాశాన్ని అంది పుచ్చుకున్నారు. ఆయన పారా సైక్లింగ్ రోడ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. దత్తాత్రేయతో పాటు ఆతిథ్య మెహతా ఫౌండేషన్‌కు ఆదిత్య మెహతాఅసిస్టెంట్ కోచ్‌గా నియమితులయ్యారు. ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3వరకు దక్షిణాఫ్రికాలో జరుగుతుంది.

భీమవరంలో అంతర్రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నమెంటు ప్రారంభం



అంతర్రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపి గోకరాజు గంగరాజు

భీమవరం టౌన్, ఆగస్టు 27, ప్రభాతవార్త: క్రీడాభిమానుల ఆనందోత్సాల మధ్య 73వ సౌత్‌జోన్ అంతరాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గోకరాజు రంగరాజు మెమోరియల్ టోర్నమెంటును నరసాపురం ఎంపి గోకరాజు గంగరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. నాలుగు రోజులు జరిగే పోటీలకు ఆరు రాష్ట్రాలు కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు 150 మంది పాల్గొంటున్నారని నిర్వహకులు తెలపారు. ఎంపి గంగరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ సౌకర్యాలు కల్పించి కేంద్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విశాఖ జిల్లా మందలగిరిలో అంతర్జా తీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ఎంపి యర్రా నారాయణస్వామి, క్లబ్ అధ్య క్షుడు గోకరాజు రామరాజు, అంధ్ర ప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్, టి కృష్ణబాబు, పొత్తూరి బాపిరాజు, కె. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాథ్యూస్ నిర్ణయం సరైంది కాదు : రణతుంగ



కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు కెప్టెన్సీకి గుడ్‌బై చెబుతూ ఏంజెలో మాథ్యూస్ తీసుకున్న నిర్ణయం ఎంతమాత్రం సరైంది కాదని ఆదేశ దిగ్గజ కెప్టెన్ అర్జున రణతుంగ అభిప్రాయపడ్డారు. ఇక్కడ అతను కెప్టెన్సీ నుంచి తప్పుకుంటానని చెబితే శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ ఎల్‌సి) ఎలా అనుమతి ఇచ్చిందని రణతుంగ ప్రశ్నించాడు. మాథ్యూస్ కెప్టెన్సీ నుంచి వైదొలగడానికి అనుమతి ఇవ్వకుండాఉండాల్సిం దన్నాడు. జట్టు అవసరాలదృష్ట్యా అతన్ని మరికొంత కాలం కెప్టెన్‌గా కొనసాగమని ఎస్‌ఎల్‌సి పెద్దలు కోరి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఒకవేళ కెప్టెన్సీ విషయంఓ తనను మాథ్యూస్ అడిగితే అనుమతి ఇచ్చేవాడిని కాదన్నాడు. అందుకు ఇది తగిన సమయం కాదని చెప్పేవాడినని రణతుంగ పేర్కొన్నాడు.

నేను చూసి లంక కెప్టెన్లలో మాథ్యూస్ ఒక అత్యుత్తమ కెప్టెన్. రంజన్ మదుగలే తరువాత ఆస్థాయి ఉన్న కెప్టెన్ మాథ్యూస్. కెప్టెన్సీ నుంచి తప్పుకుంటానని బోర్డుకు చెప్పినప్పుడు అందుకు అనుమతి ఇచ్చి ఉండాల్సింది కాదు.

మాథ్యూస్ నిర్ణయాన్ని కొన్నాళ్లు అలా ఉంచుకోమని బోర్డు చెప్పి ఉండాల్సింది. అది చేయలేకపోవడంతో లంక జట్టు పరిస్థితి పూర్తిగా గాడితప్పింది అని రణతుంగ అభిప్రాయపడ్డాడు. గత సంత్సరం ఆసీస్ వంటి నంబర్ వన్ జట్టు మాథ్యూస్ నేతృత్వంలోని శ్రీలంక వైట్ వాష్ చేసింది. ఆ క్రెడిట్ మాథ్యూస్‌తో పాటు యావత్ జట్టుకి దక్కింది. అయితే జట్టు ఓటములకే మాథ్యూస్‌ను బలి పశువును చేస్తున్నారు. ఇది నిజంగా బాధాకరం. ఈ కారణం చేత మాథ్యూస్ అన్ని ఫార్మట్ల కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పాడు. మాథ్యూస్ సానుకూల ధోరణి గల కెప్టెన్. అతను ఆత్మవిశ్వాసం సడలడానిఇ మా క్రికెట్ బోర్డు కారణం అని రణతుంగా స్పష్టం చేయడం గమనార్హం. కాగా, జూలై నెలలో మాథ్యూస్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.

బాక్సింగ్ చరిత్రలో అత్యంత ఖరీదైన

బౌట్‌లో విజయం మేవెదర్‌దే

రూ.1700కోట్లు పోరు నెగ్గిన అమెరికా దిగ్గజం

లాస్‌వెగాస్: ప్రపంచ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బౌట్...ప్రపంచం మొత్తాన్ని తమవైపు తిప్పుకున్న బౌట్...ఫైట్ ఆఫ్ ద మిలీనియమ్...మొత్తాలనికి ముగిసింది. వెల్టర్ వెయిట్ విభాగంలో ఇప్పటివరకు ఓటమి ఎరుగని మాజీ ప్రపంచ ఛాంపియన్ ఫ్లాయిడ్ మేవెదర్ బాక్సింగ్ రింగ్‌లో తనకు తిరుగులేదని మరోసారి చాటిచెప్పాడు. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ఓటమే ఎరుగని దిగ్గజం ఫ్లాయిడ్ మేవెదర్ బిగ్ బిలియన్ ఫైట్‌లో కానర్ మెక్ గ్రెగర్‌ను ఓడించి మరోసారి బాక్సింగ్ రారాజుగా తానేంటో నిరూపించుకున్నాడు. అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్ షిప్ (యూఎఫ్‌సి) లైట్ వెయిట్ ఛాంపియన్ అయిన ఐరిస్ జాతీయుడు మెక్ గ్రోగర్‌పై మేవెదర్ అనూహ్యం రీతిలో గెలిచాడు. దీంతో కెరీర్‌లో వరుసగా 50వ విజయాన్ని మేవెదర్ నమోదు చేశాడు. 40ఏళ్ల వయసులోనూ ప్రత్యర్థిపై విరుచుకపడిన తీరుఅద్భుతం. మరోవైపు మెక్ గ్రెగోర్ వయసు 28 ఏళ్లు కావడం విశేషం. భారత కాల మానం ప్రకారం ఆదివారం 9గం.లకు లాస్ వెగాస్‌లోని టీ మొబైల్ అరీనాలో జరిగిన ఈ సూపర్ ఫైట్‌లో అమెరికా స్టార్ ఫైటర్ మేవెదదర్ విజేతగా నిలిచాడు. 10 రౌండ్ల పాటు జరిగిన మ్యాచ్‌లో పాయింట్ల ఆధారంగా మేవెదర్ గెలుపొందినట్లు నిర్వాహకులు ప్రకటించారు. తొలి రౌండ్ నుంచి గ్రెగోర్ ఆధిపత్యం కనిపించగా, ఐదో రౌండ్ నుంచి ఆటతీరును మేవెదర్ మార్చేశాడు. ప్రత్యర్థికి ఎంతమాత్రము అవకాశం ఇవ్వకుండా రెచ్చిపోయాడు. పంచ్‌ల వర్షంకురిపిస్తూ ఆధిపత్యం చెలాయించాడు. దీంతో 12 రౌండ్లపాటు జరగాల్సిన బౌట్ 10 రౌండ్లకే ముగిసింది. తొలి రౌండ్‌లో 10 పాయింట్లు సాధించి, ఆపై రెండు, మూడు రౌండ్లలో 9పాయింట్లకు పరిమితమైన మేవెదర్ ఆపై మరే దశలోనూ వెనుదిరిగి చూడలేదు. నాలుగు నుంచి 8 రౌండ్ల వరకు వరుసగా పదేసి పాయింట్ల చొప్పున మేవెదర్ సంపాదించుకోగా, గ్రెగోర్ 9 పాయింట్లకే పరిమితమయ్యాడు. ఇక, కీలకమైన చివరి రౌండ్లలోనూ మేవెదర్ ఆదిపత్యం కొనసాగింది. ఈ బౌట్‌లో గ్రెగోర్ అలసిపోయినట్లు స్పష్టంగా కనిపించాడు. మేవెదర్ పంచ్‌లకు తట్టుకోలేక అలసిపోయిన మెక్ గ్రెగోర్ 10 రౌండ్లో చేతులెత్తేశాడు. మెక్ గ్రెగర్ ప్రస్తుతం అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ (యూఎఫ్‌సి) లైట్ వెయిట్ ఛాంపియన్‌గా ఉన్నాడు. ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బౌట్‌లో నెగ్గిన మేవెదర్‌ను బాక్సింగ్ దిగ్గజాలతో పాటు పలువురు అభినందించారు. ఫైట్ ఆఫ్ ద మిలీనియమ్‌లో గెలిచిన ఫ్లాయిడ్ మేవెదర్‌కు రూ.1280కోట్లు, ఓడిపోయిన మైక్ గ్రెగర్‌కు రూ.400కోట్లు దక్కనున్నాయి. కాగా, ఈ బౌట్‌కు పే ఫర్ వ్యూ ద్వారానే 89.5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.570కోట్లు) వచ్చినట్లు సమాచారం. ఈ బౌట్‌లో నెగ్గిన విజేతకు బహుకరించిన బెల్ట్ కూడా ఎంతో విలువైనది. ఈ బెల్టులో 1.5కిలోల స్వచ్ఛమైన 24కేరట్ల బంగారం, 3,360 వజ్రాలు, 600 ఇంద్రనీలాలు, 160 పచ్చలతో కూడుకుని మొసలి చర్మంతో కూడిన బెల్ట్‌ను విజేతకు అందించనున్నారు. ఇదిలా ఉండగా సూపర్ ఫైట్ ముగిసిన అనంతరం మేవెదర్ తన రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం పకియావ్‌తో మ్యాచ్ అనంతరం బాక్సింగ్‌కు వీడ్కోలు పలికి...తర్వాత మనసు మార్చుకున్నాడు. ఆదివారం కాన్ మెక్‌గ్రెగర్‌తో తలపడ్డాడు. మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా అజేయంగా 50మ్యాచ్‌లు గెలిచిన తొలి బాక్సర్‌గా చరిత్ర సృష్టించాడు. మ్యాచ్‌పూర్తయిన తర్వాత మేవెదర్ మీడియాతో మాట్లాడుతూ...తాను అనుకున్న దానికంటే మెక్‌గ్రెగర్ బలవంతుడని, అతడితో పోటీ కష్టంగానే ఉందని అన్నాడు. మ్యాచ్‌లో వివిధ యాంగిల్స్ ప్రదర్శించాడని తెలిపాడు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/15-17 **Air Surcharge:** Delhi : 40 Ps.